పేజీలు :12
వెల :5/-

# మీడియా టుడే

జాతీయ తెలుగు దినపత్రిక
www.mediatodaydaily.com

CHAIRMAN : K.KOTESWAR RAO(KKR)   మన మీడియా - మన సమాజం

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Rajamandri, Chittur, Visakhapatnam prakasham

సంపుటి : 01   సంచిక : 72   CHAIRMAN : K.KOTESWAR RAO(KKR)   శనివారం 13-6-2026   పేజీలు 12   వేల 5/-

# కిమ్ రాజ్యమే బీజేపీ లక్ష్యం!

## ప్రజల ఓట్లతో పనిలేకుండా గెలిచే ప్రయత్నం

**మీనాక్షి నామినేషన్ తిరస్కరణ.. ఆ కుట్రే**
**గాంధీ 8 గాడ్సే రాజకీయాలు పోయాయి**
**గాంధీ 8 కిమ్ పాలిటిక్స్ మొదలయ్యాయి**
**నితిన్ నబీన్‌తో రిటర్నింగ్ అధికారి కుమ్మక్కు**
**కోర్టులో పిటిషన్ వేసి ఆ సీటు గెల్చుకుంటాం**
**ఆర్వో చేసింది రైటని సుప్రీంకోర్టు చెప్పలేదు**
**దేశంలో ఫిరాయింపులకు ఆద్యుడు కేసీఆరే**
**పవన్ తెలంగాణకు వచ్చి పోటీ చేయొచ్చు**
**ఈటలపై బ్యానర్లు కిషన్‌రెడ్డి మనుషుల పనే**
**గూఢచర్యమే కేసీఆర్‌ను ముంచింది**
**మీడియాతో ఇష్టాగోష్ఠిలో సీఎం రేవంత్ రెడ్డి**

**న్యూఢిల్లీ, జూన్ 12 మీడియా టుడే**
ఇన్నాళ్లు మహాత్మాగాంధీని హత్య చేసిన గాడ్సేను ఆదర్శంగా తీసుకున్న బీజేపీ ఇప్పుడు ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్‌ను ఆదర్శంగా తీసుకుంటోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజలు ఓట్లు వేయకపోయినా అక్రమ పద్ధతులతో ఎన్నికల్లో విజయాలు సాధిస్తోందని చెప్పారు. కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను అక్రమంగా తిరస్కరించడం ద్వారా బీజేపీ దేశ ప్రజాస్వామ్యానికి, మహిళలకు వ్యతిరేకంగా వ్యవహరించిందని మండిపడ్డారు. గాంధేయవాది అయిన మీనాక్షిని రాజ్యసభలో అడుగు పెట్టకుండా చేయడం ద్వారా దేశంలో గాంధేయ సిద్ధాంతాన్ని అంతం చేయాలని కంకణం కట్టుకొని బీజేపీ, ఆర్ఎస్ఎస్ పని చేస్తున్నాయని ముఖ్యమంత్రి ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను కాలరాస్తూ, ప్రతిపక్షాలను అణచివేయడమే లక్ష్యంగా బీజేపీ పాలన కొనసాగుతోందన్నారు. ఓటు చోరీ నుంచి సీటు చోరీ వరకు బీజేపీ దిగజారిందని చెప్పారు. శుక్రవారం ఢిల్లీలోని తన అధికార నివాసంలో ముఖ్యమంత్రి మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఉత్తర కొరియాలో కూడా పేరుకు ఎన్నికలు ఉంటాయని, ప్రజలంతా ఓటేస్తారని, పోలింగ్ బూత్‌లో కిమ్ పార్టీకి సంబంధించిన బటన్ మాత్రమే ఉంటుందని తెలిపారు. భారత ప్రజాస్వామ్యం కూడా అదే దుస్థితికి దిగజారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ప్రజాభిప్రాయంతో సంబంధం లేకుండా విజయం కోసం ఎంతకైనా తెగించే విధానాలను బీజేపీ అవలంబిస్తోందని చెప్పారు. ఆ పార్టీకి కిమ్ ఆదర్శమని అన్నారు. ఇన్నాళ్లు దేశ రాజకీయాలు గాంధీ వర్సెస్ గాడ్సే విధానంలో నడిచాయని, ఇప్పుడు దాన్ని బీజేపీ క్రమంగా గాంధీ వర్సెస్ కిమ్ పద్ధతిలోకి తీసుకెళ్లిందని చెప్పారు. రాజ్యసభ ఎన్నికల ప్రక్రియలో మధ్యప్రదేశ్ రిటర్నింగ్ అధికారి పూర్తిగా బీజేపీ కార్యకర్తలాగా వ్యవహరించారని ముఖ్యమంత్రి మండిపడ్డారు. బీజేపీకి ఒక్క ఓటు కూడా లేనిచోట రాజ్యసభ స్థానాన్ని ఎలా కట్టబెడతారని ప్రశ్నించారు. రిటర్నింగ్ అధికారి బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో కుమ్మక్కు అయ్యారని అన్నారు. బీజేపీ ఒక తప్పు చేసి దాన్ని కప్పిపుచ్చుకొనేందుకు నానా అవస్థలు పడుతోందని అన్నారు. ఇదంతా దేశం చూస్తూనే ఉందని చెప్పారు. ఈ అక్రమంపై న్యాయపోరాటం చేస్తామని, ఎలక్షన్ పిటిషన్ మీద విచారణను ఆర్నెల్లలో ముగించాలని నియమం ఉందని, అక్కడ గెలుచుకుంటామని విశ్వాసం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఎన్నికల పిటిషన్ వేయమని చెప్పిందే తప్ప రిటర్నింగ్ అధికారి చేసింది ఒప్పేనని ఎక్కడా అనలేదని ప్రస్తావించారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఇంత అడ్డగోలుతనం ఎక్కడా చూడలేదని, ఇది ప్రజాస్వామ్యానికే తలవంపు అని వ్యాఖ్యానించారు. 2022లో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన పంచాయతీకి 2025లో ఇన్‌చార్జిగా వచ్చిన మీనాక్షి నటరాజన్‌కు ఏం సంబంధం అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. "ఎఫ్ఐఆర్ లేదు, ఛార్జిషీట్ లేదు, అసలు కేసే లేదు. అలాంటప్పుడు ఎలక్షన్ అఫిడవిట్‌లో ఏమని మెన్షన్ చేయాలి? నోటీసులు ఇచ్చినా అఫిడవిట్‌లో మెన్షన్ చేయాలనే అంశమే ఎలక్షన్ ఫామ్‌లో లేదు. ఎవరు ఎవరిపై ప్రైవేట్ కంప్లయింట్ ఇచ్చినా కోర్టు నోటీసులు ఇష్యూ చేస్తుంది. వివరణ విన్నాక నిర్ణయిస్తుంది. మరి ప్రధాని మోదీపై దేశవ్యాప్తంగా 1000 ప్రైవేట్ ఫిర్యాదులు నమోదైతే, కోర్టు నోటీసులిస్తే.. మోదీ తన అఫిడవిట్‌లో ఆ 1000 నోటీసుల వివరాలు పొందుపరుస్తారా?" అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. మీనాక్షి నటరాజన్ అంశంలో తెలంగాణ కాంగ్రెస్‌ను ముద్దాయిని చేయాలని బీజేపీ వాళ్లు కుట్ర పన్నారని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్‌లకు తాను ఉమ్మడి శత్రువునని, అందుకే తనను ఒంటరిగా ఎదుర్కోలేక కలిసికట్టుగా మాటల యుద్ధం చేస్తున్నారని అన్నారు. సీటు చోరీని పక్కదారి పట్టించేందుకే రెండు పార్టీలు కాంగ్రెస్ పై ఎదురు దాడికి దిగాయన్నారు. కాంగ్రెస్ లో ఏ పార్టీ ఎమ్మెల్యేలూ చేరలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆ పది మందీ తాము బీఆర్ఎస్ ఎమ్మెల్యేలమేనని చెబుతున్నారని తెలిపారు.



ఫిరాయింపులు ఎలా చేయాలో దేశానికి చెప్పిందే కేసీఆర్ అన్నారు. బీజేపీకి కూడా ఆయనే ఆదర్శం అని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో పార్టీల విలీనం ఉంటుంది కానీ, శాసనపక్షం విలీనం ఉండదని, కేసీఆర్ రాజ్యాంగానికే కొత్త సిద్ధాంతం నేర్పారని అన్నారు. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలంగాణకు రావచ్చు, మాట్లాడవచ్చు, ఎన్నికల్లో పోటీ చేయవచ్చు అని రేవంత్ అన్నారు. ఆ హక్కు వారికి ప్రజాస్వామ్యం కల్పించిందని చెప్పారు. అందులో తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడతాం అంటే మాత్రం తెలంగాణ వాళ్లూ అదే విధంగా స్పందిస్తారన్నారు. "పవన్ అన్నారు, పొన్నం కౌంటర్ ఇచ్చారు. అంతటితోనే ఆ కథ ముగిసిపోయింది. సభకు అనుమతి ఇవ్వాలా? వద్దా? అన్నది పోలీసుల ఇష్టం. నా ప్రమేయం ఏముంటుంది? తెలంగాణలో అనేక మంది స్వేచ్ఛగా మాట్లాడుతున్నారు. ధర్నాలు చేస్తున్నారు. వారందరికీ లభించిన అనుమతులు పవన్ కల్యాణ్‌కే ఎందుకు లభించలేదంటే అది పోలీసుల నిర్ణయం. ఏపీలో జగన్‌కు పవన్ ఎందుకు అనుమతి ఇవ్వడం లేదు?" అని ప్రశ్నించారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ వాళ్లను ఇంటి నుంచి బయటికే రాకుండా చేశారని ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అణచివేత విధానాలను ఎప్పుడూ అవలభించదని చెప్పారు. హైడ్రా అనే పదానికి మూలం హిట్లర్ హయాంలోని జర్మనీ నుంచి వచ్చిందని చెబితే తన వ్యాఖ్యలను వక్రీకరించారని సీఎం అన్నారు. రాహుల్‌గాంధీతో జరిగిన భేటీలో మంత్రివర్గ విస్తరణ అంశం అసలు చర్చకే రాలేదని సీఎం స్పష్టం చేశారు.

# బెంగాల్‌లో 4,000 ఈవీఎంలు దగ్ధం

**అన్నీ ఇటీవలి ఎన్నికల్లో వినియోగించినవే..**
**టీఎంసీ కంచుకోట దక్షిణ 24 పరగణాల పరిధిలోని ఈవీఎంలే.. మంటలు వ్యాపించిన తీరుపై రాష్ట్ర మంత్రి సందేహం**
**రంగంలోకి 'సిట్'.. కుట్ర కోణంపై దర్యాప్తు**
**ఓటరు లిస్టులో స్మృతి ఇరానీ పేరు అదృశ్యం!**



**కోల్‌కతా, జూన్ 12: మీడియా టుడే**
పశ్చిమబెంగాల్‌లోని ఓ ప్రభుత్వ భవనంలో జరిగిన అగ్నిప్రమాదంలో దాదాపు 4,000 ఈవీఎంలు దగ్ధమయ్యాయి. కోల్‌కతాలోని అలీపూర్ ప్రాంతంలో ఉన్న తొమ్మిది అంతస్తుల భవనంలో బుధవారం మంటలు చెలరేగాయి. దక్షిణ 24 పరగణాల జిల్లా పరిషత్ కార్యాలయంతో పాటు పలు ప్రభుత్వ విభాగాలు ఈ భవనంలో కొనసాగుతున్నాయి. దగ్ధమైన ఈవీఎంలన్నీ ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగించిన యంత్రాలే. టీఎంసీ కంచుకోట దక్షిణ 24 పరగణాల జిల్లాలోని 10 నియోజకవర్గాలకు చెందినవిగా తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఈ జిల్లా పరిధిలోని మొత్తం 31 స్థానాల్లో టీఎంసీ 21 చోట్ల విజయం సాధించగా, బీజేపీ 10 స్థానాల్లో గెలిచింది. జిల్లా యంత్రాంగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపడానికి శుక్రవారం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు.

**ప్రమాదమా.. ?.. కుట్రా.. ?**

ఎన్నికల ఫలితాలకు ముందు ఈవీఎంల భద్రతపై, వాటిలో ట్యాంపరింగ్ జరిగిందంటూ తృణమూల్ కాంగ్రెస్ తీవ్ర ఆందోళనలు నిర్వహించింది. అయితే, ఇప్పుడు ఎన్నికలు ముగిసి స్పష్టమైన ప్రజాతీర్పుతో అధికారంలోకి వచ్చిన బీజేపీ.. ప్రమాదంపై అనుమానాలు వ్యక్తం చేయడం రాజకీయ విశ్లేషకులను విస్మయానికి గురిచేస్తోంది. అగ్ని ప్రమాద విషయాన్ని ఆ రాష్ట్ర మంత్రి కౌశిక్ చౌదరీ గురువారం ధ్రువీకరించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం మంత్రి కౌశిక్ చౌదరీ మాట్లాడుతూ.. "ఇది సాధారణ అగ్ని ప్రమాదంలా అనిపించడం లేదు. మంటలు వ్యాపించిన తీరు పలు అనుమానాలకు తావిస్తోంది. మొదట రెండు, మూడు అంతస్తుల్లో మంటలు కనిపించాయి. మధ్యలో ఉన్న అంతస్తులకు ఏమీ కాకుండానే.. నేరుగా తొమ్మిది, పదో అంతస్తులకు మంటలు విస్తరించాయి. కుట్ర కోణం దాగి ఉందేమో పరిశీలిస్తున్నాం" అని ప్రకటించడం గమనార్హం. ఫోరెన్సిక్ నివేదిక వస్తేనే పూర్తి విషయాలు తెలుస్తాయని మంత్రి స్పష్టం చేశారు.

# 'నైరుతి' వర్షాలు!


## నెల్లూరులో దంచికొట్టిన వాన



**అమరావతి,జూన్ 12 మీడియా టుడే**
దక్షిణ కోస్తాంధ్ర పరిసరాల్లో ఉన్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శుక్రవారం రాయలసీమలో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిశాయి. అన్నమయ్య జిల్లా కలికిరిలో 30.5, నిమ్మనపల్లిలో 29.5, చిత్తూరు జిల్లా పలమనేరులో 24.7, కర్వేటినగరంలో 21 మిల్లీమీటర్ల వాన పడింది. శనివారం మన్యం, అల్లూరి, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. గంటకు 40-50కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. నైరుతి ప్రభావంతో నెల్లూరు జిల్లా వ్యాప్తంగా శుక్రవా రం సాయంత్రం భీకర గాలులతో వర్షం కురిసింది. హోరు గాలులతో వర్షం పడటంతో భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈదురుగాలులకు ఆత్మకూరు సచివాలయం సమీపంలో విద్యుత్ స్తంభం కూలిపోయింది. తిరుమలలో శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో నల్లటి మేఘాలు కప్పేశాయి. ఆతర్వాత వర్షం జోరుగా కురిసింది. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తులు ఇబ్బంది పడ్డారు.

# హుజూరాబాద్ బీఆర్ఎస్ కంచుకోట

## - మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు



**జమ్మికుంట, జూన్ 12 మీడియా టుడే**
హుజూరాబాద్ బీఆర్ఎస్ కంచుకోట అని, ఉప ఎన్నిక మినహా అన్ని ఎన్నికల్లో ఇక్కడ గులాబీ జెండా ఎగిరిందని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. శుక్రవారం జమ్మికుంట పట్టణంలోని ఎంపీఆర్ గార్డెన్‌లో హుజూరాబాద్ నియోజకవర్గ పార్టీ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ హుజూరాబాద్‌పై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక అభిమానం ఉందన్నారు. రైతుబంధు, దళితబంధు పథకాలను ఇక్కడి నుండి ప్రారం భిచారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నిక సమయంలో ఇచ్చిన ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. రైతు డిస్కంను ఏర్పాటు చేసి వ్యవసాయ విద్యుత్ సరఫరాను రోజుకు ఆరు గంటలకు పరిమితం చేసే పరిస్థితి వస్తుంద న్నారు. రైతుల అవసరాలకు నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం ఇతర కార్యక్రమాలు, హెలికాప్టర్ల కొనుగోళ్లకు మాత్రం భారిగా ఖర్చు చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెకొందని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా దక్కవన్నారు. హుజూరాబాద్ డంపింగ్ యార్డు సమస్యను అసెంబ్లీలో ప్రస్తావిస్తామని, మేడిగడ్డ మరమ్మత్తులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసే పరిస్థితి లేదని, తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తి చేస్తామన్నారు.

# ప్రజాసేవకు పునరంకితం

**పెత్తందార్లం కాదు.. ప్రజా సేవకులం**
**తిరుపతి విజయోత్సవ సభలో సీఎం చంద్రబాబు**

**తిరుపతి, జూన్ 12 మీడియా టుడే**
రాష్ట్రానికి తాము పెత్తందారులం కాదని, ప్రజా సేవకులమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కూటమి పాలన రెండేళ్ల విజయోత్సవంతో ప్రజాసేవకు పునరంకితమవుతున్నామని భావోద్వేగంతో ప్రకటించారు. శుక్రవారం మధ్యాహ్నం తిరుపతి నగర శివారులో దామినేడు సమీపంలో 'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం' పేరిట నిర్వహించిన బహిరంగ సభను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రి లోకేశ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం భారీ సంఖ్యలో హాజరైన కూటమి పార్టీల శ్రేణులను, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం పూర్తి పారదర్శకతతో నిర్ణయాలు తీసుకుంటుంటే.. గొడ్డలి పార్టీ లేనిపోని దుష్ప్రచారాలు చేస్తోందని ఆరోపించారు. వైసీపీ నేతలకు అభివృద్ధిపరంగా ఒక లక్ష్యం, విజన్ అంటూ ఏదీ లేదని.. వారికున్నదల్లా విషపూరిత మనస్తత్వమేనని ధ్వజమెత్తారు. మద్యనిషేధం అమలు చేశాకే ఓట్లు అడుగుతానన్న వ్యక్తి జే బ్రాండ్లతో ప్రజారోగ్యాన్ని దెబ్బతీశారని, మహిళల మంగళసూత్రాలను తెంచారని ఆరోపించారు. వారంలో సీపీఎస్ రద్దు చేస్తామని ఉద్యోగులకు హామీ ఇచ్చి.. రద్దు చేయకపోగా వారిని వేధించుకు తిన్నారని గుర్తుచేశారు. జాబ్ క్యాలెండర్ అని ఘనంగా ప్రకటించి ఒక్కసారి కూడా నోటిఫికేషన్ జారీ చేయలేదని, అమరావతిపై ఊసరవెల్లి రాజకీయాలు చేశారని.. ఇపుడు మావిగన్ అంటూ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అది మావిగనో లేక వాటికనో అని ఎద్దేవాచేశారు. అమరావతిని ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు గత ఎన్నికల్లో ప్రజలు విజ్ఞత ప్రదర్శించారని కొనియాడారు. 57 శాతం ఓటు షేర్‌తో, 90 శాతం సీట్లు ఇచ్చి కూటమిని గెలిపించిన ఘనత వారిదేనన్నారు. పాలనను గాడిలో పెట్టి వారి నమ్మకాన్ని నిలబెట్టుకున్నామన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగున్నాయని, రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సంపూర్ణ సహకారం అందిస్తోందని తెలిపారు. పోలవరం, అమరావతి, విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ సహా కీలక అంశాల్లో అండగా నిలిచిందన్నారు. ప్రధానమంత్రిగా 12 ఏళ్లు పూర్తి చేసుకున్న మోదీని ఈ సందర్భంగా అభినందించారు. సీఎం ఇంకా ఏమన్నారంటే.. రెండేళ్ల కిందట ఇదే రోజు ప్రజల ఆశీర్వాదంతో కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. ప్రధాని మోదీ, పవన్ కల్యాణ్‌తో కలిసి 'ప్రజాస్వామ్యాన్ని గెలిపిద్దాం.. రాష్ట్రాన్ని కాపాడదాం' అని పిలుపిచ్చాం. దానికి స్పందించిన ప్రజలు కూటమికి ఘన విజయాన్ని కట్టబెట్టారు. 2014లో రాష్ట్రాన్ని విభజన కష్టాలు చుట్టుముట్టాయి. 2019-24 మధ్య వైసీపీ పాలనతో రాష్ట్రంలో విధ్వంసం నెలకొంది. అన్ని రంగాల్లో సంక్షోభం.. వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయి.





# ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేం

**రాజ్యాంగంలోని ఆర్టికల్ 329(బి) దీన్నే స్పష్టం చేస్తోంది**
**గతంలో కూడా ఎన్నడూ కోర్టులు జోక్యం చేసుకోలేదు**
**ఎన్నికల వివాదాలన్నింటినీ ఒకేలా చూస్తాం: సుప్రీంకోర్టు**

**న్యూఢిల్లీ, జూన్ 12: మీడియా టుడే**
మధ్యప్రదేశ్‌లో రాజ్యసభ ఎన్నికలకు తాను దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను తిరస్కరించటాన్ని వ్యతిరేకిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టి వేసింది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత దాఖలైన పిటిషన్‌పై విచారణకు అనుమతించలేమని, ఈ మేరకు రాజ్యాంగ నిబంధనలు స్పష్టంగా ఉన్నాయని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జస్టిస్ అతుల్ ఎస్ చందూర్కర్ పేర్కొన్నారు. ఎన్నికల వ్యవహారాల్లో కోర్టులు జోక్యం చేసుకోవటానికి వీల్లేదని రాజ్యాగంలోని 329 (బి) ఆర్టికల్ స్పష్టం చేస్తోందని తెలిపారు. తెలంగాణలో తన మీద దాఖలైన ఒక కేసు గురించి వెల్లడించలేదన్న కారణంతో రాజ్యసభ ఎన్నికల్లో తన నామినేషన్‌ను తిరస్కరించటంపై మీనాక్షి నటరాజన్ సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. మీనాక్షి తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఒక అభ్యర్థి నామినేషన్‌ను అక్రమంగా, ఏకపక్షంగా, తప్పుడు నిర్ణయంతో తిరస్కరించినప్పుడు కోర్టులు ఆర్టికల్ 32 కింద జోక్యం చేసుకోవచ్చున్నారు. రిటర్నింగ్ అధికారి ఏకపక్షంగా వ్యవహరించారని, మీనాక్షి నటరాజన్‌పై కేసును కోర్టు గుర్తించలేదని, ఎఫ్ఐఆర్ కూడా దాఖలు చేయలేదని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ చట్టపరంగా, ప్రజాస్వామ్యబద్ధంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత న్యాయవ్యవస్థకు ఉందన్నారు. ఆయన వాదనలపై ధర్మాసనం స్పందిస్తూ.. ఎన్నికల వ్యవహారాల్లోని అభ్యంతరాలపై జోక్యం చేసుకోవాలని ఆర్టికల్ 32 కింద సుప్రీంకోర్టు ఎదుట, ఆర్టికల్ 226 కింద హైకోర్టు ఎదుట పలుమార్లు పిటిషన్లు దాఖలయ్యాయని గుర్తు చేసింది. అయితే, రాజ్యాంగంలోని 329 (బి) ఆర్టికల్‌కు అనుగుణంగా.. వీటిల్లో జోక్యం చేసుకోవటానికి సుప్రీంకోర్టు ఎన్నడూ అంగీకరించలేదని తెలిపింది. ఎన్నికల వివాదాలన్న తర్వాత అన్నిటికీ ఒకే నిబంధన వర్తిస్తుందని, వేర్వేరు రకాలుగా ఆ వివాదాలను విభజించి ఆర్టికల్ 329 (బి)కి వ్యతిరేకంగా వ్యవహరించలేమని తెలిపింది. రాజ్యాంగాన్ని అన్వయించే విషయంలో ఇలాంటి వాటిని ప్రోత్సహించలేమని వ్యాఖ్యానించింది. ఎన్నికల ప్రక్రియ దశలో గతంలో ఏ కోర్టు అయినా జోక్యం చేసుకున్న సందర్భాలు ఉన్నాయా అని జస్టిస్ మిశ్రా ప్రశ్నించారు. అన్ని కేసులకూ ఒకే సాధారణ సూత్రాన్ని వర్తించలేం కదా అని సింఘ్వీ పేర్కొన్నారు. మీనాక్షి పిటిషన్‌ను తిరస్కరించిన న్యాయస్థానం.. ఎన్నికల పిటిషన్ వేసుకోవటానికి అనుమతించింది. ఈ పిటిషనరే కాదు.. ఎవరైనా సంబంధిత హైకోర్టును ఈ మేరకు ఆశ్రయించవచ్చునని తెలిపింది (ఎన్నికల ఫలితాన్ని సవాల్ చేస్తూ దాఖలు చేసే పిటిషన్‌ను ఎన్నికల పిటిషన్ అంటారు).



# చిన్నారులకు భద్రత ఎక్కడ?

**ఖమ్మం "పోక్సో కేసు" ఘటనలో చిన్నారికి న్యాయం జరగాలి**

**అనురాధ రావు - బాలల హక్కుల సంఘం అధ్యక్షురాలు**




**బాపట్ల కృష్ణమోహన్, మీడియా టుడే, జూన్ 12:** ఖమ్మంలో 12 సంవత్సరాల చిన్నారి పై రాక్షసుడి ఘాతుకం.అభం శుభం తెలియని అమాయక పసి పిల్లల పై అఘాయిత్యాలు. మాయమాటలు చెప్పి దాడులు.జాన్ 6,2026 న రాపర్తి నగర్ అపార్ట్ మెంట్ లో 49 సంవత్సరాల మహమ్మద్ గౌస్ అనేవ్యక్తి బాలికను మాయమాటలు చెప్పి 4వ అంతస్తు మీదకు తీసుకెళ్ళి, బాలికపై అత్యాచారానికి పాల్పిడ్డాడు. ఆ పాప అరవడంతో 4వ అంతస్తునుండి తోసేసాడు కిరాతకుడు.అ బాలిక కొత్త గూడెం నుండి తాతయ్య దగ్గరికి వస్తే ఈ ఘటన జరిగింది. పాప తాతయ్య అపార్ట్ మెంట్ వాచేమెన్. 4వ అంతస్తు నుండి పడడంతో పాపకు పక్క ఎముకలు, వెన్నుపాము, కాళ్ళు ,చేతులకు గాయాలు అయ్యాయి. పాపను వెంటనే దగ్గర్లోని హాస్పిటల్ కు తీసుకు వెళ్లారు,పాప స్పృహ కోల్పోవడం తో రెండవ రోజు ఈ విషయాలు తల్లిదండ్రులకు చెప్పింది.వెంటనే కేసు నమోదు చేశారు.నిందితుడిపై **POCSO (Protection of Children from Sexual Offences) Act,** 2012 కేసు,హత్యాయత్నం – భారతీయ న్యాయ సంహిత (దీచీూ) చట్టం ప్రకారం హత్యాయత్నం (ఊ్వఎజ్ౌ శీ ఎబతీసవతీ) ప్రకారం కేసు నమోదు చేశారు, జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు.పాపకు న్యాయం జరగాలి, ప్రభుత్వం పూర్తి బాధ్యతగా పాపకు సరైన వైద్యం చేయించాలి, వారికి అండగా ఉండాలి.ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా నిందితుడికి కఠినంగా శిక్ష విధించాలి.చిన్నారులకు రక్షణ కల్పించాలి,పాపకు వైద్యం, చదువు ఖర్చులను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని బాలల హక్కుల సంఘం డిమాండ్.

# భూమాఫియా ముందు చట్టం మోకరిల్లిందా

**కోర్టు ఆదేశాలకు విలువ లేదా - మతిస్థిమితం లేని మహిళ భూములపై కన్నేసిన భూమాఫియా ఆరోపణలు**

**చిత్తలూరులో కలకలం**

**బాపట్ల కృష్ణమోహన్, మీడియా టుడే, జూన్ 12:** నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామంలో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ఒక ప్రశ్న వెంటాడుతోంది...ఈ రాష్ట్రంలో చట్టం బలంగా ఉందా..? లేక భూమాఫియా బలంగా ఉందా.. ఖీ×=లో నమోదైన ఫిర్యాదు ప్రకారం, గత నాలుగు దశాబ్దాలుగా మానసిక అనారోగ్యంతో (సైకోసిస్) బాధపడుతూ మతిస్థిమితం సరిగా లేని మోదుగు పూలమ్మకు చెందిన సుమారు 3 ఎకరాల 10 గుంటల వ్యవసాయ భూమిని కాజేయడానికి కుట్ర జరిగిందని ఆరోపణలు ఉన్నాయి. ఫిర్యాదుదారు మోదుగు సరిత ఆరోపణల ప్రకారం, కోమిడి వీరారెడ్డి, కోమిడి అరుణమ్మ ఏ అరుణ, కోమిడి సతీష్ రెడ్డి, కొత్తపల్లి నర్సయ్య, జి. లవకుశ, బి. లింగయ్య, గుడిపల్లి రామ్ రెడ్డి తో పాటు మరికొందరు వ్యక్తులు కలిసి నకిలీ పత్రాలు, నకిలీ అమ్మకపు ఒప్పందాలు సృష్టించి భూమిపై హక్కులు సాధించేందుకు ప్రయత్నించారని ఖీ×=లో పేర్కొనబడింది.బాధితుల వాదన ప్రకారం, రెవెన్యూ వ్యవస్థ, పోలీసు వ్యవస్థ, కొందరు ప్రభావశీల వ్యక్తులు మరియు ఇతర మద్దతుదారులు కలిసి ఒక భూమాఫియాగా వ్యవహరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి .ఇది కేవలం ఒక భూమి వివాదం కాదు...మతిస్థిమితం లేని మహిళ ఆస్తిని కాపాడుకునే హక్కు వర్సెస్ అధికార అహంకారం మధ్య జరుగుతున్న పోరాటం.కోర్టు ఆదేశాల మేరకు క్రైం నెం.73/2026గా కేసు నమోదు అయినప్పటికీ, నెలలు గడుస్తున్నా బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం జరగలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోర్టు ఆదేశాల తర్వాత కూడా వివాదం కొనసాగుతుండటం అనేక ప్రశ్నలకు తావిస్తోంది.ఇంకా బాధాకరమైన విషయం ఏమిటంటే...ఖీ×=లోని ఫిర్యాదు ప్రకారం, నిందితులు భూమిలోకి అక్రమంగా ప్రవేశించి ఆక్రమణ యత్నాలు చేశారని, బాధిత కుటుంబ సభ్యులను బెదిరించారని, ప్రాణహాని హెచ్చరికలు కూడా చేశారని ఆరోపించబడింది.భూమి యజమానులు భయపడుతున్నారుఆరోపణలు ఎదుర్కొంటున్నవారు బహిరం గంగా తిరుగుతున్నారు..ఫిర్యాదుదారులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. వ్యవస్థ మాత్రం మౌనం వహిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి..ఇది ప్రజాస్వామ్యమా..? లేక బలవంతుల రాజ్యమా.ఒక మతిస్థిమితం లేని మహిళ ఆస్తిని కాపాడుకోవడానికి ఆమె కుటుంబం కోర్టుల చుట్టూ, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది. .కోర్టు ఆదేశాలు అమలు కాకపోతే..పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులు ఫలితం ఇవ్వకపోతే.రెవెన్యూ రికార్డులు రక్షణ కల్పించకపోతే.సామాన్యుడు ఎవరిని నమ్మాలి. భూమాఫియాకు రాజకీయ అండ ఉందా.అధికార అండ ఉందా. లేక వ్యవస్థలోని కొందరి మౌన సహకారమా.ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉంది.ఈ రోజు చిత్తలూరులో జరుగు ున్నది ఒక కుటుంబానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు.. .రేపు ప్రతి రైతుకు, ప్రతి భూయజమానికి, ప్రతి సామాన్యుడికి ఎదురయ్యే ప్రమాదానికి సంకేతం. మతిస్థిమితం లేని మహిళ ఆస్తుల విషయంలో నమోదైన ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరగాలి...కోర్టు ఆదేశాలు పూర్తిగా అమలు కావాలి...బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలి.ఆరోపణల్లో నిజానిజాలు వెలికి తీయాలి...దోషులు ఎవరైనా చట్టం ముందు నిలబడాలి...లేకపోతే ప్రజల్లో ఒకే అభిప్రాయం బలపడుతుంది. .."భూమి ఉన్న పేదవాడికి చట్టం రక్షణ ఇవ్వదని... భూమాఫియాకు మాత్రమే వ్యవస్థ అండగా నిలుస్తుందని"




# గద్వాల జిల్లా గ్రంథాలయానికి తాళం.. పాఠకుల ఆందోళన

**గ్రంథాలయంలో వెంటాడుతున్న సమస్యలను తీర్చాలని డిమాండ్**

**మద్దతు తెలిపిన బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు మరియు జోగులాంబ గద్వాల జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య**



**గద్వాల జిల్లా మీడియా టుడే ప్రతినిధి జి నాగరా (జూన్ 12)** రాష్ట్రంలో గ్రంథాలయాల పైన చిన్నచూపు చూస్తున్న రేవంత్ రెడ్డి సర్కార్ తక్షణమే నిర్లక్ష్యం విడనాడీ గ్రంథాలయాల్లో మౌలిక సదుపా యాలు కల్పించాలని డిమాండ్.తక్షణమే జాబ్ నోటిఫికేషన్లు విడుదల చేయాలి నడిగడ్డ లో ప్రభుత్వంలో ఉన్న పాలకులకు, ప్రజా ప్రతినిధులకు గ్రంథాలయం పైన చిత్తశుద్ధి లేకపోవడం సిగ్గుచేటు అని అన్నారు.గద్వాల పట్టణంలోని జిల్లా గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలపై శుక్రవారం పాఠకులు ఆందోళనకు దిగారు. గ్రంథాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం వ్యక్తం చేస్తున్న పాఠకులకు బిఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కురువ పల్లయ్య మద్దతు తెలిపారు ఈ సందర్భంగా బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కురువ పల్లయ్య వారు మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న సమయంలో ఒక్కొక్క చిన్న గదులలో 20 మందికి పైగా పాఠకులు చదువుకోవాల్సిన పరిస్థితి ఉందని ఆరోపించారు. ప్యాన్లు, కుర్చీలు, తాగునీటి వంటి కనీస సౌకర్యాలు కూడా అందుబాటులో లేవని విమర్శించారు. ముఖ్యంగా బాత్రూంల సమస్య తీవ్రంగా ఉంది. మహిళా పాఠకులకు ఒక్క బాత్రూం బాయ్స్ కూడా ఒకటే ఉన్నది.దీనివల్ల చాలా తీవ్రమైన ఇబ్బందులకు పాఠకులు గురవుతున్నారు ఉన్న బాత్రూంలో కూడా దుర్గంధం వాసన వెదజల్లుతుంది. చుట్టుపక్కల నిలబడే పరిస్థితి లేదు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, అధికారులు స్పందించే వరకు గ్రంథాలయాన్ని తెరవబోమని హెచ్చరించారు. ఇక్కడున్న గ్రంథాలయ అధికారులు కానీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ గాని సమస్యలు పట్టించుకునే పరిస్థితి లేదు గ్రంథాలయంలో ఎక్కడికక్కడే దుమ్ము దూళి బూజుతో నిండి ఉన్నది. గ్రంథాలయం లోపల వాతావరణం పూర్తిగా అపరిశుభ్రం వెంటాడుతున్నది దీన్ని శుభ్రం చేసే పరిస్థితి లేదు అని అన్నారు.తక్షణమే గ్రంథాలయంలోని సమస్యలను తీర్చాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున రోడ్లపై కొచ్చి ఎక్కడికక్కడే ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తూ పోరాటం చేస్తామని కురువ పల్లయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మద్దతు తెలిపిన పివైఎల్ దానయ్య గ్రంథాలయ పాఠకులు బండారి అభిషేక్, మాధవ్, కిరణ్ , నటరాజ్, చక్రవర్తి, రాము, కృష్ణ, శ్యామల, ప్రియా దర్శిని, లక్ష్మి,పల్లవి, మానస, మధుప్రియ భద్రీనాథ్,అమృథ్, చంద్రశేఖర్ తదితరులు.

# ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్- బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు**

**డిప్ విధానంలో విద్యార్థుల ఎంపిక**



**గద్వాల జిల్లా మీడియా టుడే ప్రతినిధి జి నాగరాజు (జూన్ 12)** అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదువుకునే అవకాశం కల్పిస్తుందని, ఎంపికైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో 2026–27 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదువుకునేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను లక్కీ డిప్ విధానంలో కలెక్టర్ ఎంపిక చేశారు. నాన్ రెసిడెన్షియల్ ఒకటవ తరగతిలో ప్రవేశాలకు మొత్తం 57 సీట్లు ఉండగా, మొత్తం 265 మంది దరఖాస్తు చేసుకోగా గ్రూప్ 1, 2, 3లకు సంబంధించి మహిళా రిజర్వేషన్స్, జనరల్ కోటాలో నిబంధనల ప్రకారం డిప్ ద్వారా విద్యార్థులను ఎంపిక చేశారు. రెసిడెన్షియల్ ఐదవ తరగతిలో ప్రవేశాలకు మొత్తం 59 సీట్లు ఉండగా గ్రూప్ 1, 2, 3లకు సంబంధించి మొత్తం 310 మంది దరఖాస్తు చేసుకోవడంతో అర్హులైన వారిలో నుంచి డిప్ విధానంలో విద్యార్థులను ఎంపిక చేశారు. వివిధ గ్రూపులకు సంబంధించి వెయిటింగ్ లిస్టు ప్రాతిపదికన కొంతమంది విద్యార్థులను కూడా డిప్ విధానంలో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎంపికైన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సుషిత, ఏఎస్సిడబ్ల్యూఓ నాగరాజు, సెక్టోరియల్ అధికారి కర్రెప్ప, బీచుపల్లి గురుకుల విద్యాలయ ప్రిన్సిపల్ రామాంజనేయులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ ఎమ్ఎల్ఏ "పీఏ" ఆలేటి రమేష్‌కు MLA ఆత్మీయ సన్మానం

**ఆలేటి రమేశ్ పుట్టిన రోజు వేడుక**

**ఘనంగా నిర్వహించిన మీూా బండారి లక్ష్మారెడ్డి**



**బాపట్ల కృష్ణమోహన్, మీడియా టుడే, జూన్ 12:** ఉప్పల్ నియోజకవర్గ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి తన వ్యక్తిగత సహాయకుడు (పీఏ) ఆలేటి రమేశ్ పుట్టిన రోజు సందర్భంగా, హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆలేటి రమేశ్ ను అభినందిస్తూ, ప్రజా ప్రతినిధి కార్యాలయ కార్యకలాపాల్లో సమన్వయంతో, నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని అన్నారు.ప్రజా సమస్యల పరిష్కారంలో, నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాల అమలులో సహకరిస్తూ, ఎల్లప్పుడూ సేవాభావంతో పనిచేస్తున్న రమేశ్ గారి కృషిని ఎమ్మెల్యే ప్రశంసించారు.ఆలేటి రమేశ్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు, మంచి ఆరోగ్యం, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు.

# డ్రగ్స్, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి

**దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి**

**వనపర్తి జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో**

**ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలి : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**మాదకద్రవ్యాల బారిన పడి యువత జీవితాన్ని నాశనం చేసుకోవద్దు, ఎవరైనా డ్రగ్స్ అనుమానితులు ఉంటే పోలీసు శాఖకు సమాచారం ఇవ్వా**

**: జిల్లా ఎస్పీ సునీత రెడ్డి**

**కొత్తకోటలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహణ**




**వనపర్తి జిల్లా మీడియా టుడే ప్రతినిధి సి రమేష్ రెడ్డి (జూన్ 12)** ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించేందుకు వనపర్తి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తకోట పట్టణంలో 2కే రన్ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కొత్తకోట చౌరస్తా వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన అతిథులు, ఏటీఆర్ కన్వెన్షన్ వరకు నిర్వహించిన 2కే రన్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రజలందరితో కలిసి యాంటీ డ్రగ్స్ ప్రతిజ్ఞ చేయించారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకునిరూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన బాల కార్మిక, బాల్య వివాహాల నిర్మూలన అవగాహన పోస్టర్లను ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, డ్రగ్స్ బారిన పడి ఎంతోమంది యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రగ్స్ నియంత్రణ విషయంలో అత్యంత సీరియస్‌గా ఉన్నారని, ఈగల్ పేరుతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. డ్రగ్స్‌ను అరికట్టడం ప్రభుత్వంతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం అధికారులకు అందించాలని, సమాచారాన్ని గోప్యంగా ఉంచబడుతుందని హామీ ఇచ్చారు.జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ, ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం చివరి రోజున డ్రగ్స్ నిర్మూలనపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమన్నారు. డ్రగ్స్ అనే మహమ్మారి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చుట్టుపక్కల అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై పర్యవేక్షణ ఉంచి అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. వనపర్తి జిల్లాను పూర్తిగా డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి మాట్లాడుతూ, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. యువత తెలియకుండానే డ్రగ్స్‌కు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ సేవించేవారు, లేదా సరఫరా చేసేవారికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 1908 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని, వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యా సంస్థలు, గ్రామాలు, కాలనీల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేసి డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా తెలంగాణ మోడల్ స్కూల్ లో చదివిన విద్యార్థినికి ఇంటర్మీడియట్లో అత్యుత్తమ మార్కులు వచ్చిన విద్యార్థినికి ముఖ్య అతిథులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా, కొత్తకోట మున్సిపల్ చైర్ పర్సన్ అరుణ శ్రీనివాస్, వైస్ చైర్ పర్సన్ సునీత పల్లవి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రశాంత్, పోలీసు శాఖ అధికారులు, కొత్తకోట వాకింగ్ అసోసియేషన్ల సభ్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, యువత మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



మీడియా టుడే
శనివారం, జూన్ 13, 2026

# విద్యార్థులకు సురక్షిత వాతావరణం కల్పించాలి

**పాఠశాలల పునఃప్రారంభానికి ముందే హాస్టళ్లలో పరిశుభ్రత, భద్రతా చర్యలు తప్పనిసరిగా చేపట్టాలి.**

**విద్యార్థుల భద్రత కోసం మెగా శానిటేషన్ కార్యక్రమం-డయాలసిస్ సెంటర్ ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి.**

**రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క.**



**ములుగు జిల్లా జూన్ 12(మీడియా టుడే)** పాఠశాలలు, వసతి గృహాలలో విద్యార్థులకు సురక్షిత వాతావరణం కల్పించాలని, పాఠశాలల పునఃప్రారంభానికి ముందే హాస్టళ్లలో పరిశుభ్రత, భద్రతా చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని, విద్యార్థుల భద్రత కోసం మెగా శానిటేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, డయాలసిస్ సెంటర్ ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.శుక్రవారం ములుగు జిల్లా కేంద్రంలోని గడిగడ్డ షెడ్యూల్ కులాల బాలికల వసతి గృహంలో నిర్వహించిన శానిటేషన్ డ్రైవ్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి పాల్గొని వసతి గృహంలోని గదులను పరిశీలించారు.అనంతరం ములుగు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి క్రిటికల్ కేర్ విభాగము లోని,డయాలసిస్ యూనిట్,ఎమర్జెన్సీ వార్డు లను మంత్రి దనసరి అనసూయ సీతక్క,జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భాల్లో మంత్రి దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ, విద్యార్థులు పాఠశాలలు, వసతి గృహాలకు చేరుకునే ముందు వసతి గదులు, తరగతి గదులు, వంటశాలలు, హాస్టళ్ల పరిసరాలు పూర్తిగా పరిశుభ్రంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు .సెలవుల సమయంలో మూసివున్న భవనాల్లో పాములు, తేళ్లు, జెర్రులు వంటి ప్రమాదకర జీవులు చేరే అవకాశం ఉన్నందున పిల్లల భద్రత దృష్ట్యా స్కూల్ రీఓపెనింగ్‌కు ముందే ప్రత్యేక మెగా శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో డీఈఓ, హాస్టల్ వార్డెన్లు, ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ, సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మెగా శానిటేషన్ కార్యక్రమానికి అవసరమైన సూచనలు జారీ చేశామని తెలిపారు. అందులో భాగంగానే జిల్లాలోని పాఠశాలలు, హాస్టళ్లలో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు.పిల్లలు వచ్చిన తర్వాత ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం అత్యంత ముఖ్యమని, ఈ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేస్తే విద్యార్థులకు మరింత సురక్షిత వాతావరణం కల్పించవచ్చని తెలిపారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, రోగులకు కల్పిస్తున్న సదుపాయాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా నిర్మాణంలో ఉన్న డయాలసిస్ సెంటర్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ వికాస్ మీనా, గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, సూపరిండెంట్ చంద్రశేఖర్, మున్సిపాలిటీ చైర్ పర్సన్ చింతనిప్పుల చంద్రకళ,స్థానిక కాన్సిలర్లు,జిల్లా అధికారులు, వైద్యాధికారులు,కో ఆప్షన్ సభ్యులు,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాలువలో అడ్డంకులు తొలగించాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్ - దుమ్ముగూడెం పీహెచ్‌సీపై ఆకస్మిక తనిఖీ.**

**- రైతుల అవసరాలు, ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో వాసు,జూన్ 12(మీడియా టుడే):** దుమ్ముగూడెం మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం తాలిపేరు ప్రాజెక్టు ఎడమ కాలువ, దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.మొదట వీరభద్రపురం గ్రామ పరిధిలోని తాలిపేరు ఎడమ కాలువను పరిశీలించిన కలెక్టర్, కాలువలో పెరిగిన గడ్డి, చెత్త, పూడికను తొలగించి నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తాలిపేరు ప్రాజెక్టు ద్వారా 24,700 ఎకరాలకు సాగునీరు అందుతుండగా, ఎడమ కాలువ ద్వారా 21,100 ఎకరాల ఆయకట్టుకు నీటి సరఫరా జరుగుతోందని అధికారులు వివరించారు. చివరి ఆయకట్టు భూముల వరకు సాగునీరు సకాలంలో అందేలా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు.అనంతరం దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఇన్‌పేషెంట్ వార్డును సందర్శించి రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది హాజరు, ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ రిజిస్టర్లు, ఔషధ నిల్వలను పరిశీలించారు.ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల కోసం వచ్చిన విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, సర్టిఫికెట్ల జారీ విధానంపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పాము కాటు, తేలు కాటుకు అవసరమైన అత్యవసర మందులు ఎల్లప్పుడూ అందు బాటులో ఉండేలా చూడాలని, చికిత్సా విధా ాలను కచ్చిత ంగా అమలు చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు సాగునీరు సకాలంలో అందించడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన, సత్వర వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.ఈ పరిశీలనలో తహసీల్దార్ అశోక్ కుమార్, ఇరిగేషన్ ఈఈ జానీ, డాక్టర్ రుక్మాకర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# పోలీసు సిబ్బంది ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యం

**పోలీస్ సిబ్బందికి గుండె వైద్య పరీక్షలు -పోలీస్ కమిషనర్ సునీల్ దత్**



**మీడియా టుడే ఖమ్మం ఆర్సి :** పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల ఆరోగ్యానికి పోలీస్ శాఖ ప్రాధాన్యమిస్తోందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. ఖమ్మం ఏఆర్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో హైదరాబాద్ యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఈసీజీ, టూడీ ఈకో వైద్య పరీక్షలు నిర్వహించారు .వైద్య శిభిరాన్ని ప్రారంభించిన పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ..ఆరోగ్యంగా ఉంటేనే విధులను సక్రమంగా నిర్వహించగలు గుతారని, కుటుంబంలో ప్రశాంత ఉంటుందన్నారు. స్వీయ ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విధినిర్వహణలో పోలీస్ సిబ్బంది ఎదుర్కొనే ఒత్తిడి కారణంగా గుండె జబ్బులు, ప్రాణాంతక సమస్యలను ముందుగానే గుర్తించి నివారించడానికి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమైన గుండె వైద్య పరీక్షలు ఈసీజీ,టూడీ ఈకో పరీక్షలను యశోద వంటి ప్రముఖ ఆసుపత్రుల సహకారంతో ఉచిత మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి, సిబ్బందికి ఈ ఆరోగ్య ప్రొఫైల్స్‌ను అందిస్తున్నాయట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ యశోద హాస్పిటల్ గుండె వైద్య నిపుణులు భరత్ రెడ్డి, సీనియర్ మేనేజర్ వినయ్ కుమార్, ఎస్బి ఏసీపీ మహేష్, ఏ ఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, నర్సయ్య, ఆర్ఐ లు కామరాజు, శ్రీశైలం, సురేష్ సాంబశివరావు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలను నియంత్రించాలి

**రోడ్డు భద్రత నియమాలను ఉల్లంఘించొద్దు - జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్ జిల్లా మీడియా టుడే ప్రతినిధి జూన్ 12**

శుక్రవారం కలెక్టరేట్లోని మీటింగ్ హాల్లో జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ, రహదారి భద్రతా చర్యల అమలు ,మత్తు పదార్థాల నిర్మూలనపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించరూ.ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి అవసరమైన హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్టులు వినియోగించడం, ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు.అదేవిధంగా జిల్లాలో మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు, యువతలో మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచి, చట్ట విరుద్ధంగా మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.రోడ్డు



భద్రత, మత్తు పదార్థాల నిర్మూలన విషయంలో ప్రతి శాఖ తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో, ఆర్ అండ్ బి ఈ, ఈ వేణు, డీఎస్పీలు ,జిల్లా రవాణా శాఖ అధికారి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, విద్యాశాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు ,ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# షార్ట్ సర్క్యూట్ తో దగ్ధమైన ఇల్లు

**దాదాపు 8 నుండి 10 లక్షల ఆస్తి నష్టం**

**జగిత్యాల మీడియా టుడే- జూన్ 12**




జగిత్యాల పట్టణంలోని స్థానిక మూర్తి బజార్ 40 వ వార్డులో గల రాపర్తి గంగాధర్ కు చెందిన పెంకుటి ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కు గురైఅగ్నికి ఆహుతి అయింది. ఈ ప్రమాదంలో ఐదు లక్షల వరకు కుట్టు మిషన్లు, మరియు ఇతర సామాగ్రి కాలి బూడిదవ్వగా దాదాపు8 నుండి 10 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు..ఈ ప్రమాదం సంభవించిన సమయంలో ఉదయం కావడం వలన ఇంట్లో అందరూ ఉన్నారు అందువలన పెద్ద ప్రమాదం తప్పింది.. లేకపోతే ఇంకా పెద్ద మొత్తంలో ఆస్తి నష్టం జరిగేదని బాధితుడు వాపోతున్నాడు..ప్రభుత్వం తక్షణమే స్పందించి తమను ఆదుకోవాలని విన్నవించుకున్నాడు..ఇదిలా ఉండగా అగ్ని ప్రమాదం జరిగిన వీధిలోకి కనీసం ఫైర్ ఇంజన్ కూడా పోయే విధంగా రోడ్డు వెడల్పు లేకపోవడం ఇక్కడ గమనించాల్సిన అంశం...

**ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి.. అడ్వాల జ్యోతి..**

ఇదిలా ఉండగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని మాజీ మున్సిపల్ చైర్ పర్ ,స్థానిక కౌన్సిలర్ అడ్వాలా జ్యోతి అన్నారు.. బాధితులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం నుండి అన్ని విధాలుగా సహాయం అందించేందుకు తమ వంతుగా కృషి చేస్తామని ఆమె బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు

# ఆర్మూర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా ప్రతిమ రెడ్డి

**మీడియా టుడే ప్రతినిధి నిజామాబాద్ జిల్లా జూన్ 12**



ఆర్మూర్ ఆర్టీసీ డిపో నూతన మేనేజర్ ప్రతిమ రెడ్డి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఆర్మూర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా బాధ్యతలు తీసుకున్న ప్రతిమరెడ్డి ఇదివరకు ఆదిలాబాద్ జిల్లా ఆర్టీసీలో పనిచేశారు. ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ ఆర్టీసీ డిపోకు బదిలీపై వచ్చి శుక్రవారం ప్రతిమ రెడ్డి ఆర్మూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ ఆర్టిసి డిపోలో పనిచేసే ఉద్యోగులు, ఆర్టీసీ యూనియన్ నాయకులు, పలువురు సిబ్బంది, నూతన ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# విద్యార్థులకు యాంటీ డ్రగ్స్ అవగాహన సదస్సు

**మీడియా టుడే ప్రతినిధి నిజామాబాద్ జిల్లా జూన్ 12 :**



ఆర్మూర్ పట్టణంలోని క్షత్రియ జూనియర్ కాలేజీలో 80 మంది విద్యార్థులతో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆర్మూర్ ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యాంటీ డ్రగ్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు యాంటీ డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండటం మంచిదని ఎందుకంటే తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తే తల్లిదండ్రుల మాట విని చదువుపై దృష్టి పెట్టి ఉన్నత స్థాయిలో తమ పిల్లలు ఎదగాలని ప్రతి ఒక్క తల్లిదండ్రులు ఆశిస్తారని అన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.

# భీమ్‌గల్ తహసిల్దార్ ఎదుట ముగ్గురు వ్యక్తుల బైండోవర్

**మీడియా టుడే ప్రతినిధి నిజామాబాద్ జిల్లా జూన్ 12 :**



భీమ్ గల్ మండల పరిధిలో గంజాయి విక్రయాలు, వినియోగంపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం గట్టి నిఘా పెట్టింది. భీమ్‌గల్ మండలం సంతోష్ నగర్ తండా సమీపంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించింది. ముగ్గురు వ్యక్తులను ఈ తనిఖీల్లో భీమ్‌గల్ కు చెందిన షేక్ మజాస్ అనే యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 100 గ్రాముల ఎండు గంజాయితో పాటు ఒక మొబైల్ ఫోన్‌ను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలో గంజాయి తీసుకోవడాన్ని అలవాటుగా మార్చుకున్న మరో ముగ్గురు వ్యక్తులను ఎక్సైజ్ బృందం గుర్తించింది. అనంతరం వారిని, వారి తల్లిదండ్రులను ఎక్సైజ్ కార్యాలయానికి పిలిపించారు. తల్లిదండ్రుల సమక్షంలోనే గంజాయి సేవించడం వల్ల కలిగే శారీరక, మానసికంగా దూర అలవాట్ల, చట్టపరమైన ఇబ్బందుల గురించి వారికి క్షుణ్ణంగా అవగాహన కల్పించి హెచ్చరించారు. ఆ తర్వాత భవిష్యత్తులో ఇలాంటి వ్యసనాలకు దూరంగా ఉంటామనే నిబంధనపై భీమ్‌గల్ తహశీల్దార్ ఎదుట ఆ ముగ్గురు వ్యక్తులను బైండోవర్ చేసినట్లు భీమ్‌గల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.వేణుమాధవ్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో గంజాయి తదితర మత్తు పదార్థాల విక్రయదారులపై, వినియోగదారులపై నిరంతరం నిఘా ఉంటుందని, చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో అబ్కారీ సిబ్బంది పాల్గొన్నారు.

# డాక్టర్ దీపాంజలి సేవలు చిరస్మరణీయం - సర్పంచ్ దీన రాజలింగం

**జగదేవ్ పూర్ మీడియా టుడే, జూన్ 12:**



జగదేవ్ పూర్ మండలం ఇటిక్యాల గ్రామ సర్పంచ్ దీన రాజలింగం అధ్యక్షతన ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ దీపాంజలి కి ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దీన రాజలింగం మాట్లాడుతూ, డాక్టర్ దీపాంజలి గ్రామంలో కేవలం ఆరు నెలల కాలంలోనే ప్రజల మన్ననలు పొందేలా సేవలు అందించారని కొనియాడారు. ఆమె చేసిన సామాజిక సేవలను ఇటిక్యాల గ్రామ ప్రజలు ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటారని అన్నారు.గ్రామానికి నూతనంగా వచ్చిన డాక్టర్ కేదారి కి గ్రామ ప్రజల తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరేష్, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ అయూబ్, ఆశా వర్కర్లు, గ్రామ ప్రభుత్వ ఉద్యోగులు, యువత మరియు గ్రామస్తులు పాల్గొన్నారు

# మీసేవ సేవల్లో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలి

**ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు.**

**- దరఖాస్తుల పరిశీలన పూర్తిగా ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలి**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో వాసు,జూన్ 12(మీడియా టుడే):** కొత్తగూడెం తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ పుల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు జీపీఓలు, ఆర్ఐలు, మీసేవ వీఎల్ఈలు, సెక్షన్ అధికాంలకు మీసేవ సేవల అమలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాయ, కుల, నివాస, కుటుంబ సభ్యుల ధృవపత్రాలు, ఈబీసీ, ఓబీసీ తదితర సేవలకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహించబడుతుందని తెలిపారు. దరఖాస్తుదారులు సమర్పించిన డిజిటల్ పత్రాల ఆధారంగానే నిబంధనల మేరకు ఆమోదం లేదా తిరస్కరణ నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. భౌతిక పత్రాలను స్వీకరించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొబైల్ యాప్ వినియోగంపై అధికారులకు ప్రత్యేక శిక్షణ అందించారు. ఈ యాప్ ద్వారా దరఖాస్తులను నిర్ణీత గడువులో పరిష్కరించవచ్చని పేర్కొన్నారు. ప్రతి దరఖాస్తును నిష్పక్షపాతంగా పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని సూచించారు. మీసేవ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వం నిర్ణయించిన రుసుములను మాత్రమే వసూలు చేయాలని, అదనపు రుసుములు వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డేటా ఎంట్రీలో పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంలో అధికారులు, మీసేవ కేంద్రాల నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని, సాంకేతిక లేదా పరిపాలనా సమస్యలు ఎదురైతే సంబంధిత తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో జీపీఓలు, ఆర్ఐలు, మీసేవ వీఎల్ఈలు, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

# ఇంద్రేశంను ఆదర్శ మున్సిపాలిటీ తీర్చిదిద్దాలి

## ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి



**ఇంద్రేశం ప్రతినిధి, మీడియా టుడే, జూన్ 12 :** అధికారులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ?ఇంద్రేశంను ఆదర్శ మున్సిపాలిటీ తీర్చిదిద్దాలని ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజాధనానికి జవాబుదా రీతనం వహిస్తూ, ప్రతి పనిలోనూ పూర్తి పారదర్శకత పాటించాలని అధికారులను ఆదేశించారు. ఇంద్రేశం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మున్సిపల్ చైర్మన్ ప్రమీల, వైస్ చైర్మన్ హరీష్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అజయ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి, పట్టణ ప్రగతి మరియు మున్సిపల్ విభాగాల పనితీరుపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఇంద్రేశం నగర రూపురేఖలను మార్చేందుకు, సమగ్ర అభివృద్ధి కొరకు నగరాఅభివృద్ధి లో భాగంగా రూ. 15 కోట్ల నిధులను కేటాయించిందని, మున్సిపల్ పరిపాల నను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు వీలుగా నూతన మున్సిపల్ భవన నిర్మాణ ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.., మున్సిపల్ వాహనాల డీజిల్ వినియోగంపై కఠిన నియంత్రణ ఉండాలని, పరిమితి దాటితే లాగ్‌బుక్ మరియు జీపీ ఎస్ డేటా సమర్పించడం తప్పనిసరని స్పష్టం చేశారు. మున్సిపల్ సిబ్బందిని ప్రైవేట్ పనులకు వాడటం చట్టవిరుద్ధమని హెచ్చరిస్తూ, విధుల్లో పారదర్శకత కోసం బయోమెట్రిక్ హాజరును కచ్చితంగా అమలు చేయాలన్నారు. థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికేట్ ఉంటేనే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే ప్రతిపాదిత ఎస్.టి.పీ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించిన స్థల వివరాలను తక్షణమే సిద్ధం చేయాలన్నారు. మున్సిపాలిటీకి 15వ ఆర్థిక సంఘం నిధులు, ప్రభుత్వ గ్రాంట్లు సకాలంలో వచ్చేలా ఆస్తి పన్ను వసూళ్లను వేగవంతం చేసి, కనీసం 12.5 శాతం పైగా వృద్ధి సాధించాలన్నారు. తక్కువ పన్ను కడుతున్న ఆస్తులు, అక్రమ కట్టడాలపై జరిమానాలు విధించడంతో పాటు, అనధికార కుళాయిలు, లైసెన్స్ లేని దుకాణాలను సర్వే ద్వారా గుర్తించి క్రమబద్ధీకరించాలన్నారు. కొత్త అడ్వర్టైజ్‌మెంట్ పాలసీ ప్రకారం అక్రమ ఫ్లెక్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.?రోడ్లు, నాలాలు, చెరువు శిఖం భూముల ఆక్రమణలపై కఠినంగా వ్యవహరిస్తూ ఎవిక్షన్ డ్రైవ్స్ చేపట్టాలని, అనుమతి లేని అక్రమ లేఅవుట్ల రిజిస్ట్రేషన్లను నిలిపివేయాలని రిజిస్ట్రేషన్ శాఖకు లేఖలు రాయడంతో పాటు అక్కడ హెచ్చరిక బోర్డులు పెట్టాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్త 16.06 కోట్ల మొక్కల నాటే లక్ష్యంలో భాగంగా ఇంద్రేశం మున్సిపాలిటీ ప్రత్యేక ప్లాంటేషన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నాలాల పూడికతీత పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, లోతట్టు ప్రాంతాల్లో మోటార్ పంపులను సిద్ధం ఉంచడంతో పాటు ప్రజల అత్యవసర సేవల కోసం 24/7 మున్సిపల్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో దోమల నివారణకు వారానికి రెండుసార్లు ఫాగింగ్, వీధి కుక్కల నియంత్రణకు ఎబీసీ బృందాలు క్షేత్రస్థాయిలో పనిచేసేలా చూడాలన్నారు. మున్సిపల్ పాలకవర్గానికి రూ.10 లక్షల ఇన్సూరెన్స్ ఇంద్రేశం మున్సిపాలిటీలో కౌన్సిలర్లకు గతంలో తాను ఇచ్చిన మాట ప్రకారం రూ. 10 లక్షల ఇన్సూరెన్స్ సొంత నిధులతో ఏర్పాటు చేస్తామని , త్వరలోనే జిల్లా అదనపు కలెక్టర్ ద్వారా సంబంధిత పత్రాలను పంపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు

**గద్వాల జిల్లా మీడియా టుడే ప్రతినిధి జి నాగరాజు (జూన్ 12)**
గద్వాల మండలం పరమాల గ్రామంలో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం ను పురస్కరించుకొని గ్రామ పంచాయతీ కార్యాలయంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించరూ ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ శ్రీ వి. రాజేందర్, పాల్గొని బాల కార్మిక వ్యవస్థ సమాజానికి ఒక సామాజిక దురాచారమని పేర్కొన్నారు. చిన్నారులను విద్యకు దూరం చేసి పనిలో నిమగ్నం చేయడం వారి ప్రాథమిక హక్కుల ఉల్లంఘన అని వివరించారు. ప్రతి బాలుడికి విద్య, ఆరోగ్యం, రక్షణ మరియు సమాన అవకాశాలు కల్పించడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని తెలిపారు. బాల కార్మిక చట్టం, పిల్లలకు ఉచిత మరియు నిర్బంధ విద్య హక్కు చట్టం, బాలల సంరక్షణ చట్టాలు మరియు బాలల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. బాల కార్మికులను పనిలో పెట్టుకునే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశముందని, గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సహకరించాలని కోరారు. ప్రతి బాలుడు సురక్షితమైన మరియు ఆరోగ్యకరమైన వాతావరణంలో పెరిగే హక్కు కలిగి ఉన్నాడని తెలిపారు. బాలలపై జరిగే వేధింపులు, బాల్య వివాహాలు మరియు బాల కార్మిక వ్యవస్థ వంటి సమస్యలను గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందిం చాలని సూచించారు. బాలల హక్కుల పరిరక్షణలో తల్లిదండ్రులు, మరియు గ్రామస్థుల పాత్ర అత్యంత కీలకమని వివరించారు. గ్రామ స్థాయిలో బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పిల్లలను పాఠశాలలకు పంపించి వారి విద్యాభివృద్ధికి సహకరించాలని సూచించారు .ప్రతి చిన్నారి విద్యను కొనసాగించేలా సహకరించాలని కోరారు. బాలల భవిష్యత్తు దేశ భవిష్యత్తు అని పేర్కొన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని, పిల్లలకు విద్య రక్షణ కల్పించడం ద్వారా సమాజ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, లక్ష్మన్న స్వామి, లీగల్ డిఫెన్స్ కౌన్సిల్స్ నర్సింహులు డి.సి.పి.ఓ, తిరుమలేష్, పంచాయతీ కార్యదర్శి, అంజి, సర్పంచ్ బాల రక్షాబంధన్ సిబ్బంది పాల్గొన్నారు.




# కోదాడ నియోజకవర్గానికి మరో భారీ అభివృద్ధి అడుగు

**నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు ఉత్తంకుమార్ రెడ్డి**

**కోదాడ శాసనసభ్యులు పద్మావతి రెడ్డికి పాలాభిషేకం**






**చిలుకూరు :-జూన్ 12(మీడియా టుడే )**
చెన్నారిగూడెం గ్రామంలో నిర్వహించినటువంటి పాలాభిషేక కార్యక్రమంలో చిలుకూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కీతా.వెంకటేశ్వర్లు మరియు చిలుకూరు మండల ప్రధాన కార్యదర్శి పింద్రాతి హనుమంతరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటి నుంచి అన్ని రకాల అభివృద్ధిలో ముందు ఉంటూ నిత్యం ప్రజాక్షేత్రంలో ప్రజల శ్రేయస్సు కొరకు ప్రజలకు సేవ చేస్తున్నటువంటి గౌరవ నీటిపారుదల మరియు పౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు ఉత్తంకుమార్ రెడ్డి, కోదాడ నియోజకవర్గ శాసనసభ్యులు పద్మావతి రెడ్డి ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా రహదారులు పూర్తి చేస్తున్నారు మరియు రైతులకు వారి పంటల విషయంలో ఇబ్బంది కలగకుండా వ్యవసాయ కాలువల మరమ్మత్తుల పనులు కూడా పూర్తి చేశారు కోదాడ నియోజకవర్గ అభివృద్ధి కోసం 52.50కోట్లు మంజూరు చేశారని ఇవి ఎన్ హెచ్ 9 నుండి పాత కొండాపురం రోడ్డు విస్తరణ మరియు బలోపేతం కోసం 27 కోట్లు, బేతవుల నుండి ఆచార్యుల గూడెం రోడ్డు విస్తరణ మరియు బలోపేతం కోసం 13.50 కోట్లు, కృష్ణాపురం రోడ్ విస్తరణ కోసం 4.5కోట్లు, రామ లక్ష్మం పురం రోడ్డు విస్తరణ కోసం 7.50 కోట్లు మంజూరు చేశారని ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని లక్ష్యంతో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి కృషి ఫలితంగా ఈ రోడ్ల అభివృద్ధి పనులు ముందుకు సాగుతున్నాయని చిలుకూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కీతా వెంకటేశ్వర్లు,చిలుకూరు మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పింద్రాతి హనుమంతరావు వారి గ్రామంలో చేపట్టినటువంటి పాలాభిషేక కార్యక్రమంలో ప్రజలందరికీ అభివృద్ధి పనుల గురించి వివరించారు ప్రజల కోసం అభివృద్ధి కోసం నిరంతర కృషి చేస్తున్న ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిని కొనియాడుతూ ధన్యవాదాలు తెలియపరిచారు ఇట్టి కార్యక్రమంలో గ్రామ ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ఆలూర్ తహసిల్దార్ కు మెమొరాండం అందజేత



**మీడియా టుడే ప్రతినిధి నిజామాబాద్ జిల్లా జూన్ 12 :** భారతీయ జనతా పార్టీ అలూర్ మండల శాఖ అధ్యక్షులు సూర శ్రీకాంత్ ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కు యూరియా గురించి మెమొరాండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన బిజెపి పార్టీ జిల్లా కార్యదర్శి పోల్కశీ వేణు, మాట్లాడుతూ తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ యూరియా యాప్ ను తీసుకొచ్చి రైతులకు అనేక ఇబ్బందులకు గురిచేస్తుందని తక్షణమే యూరియా బుకింగ్ యాప్ ను, మండల స్థాయి ప్రతిపాదికను మార్చి స్థానిక సొసైటీ లకు, ఫెర్టిలైజర్ షాపులకు అందుబాటులోకి తీసుకురావాలని, అలాగే ఎకరానికి యూరియా కేటాయింపులపై ఈ రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి హరీష్, జిల్లా నాయకులు సుభాష్, బాస సురేష్, ప్రశైతేజ్, మండల ఉపాధ్యక్షులు పోశెట్టి, ఓ బి సి మోర్చ అధ్యక్షులు నడిశారం మల్లయ్య, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి మహేష్, సీనియర్ నాయకులు నాగేష్, సురేష్ గౌడ్, అజయ్, సాయి పటేల్, తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 14న మెదక్‌లో మాత నల్ల పోచమ్మ అమ్మవారి బండ్ల ఊరేగింపు

**గజ్జల మీడియా టుడే ప్రతినిధి జూన్ 12**



మెదక్ జిల్లా కేంద్రంలోని ఆటోనగర్‌లో వెలసిన శ్రీ మాత నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయంలో మృగశిర కార్తెల సందర్భంగా ఈ నెల 14వ తేదీ (ఆదివారం) సాయంత్రం 6 గంటలకు బండ్ల ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు ఎల్. లింగారెడ్డి, ఎల్. మల్లారెడ్డి, ఎల్. రాంరెడ్డి ఒక శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం అమ్మవారికి వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చారణల మధ్య పంచామృతాభిషేకం నిర్వహించబడుతుందని తెలిపారు.అనంతరం పట్టు వస్త్రాలు,వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.అలాగే భక్తులచే అమ్మవారికి ఓడి బియ్యం సమర్పణ కార్యక్రమం ఉంటుందని, సాయంత్రం 6 గంటలకు బండ్ల ఊరేగింపు వైభవంగా జరుగుతుందని తెలిపారు.మెదక్ పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ ధర్మకర్తలు కోరారు.

# వెటర్నరీ విభాగంలో అత్యుత్తమ సేవలందించిన వెటర్నరీ డాక్టర్ కి ఆత్మీయ వీడ్కోలు

**చిలుకూరు :-జూన్ 12(మీడియా టుడే )**



రామాపురం గ్రామంలో పశు వైద్య సేవలు అందించిన వెటర్నరీ డాక్టర్ జి.శ్రీనివాస్ బదిలీపై మరియొక ప్రాంతానికి వెళ్తున్నందుకు ఆత్మీయ సమావేశంలో ఘనం సత్కరించి వారు పశువులపై చూపించినటువంటి ప్రేమను వాటిని రక్షించడంలో వహించినటువంటి బాధ్యతను గుర్తు చేస్తూ వారి సేవలను కొనియాడారు హాస్పిటల్ కి వచ్చినటువంటి ఏ జంతువు మరణించ వద్దు అనే ఉద్దేశంతో సమయానికి మించి వృత్తి బాధ్యతలు నిర్వహించారు అని గ్రామ ప్రజలు కొనియాడారు ఈ కార్యక్రమంలో రామాపురం గ్రామ మాజీ సర్పంచ్ మీసాల గంగా లింగయ్య,వేమూరి బ్రహ్మయ్య,వేమూరి రామారావు, గ్రామ కార్యదర్శి కిరణ్, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు అదేవిధంగా రామాపురానికి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వ్యక్తి డాక్టర్ సురేష్ కి ఆహ్వానం పలుకుతూ శాలువాలతో సన్మానించారు..

# డ్రగ్స్ వద్దు జీవితంముద్దు

**డ్రగ్స్ తో జీవితం మసి - వాటిని మానేస్తే ఖుషీ**

**చిలుకూరు :-జూన్ 12(మీడియా టుడే )**




ప్రజాపాలనబిప్రగతిప్రణాళిక 99రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్ ఆదేశాల మేరకు చిలుకూరు మండల సీతారాంపురం గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలన అవగాహన కార్యక్రమం నిర్వహిం చడం జరిగినది. ఈ కార్యక్రమం నందు స్థానిక ఎస్ఐ హనుమానాయక్ హాజరై మాట్లాడారు. మన సమాజం నుండి డ్రగ్స్, గంజాయిని నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపై ఉన్నది అన్నారు, గంజాయి వియోగం వల్ల మన పిల్లలు, యువత అనారోగ్యాలకు గురైతున్నారు, దీని వల్ల బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారు అన్నారు. డ్రగ్స్ నిర్మూలనలో అందరూ భాగస్వామ్యమై పోలీసు వారికి సమాచారం ఇవ్వాలి అన్నారు. పోలీసు నిత్యం తనిఖీలు నిర్వహిస్తుంది, గంజాయి అలవాటు, రవాణా పై నిఘా ఉంచాం.అనంతరం స్థానిక ప్రజలతో డ్రగ్స్ నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. శాంతి భద్రతల విషయంలో మండల పరిధి పోలీస్ స్టేషన్లో సమయానికి మించి ఉంటూ సేవలందిస్తున్నటువంటి ఎస్సై హనుమాన్ నాయక్ కి గ్రామ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.అదేవిధంగా ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని కనులారా చూస్తున్నామని సంతోషాన్ని వ్యక్తపరిచారు

# కష్టకాలంలో తోటి డ్రైవర్ కుటుంబానికి చేయూత

**అనంతగిరి జూన్ 12 మీడియా టుడే -:**



అనంతగిరి మండలం వెంకట్రాంపురం గ్రామానికి చెందిన హార్వెస్టర్ డ్రైవర్ పస్తం రాము ఇటీవల బ్రెయిన్ డెడ్ కావడంతో మృతి చెందిన ఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది.ఈ నేపథ్యంలో మృతుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు హార్వెస్టర్ యూనియన్‌కు చెందిన డ్రైవర్లు, యజమానులు, గ్రామస్తులు ముందుకు వచ్చి రూ.35 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబ సభ్యులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు తోటి డ్రైవర్లు స్వచ్ఛందంగా ముందుకు రావడం పట్ల గ్రామంలో ప్రశంసలు వ్యక్తమయ్యాయి.కష్టకాలంలో సహచరుడి కుటుంబానికి అండగా నిలవడం మానవత్వానికి నిదర్శనమని గ్రామస్తులు కొనియాడారు. దాతలు ఇంకా ఎవరైనా ఉంటే సహాయం అందించాలని, ప్రభుత్వం కూడా కుటుంబాన్ని ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

# నైపుణ్యాభివృద్ధిపై గీతం విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ



**పటాన్ చెరు ప్రతినిధి, మీడియా టుడే, జూన్ 12 :** నైపుణ్యాభివృద్ధి, కెరీర్ అభివృద్ధి, పరిశ్రమకు సంసిద్ధత, ప్రపంచ ఉన్నత విద్యపై అవగాహనను విద్యార్థులలో పెంపొందించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 'జూన్ 2026 సెషన్ సిరీస్' పేరిట ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ విషయాన్ని గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ (జీసీజీసీ)లోని శిక్షణ, మార్గదర్శకత్వం వృత్తిపరమైన సలహాలు (టీఎంసీజీ) డైరెక్టర్ డాక్టర్ రోజీనా మాథ్యూ శుక్రవారం విడుదల చేసి ఒక ప్రకటనలో వెల్లడించారు. విజయవంతమైన పూర్వ విద్యార్థులు, పరిశ్రమ నిపుణులు, పరిశోధకులు, విభిన్న రంగాలకు చెందిన నిపుణులతో గీతం విద్యార్థులను అనుసంధానిం చడంలో టీఎంసీజీ వేదిక కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఈ పరస్పర సంభాషణల ద్వారా, విద్యార్థులు తరగతి గది అభ్యాసానికి తోడ్పడే ఆచరణాత్మక అంతర్దృష్టులను పొందుతారని, ఇవి వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచంలో విజయవంతమైన కెరీర్ల కోసం వారిని సిద్ధం చేస్తారని వివరించారు.'జూన్ 2026 సెషన్ సిరీస్'లో, ప్రముఖ పూర్వ విద్యార్థులు, పరిశ్రమ నిపుణులు వర్ధమాన కెరీర్ అవకాశాలు, విదేశాలలో ఉన్నత విద్య, కృత్రిమ మేధస్సు (ఏఐ), ప్రొడక్ట్ మేనేజ్ మెంట్, డేటా అనలిటిక్స్ వంటి అంశాలపై తమ అభిప్రాయాలను, నైపుణ్యాన్ని గీతం విద్యార్థులతో పంచుకుంటారని ఆమె పేర్కొన్నారు. ఇందులో భాగంగా, జూన్ 11న, 'సరిహద్దులకు ఆవల: అమెరికాలో కృత్రిమ మేధస్సు అధ్యయన ప్రయాణం' అనే అంశంపై యూనివర్సిటీ ఆఫ్ సిన్సినాటి మాస్టర్స్ విద్యార్థిని శ్రీజ నల్లమోతు ప్రసంగిస్తారని తెలిపారు. జూన్ 12న, 'సరిహద్దులకు ఆవల: విదేశాలలో ఉన్నత విద్యకు మీ ప్రయాణం' అనే అంశంపై యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ ఎట్ డల్లాస్ పట్టభద్రుడు హార్దిక్ మల్లిచెట్టి ఉపన్యసిస్తారన్నారు. జూన్ 14న, 'ఉత్పత్తి సంబంధిత పాత్రలను' గ్లోబల్ డేటా పీఎల్సీ ప్రొడక్ట్ అనలిస్ట్ వంశిక సాయి బొత్స పరిచయం చేస్తారని వెల్లడించారు. జూన్ 15న, 'యూనివర్సిటీ ఆఫ్ హ్యూస్టన్ కు ప్రయాణం' అనే అంశంపై అక్కడి రీసెర్చ్ అసిస్టెంట్ ఆకాంక్ష గోవిందరాజు వివరిస్తారన్నారు. జూన్ 21న, 'డేటా అనలిటిక్స్ భవిష్యత్తును నడిపించడం: కృత్రిమ మేధస్సు, నైపుణ్యాలు, కెరీర్' అనే అంశంపై ఎంఎస్డీ డేటా సైన్స్ మేనేజర్ సమీక్ష నిమ్జే ఉపన్యసిస్తారని తెలిపారు. జూన్ 23న, 'విదేశాలలో ఉన్నత విద్యలో చేరడానికి సరైన సమయాన్ని విశ్లేషించడం'పై నార్త్ కరోలినా స్టేట్ యూనివర్సిటీ మాస్టర్స్ విద్యార్థిని ఎన్.శ్రేయారెడ్డి సలహాలిస్తారన్నారు. జూన్ 26న, 'స్పష్టతతో, లక్ష్యంతో విదేశాలలో ఎలా చదువుకోవాలి' అనే అంశంపై పోలాండ్ లోని కోజ్మిన్స్కి విశ్వవిద్యాలయం మాస్టర్స్ విద్యార్థి సాయిరామ్ నాగేష్ మార్గదర్శనం చేస్తారని తెలియజేశారు. వీటి ముఖ్య ఉద్దేశం, విద్యార్థులకు అభివృద్ధి చెందుతున్న పరిశ్రమ పోకడలను అర్థం చేసుకోవడం, ప్రపంచవ్యాప్త విద్యావకాశాలను అన్వేషించడం, విదేశాలలో పనిచేస్తున్న, చదువుతున్న పూర్వ విద్యార్థుల నుంచి లోతైన అవగాహనను పొందడం, వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాలలో విజయవంతమైన వృత్తి జీవితానికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవడంలో సహాయపడటమని డాక్టర్ రోజీనా వివరించారు. ఆయా సెషన్లలో విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని, వక్తలతో సంభాషించాలని, అలాగే తమ విద్య, వృత్తి జీవితాల గురించి సరైన నిర్ణయాలు తీసుకోవాలని డాక్టర్ మాథ్యూ విద్యార్థులను ప్రోత్సహించారు."విద్యార్థులు అనుసరించాలనుకుంటున్న మార్గంలో ఇప్పటికే విజయవంతంగా పయనించిన వ్యక్తుల నుంచి నేర్చుకోవడానికి ప్రతి సెషన్ ఒక అవకాశాన్ని అందిస్తుంది. ఈరోజు తీసుకునే నిర్ణయాలే రేపటి అవకాశాలను తీర్చిదిద్దుతాయి" అని ఆమె అన్నారు. ఇప్పటివరకు టీఎంసీజీ వివిధ రంగాలలో 149 నైపుణ్యాభివృద్ధి సెషన్లను విజయవంతంగా నిర్వహించిందని, తద్వారా వందలాది విద్యార్థులకు మార్గదర్శనం, పరిశ్రమ అనుభవం, ఉన్నత విద్యపై అవగాహన కలిగినట్టు డాక్టర్ రోజీనా మాథ్యూ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఎమిరేట్స్ రోడ్ ఘోర ప్రమాద బాధితులకు

# Dh1 మిలియన్ సాయం ప్రకటించిన యూఏఈ బిలియనీర్

**మీడియా టుడే జగిత్యాల జిల్లా రిపోర్టర్**



దుబాయ్: ఇటీవల ఎమిరేట్స్ రోడ్‌పై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు, గాయపడిన బాధితులకు యూఏఈ బిలియనీర్ మరియు బుర్జీల్ హోల్డింగ్స్ చైర్మన్ డాక్టర్ షంషీర్ వయలిల్ ఐష్ట్ర1 మిలియన్ విలువైన మానవతా సహాయ ప్యాకేజీని ప్రకటించారు.ఈ ప్రమాదంలో కార్మికులను తీసుకెళ్తున్న మినీబస్సు, సాంకేతిక లోపంతో రోడ్డుపై నిలిచిపోయిన ట్రక్కు వెనుక భాగాన్ని ఢీకొనడంతో ఏడుగురు మృతి చెందగా, మరో తొమ్మిది మంది గాయపడ్డారు.ప్రకటించిన సహాయ ప్యాకేజీ ప్రకారం, మృతి చెందిన ఏడుగురు కార్మికుల కుటుంబాలకు ప్రతి కుటుంబానికి ఐష్ట్ర100,000 చొప్పున, మొత్తం ఐష్ట్ర700,000 అందజేయనున్నారు. అలాగే గాయపడిన తొమ్మిది మంది చికిత్స, కోలుకునేందుకు ఐష్ట్ర180,000 కేటాయించారు.అదనంగా, బాధితుల కుటుంబ సభ్యుల అత్యవసర ప్రయాణం, వసతి ఖర్చుల కోసం ఐష్ట్ర70,000, అలాగే ప్రభావిత కుటుంబాలకు చెందిన పిల్లల విద్యాభ్యాసం కోసం ఐష్ట్ర50,000 ప్రత్యేకంగా కేటాయించారు.ఈ సందర్భంగా డాక్టర్ షంషీర్ మాట్లాడుతూ, "ఇది అనేక కుటుంబాలను తీవ్ర విషాదంలోకి నెట్టిన హృదయ విదారక ఘటన. ఉపాధి కోసం, తమ కుటుంబాల భవిష్యత్తు కోసం యూఏఈకి వచ్చిన కార్మికులు ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరం. ఆ ప్రాణ నష్టాన్ని ఏ ఆర్థిక సాయం భర్తీ చేయలేకపోయినా, ఈ సహాయం బాధిత కుటుంబాలకు కొంత ఉపశమనం కలిగిస్తుందని ఆశిస్తున్నాం" అని అన్నారు. ప్రమా దంలో మరణించిన వారిలో ఆరుగురు భారతీయులు, ఒకరు శ్రీలంక పౌరుడు ఉన్నారు. భారతీయుల్లో ముగ్గురు ఉత్తరప్రదేశ్, మరో ముగ్గురు తెలంగాణ రాష్ట్రాలకు చెందినవారని సమాచారం. గాయపడిన వారిలో కొందరు ఇప్పటికే ఆసుపత్రుల నుంచి డిశ్చార్జ్ కాగా, మరికొందరు యూఏఈలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.ఈ ప్రమాదానికి సంబంధించిన దర్యాప్తు కొనసాగుతోందని దుబాయ్ పోలీసులు ఇప్పటికే వెల్లడించారు. ప్రమాద బాధితులకు అందించే సహాయం జాతీయతతో సంబంధం లేకుండా అందరికీ వర్తిస్తుందని డాక్టర్ షంషీర్ స్పష్టం చేశారు.భారతీయ బాధితుల కుటుంబాలకు సంబంధించి దుబాయ్‌లోని భారత కాన్సులేట్‌తో సమన్వయం కొనసాగుతున్నప్పటికీ, ఈ విషాద ఘటన వల్ల ప్రభావితమైన ప్రతి కుటుంబానికి మానవతా దృక్పథంతో సహాయం అందజేస్తామని ఆయన తెలిపారు.ఈ సహాయ కార్యక్రమం ద్వారా బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక ఉపశమనం కల్పించడంతో పాటు, ప్రధాన ఆదాయ వనరును కోల్పోయిన కుటుంబాల పిల్లల భవిష్యత్తును కూడా రక్షించాలనే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

# జూన్ 20న జాతీయ లోక్ అదాలత్

## -రామన్నపేట జూరిస్డిక్షన్ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**మీడియా టుడే యాదాద్రి భువనగిరి జూన్**

భారత జాతీయ న్యాయ సేవా సంస్థ ఎన్ ఏ ఎల్ ఎస్ ఏ మరియు తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా సంస్థ టి ఎస్ ఎల్ ఎస్ ఏ ఆదేశాల మేరకు,2026 జూన్ 20వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, రామన్నపేట ఆధ్వర్యంలో రామన్నపేట జూరిస్డిక్షన్ పరిధిలో నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి-కమ్-చైర్మన్, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, రామన్నపేటజి సబిత తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రామన్నపేట జూరిస్డిక్షన్ పరిధిలోని న్యాయస్థానాలలో పెండింగ్‌లో ఉన్న రాజీకి అనుకూలమైన సివిల్ కేసులు, మోటార్ ప్రమాద పరిహార దావాలు, బ్యాంకు రికవరీ కేసులు,చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ వివాదాలు, కార్మిక వివాదాలు, విద్యుత్ సంబంధిత వివాదాలు, అలాగే ఇతర ప్రీ-లిటిగేషన్ మరియు పెండింగ్ కేసులను జాతీయ లోక్ అదాలత్ ద్వారా పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు.జాతీయ లోక్ అదాలత్ విజయవంతం కోసం ఎస్ శిరీష ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి,రామన్నపేట, వి రత్నకుమారి,అదనపు జూనియర్ సివిల్ జడ్జి, రామన్నపేట,డి సత్తయ్య,ద్వితీయ శ్రేణి న్యాయ మేజిస్ట్రేట్, రామన్నపేట తమ తమ న్యాయస్థానాల పరిధిలో రాజీకి అనుకూలమైన కేసులను గుర్తించి లోక్ అదాలత్‌లో పరిష్కారం కోసం చర్యలు చేపడుతున్నారని తెలిపారు.లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారానికి ఎటువంటి కోర్టు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని, ఇప్పటికే చెల్లించిన కోర్టు ఫీజు తిరిగి పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.లోక్ అదాలత్‌లో కుదిరిన రాజీ ఆధారంగా వెలువడే అవార్డు తుది తీర్పుతో సమానమైనదని, దానిపై అప్పీల్‌కు అవకాశం ఉండదని వివరించారు.కావున రామన్నపేట జూరిస్డిక్షన్ పరిధిలోని ప్రజలు, కక్షిదారులు, న్యాయవాదులు, బ్యాంకు అధికారులు, ప్రభుత్వ శాఖల అధికారులు మరియు సంబంధిత వర్గాల వారు ఈ జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని తమ వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి-కమ్-చైర్మన్ జి సబిత పిలుపు నిచ్చారు.

# శాతవాహన అర్థ శాస్త్ర విభాగంలో పి. శ్రీనివాస్ కి పరిశోదక పట్టా




**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ : మీడియా టుడే , జూన్ 12 :** కరీంనగర్ స్థానిక శాతవాహన విశ్వవిద్యాలయంలోని విశ్వవిద్యాలయ కళలు, సామాజికశాస్త్ర కళాశాల లోని అర్థ శాస్త్ర విభాగంలో డాక్టరేట్ డిగ్రీ ని పరిశోధక విద్యార్థి పి. శ్రీనివాస్ కి అందజేశారు. తన పరిశోధన గ్రంథం "సొసైయో ఎకనామిక్ కండిషన్స్ అఫ్ అగ్రికల్చరల్ లబోరర్స్ అఫ్ పెద్దపల్లి డిస్ట్రిక్ట్" పెద్దపల్లి జిల్లాలో వ్యవసాయ కార్మికుల సామాజిక – ఆర్థిక పరిస్థితులు "అనే అంశం తీసుకొని అర్థ శాస్త్ర బి ఓ ఎస్ ఆచార్య వరప్రసాద్ పర్యవేక్షణలో పరిశోదన చేసి బహిరంగ మౌఖిక పరీక్షలో నిరూపించించిన గ్రందానికి డాక్టరేట్ డిగ్రీకి (పరిశోధక పట్టా) అర్హత సాధించినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డా.డి.సురేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఈ డిగ్రీకి సహకరించిన అర్థ శాస్త్ర విభాగాధిపతి డా. కే. శ్రీవాణికి, విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమేశ్ కుమార్ కి రిజిస్ట్రార్ సతీష్ కుమార్ కి, అధ్యాపకులకు పరిశోధక విద్యార్థి కృతజ్ఞతలు తెలియజేశారు.

# గ్రామపంచాయతీ కార్మికుల జీతాలు వెంటనే విడుదల చేయాలి

- ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు. జమ్మిచెడు కార్తీక్
- జీవో నెం.60 ప్రకారం నెలకు 18 వేల వేతనం మంజూరు చేయాలి
- ఉద్యోగ భద్రత కల్పించాలి



**గద్వాల జిల్లా మీడియా టుడే ప్రతినిధి జి నాగరాజు (జూన్ 12)**

గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం అనంతరం గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేసి, వేతనాలను పెంచాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు IFTU జిల్లా అధ్యక్షులు జమ్మిచేడు కార్తీక్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల పరిశుభ్రత, పారిశుద్ధ్యం ప్రజా సేవల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులు నెలల తరబడి జీతాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని ఆయన పేర్కొన్నారు.పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారి వేతనాలను పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ర్రాణుాఖ జిల్లా అధ్యక్షులు హలీం భాషహ్హా జిల్లా అధ్యక్షులు. బీరెల్లి దానయ్య, బుడ్డన్న గోవిందు ,వెంకటేశు ,కరెప్ప ఆంజనేయులు,బీచుపల్లి ,దేవరాజు, జైపాల్, నర్సింలు, సవరప్ప, పెద్ద రాముడు, శేషన్న, తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

## నర్సింగ్ కాలేజ్ ను సందర్శించి నిర్వాహకులకు

## కలెక్టర్ ఆదేశం




**నిజామాబాదు జూన్12 (మీడియా టుడే ప్రతినిధి):**

మాక్లూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రభుత్వ నర్సింగ్ కాలేజ్ ను కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం సందర్శించారు. కాలేజీ ఆవరణను పరిశీలించిన సందర్భంగా ప్రహరీ లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్, వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, నర్సింగ్ కాలేజీ వద్ద, పరిసర ప్రాంతాలలో పోలీసులు పెట్రోలింగ్ చేసేలా చూడాలని అన్నారు. తుది దశలో కొనసాగుతున్న నిర్మాణ పనుల నాణ్యతను తనిఖీ చేసి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. యుద్ధప్రాతిపదికన పనులను పూర్తి చేయించాలని, విద్యార్థినులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థినులతో భేటీ అయ్యారు. విద్యార్థినులకు పలు ప్రశ్నలు వేస్తూ వారి అభ్యాసన సామర్థ్యాన్ని అంచనా వేశారు. తన వెంట తెచ్చిన డైరీలు, చాక్లెట్లు, బహుమతులను అందించారు. నర్సింగ్ కోర్సు ఎంతో డిమాండ్ కలిగిన చక్కటి కోర్సు అని, ఏకాగ్రతతో ఇష్టంగా చదువుకోవాలని హితవు పలికారు. కరోనా సమయంలో పారా మెడికల్ సిబ్బంది అందించిన సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. సేవా భావంతో కూడిన నర్సింగ్ కోర్సు వల్ల ఉద్యోగ అవకాశాలతో పాటు ఆకర్షణీయమైన వేతనాలతో విరివిగా ఉపాధికి లభించేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. స్మార్ట్ ఫోన్, సోషల్ మీడియా వంటికి ఒకింత దూరంగా ఉండాలని, ఉన్నత భవిష్యత్తు కోసం ప్రణాళికతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా, వారి కలలను నిజం చేయాలని, అధ్యాపకులకు మంచి పేరు తేవాలని హితవు పలికారు. వ్యక్తిగత భద్రత విషయంలో ఏమరుపాటుగా ఉండకుండా అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని విద్యార్థినులకు జాగ్రత్తలు సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ధైర్యంగా అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఏవైనా అనుకోని ఘటనలు జరిగితే సఖీ వన్ స్టాప్ సెంటర్ ను సంప్రదిస్తే, వారు అన్ని విధాలుగా వెన్నుదన్నుగా నిలుస్తూ న్యాయం జరిగేలా కృషి చేస్తారని, మీ వ్యక్తిగత గుర్తింపు బయటపడకుండా గోప్యత పాటిస్తారని కలెక్టర్ తెలిపారు. బాలికల రక్షణకు, వారి ఆరోగ్యాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, బయటి వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ లోనికి అనుమతించకూడదని, బంధువులు అయినా సరే లోనికి రాకుండా చూడాలని నిర్వాహకులను, సిబ్బందిని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్ శేఖర్, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ భూలక్ష్మి తదితరులు ఉన్నారు.

# విద్యుత్ షాక్ ప్రమాదంలో చికిత్స పొందుతూ యువకుని మృతి

**మెదక్ జిల్లా మీడియా టుడే జూన్ 12**



మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం హస్తాల్‌పూర్ గ్రామంలో పంచాయతీ కార్మికుడు గద్దె నాగరాజు విద్యుత్ షాక్‌తో మృతి చెందడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.ఈ నెల 2న గ్రామంలో విద్యుత్ స్తంభానికి లైట్ బిగిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో నాగరాజు కిందపడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించి చికిత్సఅందిం చినప్పటికీ గురువారం ఉదయం మృతిచెందాడు.నాగరాజు మృతి వార్త తెలియగానే గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆందోళనకు దిగారు.విషయం తెలుసుకున్న సర్పంచ్ నరసింహారెడ్డి, ఉప సర్పంచ్ రమేష్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యులనుపరామర్శించి మీ కుటుంబానికి ఎల్లప్పుడూ మేమున్నాంఅంటూ భరోసా కల్పించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన నష్టపరిహారం, అందేలా పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.సమాచారం అందుకున్న తూప్రాన్ సీఐ వెంకట్ రాజ గౌడ్, వెల్దుర్తి ఎస్సై జ్యోతి ఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. ప్రమాదానికి కారణమైన వారిపై కేసు నమోదు చేసి, బాధ్యులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు.సర్పంచ్, ఉప సర్పంచ్, పోలీసుల హామీతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# డీలర్ల షాపుల్లో దొడ్డు బియ్యం నిల్వలు

**పురుగులు, దుర్వాసనతో ఆందోళన**

**సన్న బియ్యం నిల్వలకూ ముప్పు -- డీలర్ల సంఘం హెచ్చరిక**

**వెంటనే నిల్వ బియ్యాన్ని తరలించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**

**అనంతగిరి, జూన్ 12: మీడియా టుడే-:**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ పథకాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో, దానికంటే ముందు నెలల నుంచి డీలర్ల వద్ద నిల్వ ఉన్న దొడ్డు బియ్యం సమస్య తీవ్ర ఆందోళన కలిగిస్తోందని డీలర్ల సంఘం నాయకులు తెలిపారు. రేషన్ దుకాణాల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం ఎక్కువ కాలంగా తరలించకపోవడంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు పురుగులు పట్టాయని వారు ఆరోపించారు. ఈ పరిస్థితుల కారణంగా రేషన్ డీలర్లు అనారోగ్య సమస్యలను ఎదుర్కొనే ప్రమాదం ఉందని పేర్కొన్నారు .అంతేకాకుండా, నిల్వ ఉన్న దొడ్డు బియ్యంలో ఏర్పడుతున్న పురుగులు, కీటకాలు ప్రస్తుతం పంపిణీ చేస్తున్న నాణ్యమైన సన్న బియ్యానికి కూడా వ్యాపించే అవకాశం ఉందని డీలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రజలకు అందించే నాణ్యమైన సన్న బియ్యం నాణ్యతపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉందని చెబుతున్నారు.సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డీలర్ల వద్ద నిల్వ ఉన్న పాత దొడ్డు బియ్యాన్ని అత్యవసరంగా తరలించాలని, రేషన్ షాపుల పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీలర్ల సంఘం డిమాండ్ చేసింది.

# యమ్ ఆర్ పి ఎస్ ఆధ్వర్యం లో గో టు విలేజ్ 40 రోజుల కార్యక్రమం

**చిలుకూరు :-జూన్ 12(మీడియా టుడే )**



దళితులుగా పిలవబడే ఎస్సీ ఎస్టీ బీసీ కులాలవారు రాజ్యాధికారం దిశగా అడుగులు వేసి సర్పంచులుగా ఎమ్మెల్యేలుగా మంత్రులుగా ఎంపీలుగా ప్రభుత్వ గౌరవ సభలలో ఉండాలని దళితులు రాజ్యాధికారాన్ని చేతపుచ్చుకోవాలని నిరంతరం పోరాడుతున్నటువంటి గౌరవ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి ఆదేశాల మేరకు గో టు విలేజ్ 40 రోజుల కార్యక్రమంలో భాగంగాతేది 12-06-2026 నా సాయంత్రం 06:00 గంటలకు చిలుకూరు మండలం కట్టకొమ్మగూడెం ఽరామాపురం గ్రామంలో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది,ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మీస్రా రాష్ట్ర నాయకులు ఇద్దరు పాల్గొంటున్నారు, కొండపల్లి ఆంజనేయులు మాదిగ,వడ్డేపల్లి కోటేష్ మాదిగ,గ్రామ ప్రజలు,యువకులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు అనుబంధ సంఘాలు అయిన యమ్ ఆర్ పి ఎస్ , యమ్ యస్ పి , యమ్ ఎస్ యఫ్ , ఎంజేఫ్ , ఎం ఇ యఫ్ మరియు అనుబంధ సంఘాల మండల కమిటీలు పాల్గొంటాయి అని చిలుకూరు మండల యమ్ ఆర్ పి ఎస్ ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ తెలిపారు

# "ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**ఆటపాటలతో ఉత్సాహం గడిపిన పూర్వ విద్యార్థులు**

**శంషాబాద్ మీడియా టుడే ప్రతినిధి జూన్ 12**



శంషాబాద్ మండల పరిధిలోని నర్కూడ జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్ లో 2005-2006 పదవ తరగతి బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు శుక్రవారం శంషాబాద్ మండల పరిధిలోని సుల్తాన్ పల్లి లో బ్యూటీ గ్రీన్ రిసార్ట్ లో 20 సంవత్సరాల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ, ఉపాధి, వ్యాపార, ఎక్కడెక్కడో స్థిరపరిడ వారంతా ఒకచోట కలుసుకున్నారు. కుటుంబ యోగాక్షేమాలు అడిగి తెలుసుకుని తరగతి గదుల్లో గత మధుర స్మృతులను గుర్తుచేసుకొని ఆటపాటలతో ఆనందంగా గడిపారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి ఆశీర్వచనలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, కృష్ణమూర్తి, జయవర్ధన్, అర్జున్, ప్రసన్న లక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మహిళలకు అవగాహన

**ఆలేరు నియోజకవర్గం, జూన్12(మీడియా టుడే):**



యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య భవనంలో ఏపీఎం నరసింహ అధ్యక్షతన "మంచి పరిసరాల విద్యాభివృద్ధి సంస్థ"ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మహిళలకు అవగాహన కార్యక్రమం శుక్రవారం రోజు నిర్వహించడం జరిగింది.నీడ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు కానుగంటి శ్రీశైలం మాట్లాడుతూ బాల కార్మికుల చట్టం,మహిళా చట్టాలు,ఎస్సీ ఎస్టీ అట్రా సిటీ చట్టాలు,ఉచిత న్యాయం తెలియాలనే ఉద్దేశంతో దేశవ్యాప్తంగా సమాచార హక్కు చట్టం ఉచిత న్యాయ సహాయం టోల్ ఫ్రీ నెంబర్ 15100 గురించి మహిళలకు అవగాహన కల్పించడం జరిగింది.జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, మండల న్యాయ సేవ అధికార సంస్థ గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీఎం నరసింహ,సంఘ బంధం అధ్యక్షురాలు రచ్చ పల్లవి, రజిత, మానస, సరిత, ఐలమ్మ, ఇంద్రజ, కల్పన, సుశీల, తదితరులు పాల్గొన్నారు.

# ఆలేరు పెద్దవాగు బ్రిడ్జి విస్తరణకై ఎంపీ,ఎమ్మెల్యేలకు డివైఎఫ్ఐ వినతిపత్రం

**ఆలేరు నియోజకవర్గం/ జూన్12(మీడియా టుడే):**



యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం ఆలేరు మండల పరిధిలోని పెద్దవాగుపై ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. ఈ శిథిలావస్థకు చేరిన ఇరుకు బ్రిడ్జి స్థానంలో తక్షణమే నూతన వెడల్పైన బ్రిడ్జిని నిర్మించాలని, నిధులను మంజూరు చేయాలని కోరుతూ డివైఎఫ్ఐ ఆలేరు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డికి, ఆలేరు శాసనసభ్యులు,ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకి శుక్రవారం రోజు వినతి పత్రం సమర్పించడం జరిగింది.

# యాలాల పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

**పెండింగ్ కేసులు లేకుండా పారదర్శక సేవలు అందించాలి**

**- పోలీసు అధికారులకు ఎస్పీ ఆదేశం**



వికారాబాద్ జిల్లా పోలీసు శాఖలో భాగంగా నిర్వహిస్తున్న వార్షిక తనిఖీల కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ గారు శుక్రవారం యాలాల పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సమగ్రంగా తనిఖీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ పనితీరు, పరిపాలనా వ్యవస్థ, కేసుల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న సేవల నాణ్యత తదితర అంశాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణ, పరిసర ప్రాంతాల పరిశుభ్రత, సిబ్బంది నిర్వహణ, కార్యాలయ వాతావరణాన్ని పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రిజిస్టర్లు, రికార్డులు, కేసు డైరీలు, పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను ఎలా పరిష్కరిస్తున్నారో తెలుసుకుని, నమోదైన కేసుల దర్యాప్తు పురోగతిపై ఆరా తీశారు.అలాగే బ్లూ కోల్ట్స్ వాహనాలు, పెట్రో కార్ల నిర్వహణ, వాటి పనితీరు, గస్తీ విధానాలు, అత్యవసర సమయాల్లో స్పందన తీరును సమీక్షించారు. ప్రజల భద్రతకు సంబంధించిన చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా ఎస్పీ స్నేహ మెహ్రా గారు మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన మరియు సత్వర స్పందనతో కూడిన పోలీసు సేవలను అందించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను శ్రద్ధగా విని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల దర్యాప్తును వేగవంతం చేసి ఎలాంటి కేసులు లేదా ఫైళ్లు పెండింగ్‌లో ఉండకుండా చూడాలని ఆదేశించారు. దర్యాప్తు పూర్తయిన వెంటనే సంబంధిత సమాచారాన్ని సీసీటీఎన్ఎస్ (జఋచీూ) వ్యవస్థలో నమోదు చేయాలని, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ నేరాల నియంత్రణ, నేరస్తుల గుర్తింపు, దర్యాప్తు ప్రక్రియలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. రాత్రి వేళల్లో గస్తీని ముమ్మరం చేసి అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు.ముఖ్యంగా మహిళలు, పిల్లలు, వృద్ధుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, వారి సమస్యల పరిష్కారంలో సున్నితంగా వ్యవహరించాలని సూచించారు. మహిళలపై నేరాలు, సైబర్ నేరాల నివారణకు సంబంధించి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు.ఇటీవల జిల్లా వ్యాప్తంగా ప్రజల భాగస్వామ్యంతో అమలు చేస్తున్న 'సురక్ష మిత్ర' మరియు 'నిఘా నేత్రం' కార్యక్రమాలు నేరాల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రజలు పోలీసు శాఖకు సహకరించేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని, గ్రామాలు, పట్టణాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో తాండూర్ డీఎస్పీ యాదయ్య, యాలాల ఎస్ఐ విట్టల్ రెడ్డి, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణ ఉల్లంఘనపై కఠిన చర్యలు

**విధులకు గైర్హాజరు, 8 మంది అంగన్‌వాడీ సిబ్బంది సేవల రద్దు,**

**విధులకు హాజరుకాని మూడు ప్రాజెక్టుల్లో 8 మంది అంగన్‌వాడీ సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు**

**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్.**



**మీడియా టుడే అచ్చంపేట (జూన్ 12):**

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో క్రమశిక్షణను పటిష్టపరచడంతో పాటు సేవల నాణ్యతను మెరుగుపరచే దిశగా జిల్లా పరిపాలన కీలక చర్యలు, ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.ఎంఎస్. నెం.14 నిబంధనల మేరకు, దీర్ఘకాలంగా విధులకు హాజరు కాకుండా ఉన్న 8 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సేవలను రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు.జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న కొంతమంది కార్యకర్తలు, ఆయాలు ఎలాంటి అనుమతి లేకుండా నెలల తరబడి, కొందరు సంవత్సరాల పాటు విధులకు గైర్హాజరవుతూ కేంద్రాల నిర్వహణకు ఆటంకం కలిగించినట్లు వెల్లడించారు. సంబంధిత శాఖ అధికారుల నివేదికలు, విచారణ అనంతరం శాఖాపరమైన చర్యలు చేపట్టి వారి సేవలను రద్దు చేసినట్లు పేర్కొన్నారు.అంగన్‌వాడీ కేంద్రాలు గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారంతో పాటు ఆరోగ్య సేవలు అందించే కీలక వ్యవస్థగా ఉన్నందున సిబ్బంది నిర్లక్ష్యం వల్ల లబ్ధిదారులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవడం అవసరమని కలెక్టర్ స్పష్టం చేశారు.అచ్చంపేట, బల్మూర్, కొల్లాపూర్ ప్రాజెక్టుల పరిధిలో పనిచేస్తున్న పలువురు అంగన్‌వాడీ సిబ్బంది 2023 ఫిబ్రవరి నుంచి 2026 జనవరి వరకు వివిధ కాలాల్లో విధులకు గైర్హాజరవుతున్నట్లు రికార్డులు వెల్లడించినట్లు తెలిపారు. సంబంధిత అధికారుల పరిశీలన అనంతరం వారి తొలగింపునకు ప్రతిపాదనలు సమర్పించగా, వాటికి ఆమోదం లభించినట్లు చెప్పారు. తొలగింపునకు గురైన వారిలో అచ్చంపేట ప్రాజెక్టుకు చెందిన జి. వెంకటమ్మ, ఎస్. అరుణ, బల్మూర్ ప్రాజెక్టుకు చెందిన జి. సుల్తానమ్మ, జె. మహాలక్ష్మి, కొల్లాపూర్ ప్రాజెక్టుకు చెందిన సి. పద్మావతి, నిరంజన్‌బెల్ల, కాశమ్మ, దర్జి బక్కమ్మ, ఉన్నారు.జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ విధుల పట్ల పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని, అనధికార గైర్హాజరు లేదా విధుల పట్ల నిర్లక్ష్యానికి పాల్పడిన వారిపై భవిష్యత్తులో కూడా ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ప్రభుత్వ సేవల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం, క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు.జిల్లాలో ప్రభుత్వ శాఖల సేవల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం, క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు తమ విధులను బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా నిర్వహించి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆయన సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం లేదా క్రమశిక్షణా ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# చెంచు గిరిజనుల అభివృద్ధికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

**విద్య, వైద్యం, తాగునీరు, ఉపాధి అంశాలపై ప్రత్యేక దృష్టి.**

**ఐటీడీఏ మన్ననూరులో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సమీక్ష.**

**మీడియా టుడే అచ్చంపేట (జూన్ 12)**



నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఐటీడీఏ మన్ననూరు ప్రాజెక్టు పరిధిలో అమలవుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ వివిధ శాఖల అధికారులతో శుక్రవారం మన్ననూర్ ఐటిడిఏ కార్యాలయంలో సమగ్ర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. చెంచు గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న కలెక్టర్, చెంచు పెంటర్లలో అమలవుతున్న కార్యక్రమాల పురోగతిని శాఖల వారీగా సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చెంచు గిరిజనులు, అత్యంత వెనుకబడిన గిరిజన వర్గాలవారి అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని,చెంచు కుటుంబాలకు విద్య, ఆరోగ్యం,తాగునీరు, పోషకాహారం,వనరులు, విద్యుత్,ఉపాధి అవకాశాలు వంటి ప్రాథమిక సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.విద్యాశాఖ పనితీరును సమీక్షిస్తూ చెంచు పెంటర్లలోని పిల్లలందరూ తప్పనిసరిగా పాఠశాలలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం, వసతి గృహాల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అమలు, డ్రాప్‌అవుట్‌ల నివారణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, చెంచు విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రోత్సాహక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.వైద్య ఆరోగ్య శాఖ సమీక్షలో గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అందుతున్న తీరును పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన వైద్య సేవలు, టీకాలు, పోషకాహార కార్యక్రమాలు క్రమం తప్పకుండా అందేలా చూడాలని, ప్రతి చెంచు పెంటకు ఆరోగ్య సిబ్బంది క్రమం తప్పకుండా వెళ్లి వైద్య సేవలు అందించడంతో పాటు సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలని వైద్య అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్, చెంచు పెంటర్లలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. పనిచేయని బోర్లు, పైపులైన్లు, నీటి సరఫరా వ్యవస్థలను వెంటనే మరమ్మతు చేసి ప్రజలకు నిరంతర నీటి సరఫరా కల్పించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.చెంచు యువత ఉపాధి అవకాశాల పెంపుపై ప్రత్యేకంగా దృష్టి సారించిన కలెక్టర్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేయాలని సూచించారు.యువతకు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని తెలిపారు.ప్రభుత్వ శాఖలు, ఐటీడీఏ, ఇతర సంస్థల సహకారంతో చెంచు యువతకు ఉపాధి కల్పనకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.చెంచు పెంటల్లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి అవసరమైన చోట్ల సోలార్ పంప్ సెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న చెంచు కుటుంబాలకు ఉపాధి, జీవనోపాధి అవకాశాల పెంపు కోసం లైవ్లీహుడ్ (లివలిహుడ్) కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని చెప్పారు.గిరిజన ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యాల విస్తరణలో భాగంగా ఇందిరా సౌర గిరిజల విద్యుత్ పథకం అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి అందరికీ చేరేలా ఆధార్ నమోదు, ఆధార్ అప్‌డేట్, ఆధార్‌కు మొబైల్ నంబర్ అనుసంధానం, ఆధార్ ఆధారిత సేవలు సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే రేషన్ కార్డుల సమస్యలు, ఆధార్ సంబంధిత ఇబ్బందులు, ఇతర ప్రభుత్వ సేవలకు సంబంధించిన అంశాల పరిష్కారం కోసం ప్రత్యేక సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా మొబైల్ నెట్‌వర్క్ అందుబాటులో ఉన్న చెంచు పెంటలను గుర్తించి అక్కడ సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు.నెట్‌వర్క్ సౌకర్యం లేని ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు తాత్కాలిక (టెంపరరీ) సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి, ఆధార్, రేషన్ కార్డు, ప్రభుత్వ ధ్రువపత్రాలు తదితర సేవలు సకాలంలో అందేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గిరిజనులకు సేవలందించడంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా సమన్వయంతో పనిచేయాలని, ప్రతి చెంచు కుటుంబానికి ప్రభుత్వ పథకాలప్రయోజనాలు చేరేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు.అదేవిధంగా చెంచు పెంటర్లలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, గృహనిర్మాణం, అభివృద్ధి పనులు ,విద్యుత్, పోషకాహార కార్యక్రమాలు, అంగన్‌వాడీ సేవలు, జీవనోపాధి పథకాల పురోగతిని కూడా సమీక్షించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి కార్యక్రమం చివరి వ్యక్తి వరకు చేరినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని పేర్కొన్న కలెక్టర్, శాఖల మధ్య సమన్వయం పెంచుకొని చెంచు గిరిజనుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, ఇంచార్జ్ డిటిడబ్ల్యుఓ ఉమాపతి, పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు, మిషన్ భగీరథ ఈఈ హేమలత ఐటీడీఏ ప్రాజెక్టు మేనేజర్ జాఫర్ హుస్సేన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## మోత్కూర్ బిజెపి మండల నాయకుల చాయ్ పే చర్చ కార్యక్రమం



**ఆలేరు నియోజకవర్గం, జూన్12(మీడియా టుడే):** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ12 సంవత్సరాల ప్రజాసేవా పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ మోత్కూరు మండల పార్టీ ఆధ్వర్యంలో మండల నాయకులతో "చాయ్ పే చర్చ" కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, దేశ ప్రగతికి చేపట్టిన సంస్కరణలపై నాయకులు చర్చించారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రధాని మోదీ నాయకత్వాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గుదే మధుసూదన్ యాదవ్,మండల ఉపాధ్యక్షులు పనక బండ ఉపసర్పంచి రాధారపు మల్లేశం,గుంటి సతీష్,నార్సింగ్ మహేష్,పత్తి బసవ శివ,నాయకులు బండ నరసింహ,ఇట్టబోయిన ఆంజనేయులు,నాయనీ ఉపేందర్,బత్తిని సతీష్, ముక్కామల గణేష్,శివ నరేందర్,వెంకటేష్, నారాసింహ, తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతమైన గర్భాశయ తొలగింపు శస్త్రచికిత్స.

**మీడియా టుడే అచ్చంపేట (జూన్ 12):**



అచంపేట్ కేర్ హాస్పిటల్ శ్రీమతి రహ్మత్ బీ (68 సంవత్సరాలు) గారికి థైరాయిడ్, అధిక రక్తపోటు (హై బీపీ), ఆస్తమా వంటి అనారోగ్య సమస్యలు ఉండటంతో పాటు ఆస్పిరిన్ మాత్రలు కూడా వాడుతున్నారు. అధిక ప్రమాదం ఉన్న కేసుగా భావించి కల్వకుర్తిలో పలువురు వైద్యులు శస్త్రచికిత్స చేయడానికి నిరాకరించారు.చివరగా అచ్చంపేట కేర్ హాస్పిటల్ ను సంప్రదించగా, మా నిపుణుల వైద్య బృందం విజయవంతంగా గర్భాశయ తొలగింపు శస్త్రచికిత్స (హిస్టరెక్టమీ)తో పాటు బైలాటరల్ సల్పింగో–ఓఫోరెక్టమీ నిర్వహించి, 10 ఐ 9 సెం.మీ. పరిమాణంలో ఉన్న అండాశయ సిస్టును సురక్షితంగా తొలగించింది.ప్రస్తుతం రోగి ఆరోగ్యంగా కోలుకొని, సాధారణ జీవితాన్ని ఆనందంగా గడుపుతున్నారు.క్లిష్టమైన శస్త్రచికిత్సలకు నమ్మకమైన చిరునామా గా అచ్చంపేట కేర్ హాస్పిటల్. మహానగర స్థాయి వైద్యం -- మన అచ్చంపేటలోనే అందుతుందని తెలిపారు.

## ఆలేరు మున్సిపాలిటీని సందర్శించి పలు అంశాలపై సమగ్రంగా చర్చించిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

**ఆలేరు నియోజకవర్గం, జూన్12(మీడియా టుడే):**



ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో కలిసి ఆలేరు మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి, మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు మరియు అధికారులతో పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సమగ్రంగా చర్చించిన భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి.అనంతరం ఆలేరు ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కచ్చా కాల్వ సమస్యకు శాశ్వత పరిష్కారంగా, రూ,,లు 2.60 కోట్ల వ్యయంతో చేపట్టనున్న నిర్మాణ పనులను బీర్ల ఐలయ్య మరియు తెలంగాణ మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణితో కలిసి ప్రారంభించడం జరిగింది. ఈ నిర్మాణ పనులు పూర్తయిన అనంతరం వర్షాకాలంలో ఏర్పడే నీటి నిల్వలు,మురుగునీటి పారుదల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు ఆలేరు పట్టణంలోని మౌలిక వసతులు మరింత మెరుగుపడనున్నాయి.ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందేలా నాణ్యతా ప్రమాణాలతో పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించడం జరిగింది.ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఆలేరు పట్టణ అభివృద్ధికి అవసరమైన ప్రతి చర్యను చేపట్టేందుకు కట్టుబడి ఉన్నామని తెలియజేయడం జరిగింది.

## ధర్నాకు తరలి వెళ్లిన గ్రామపంచాయతీ కార్మికులు.

**నడిగూడెం ,జూన్ 12 (మీడియా టుడే )–:**



సూర్యాపేట కలెక్టర్ ఆఫీస్ లో జరుగు ధర్నాకు నడిగూడెం మండలం నుంచి వెళ్లిన గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని ,వేతనాల్ని పెంచాలని సర్వీస్ క్రమబద్ధీకరించాలని యూనియన్ అధ్యక్షులు షేక్ సుభాని డిమాండ్ చేశారు ధర్నాకు వెళ్లిన వారిలో సిమట నాగరాజు, వీరస్వామి, సూర్యనారాయణ ,వెంకన్న, వెంకటమ్మ, గురవయ్య, అనిల్ ,శ్రీకాంత్, కమలాకర్, అశోక్ ,శీను ,మన్సూర్, కళ్యాణి .యూనియన్ అధ్యక్షులు షేక్ తదితరులు ఉన్నారు

## భట్రాజు సంఘం ఎన్నికలపై కోర్టును ఆశ్రయించిన న్యాయవాది పాక నవీన్ బాబు

### ఎన్నికల ప్రక్రియ నిలిపివేయాలని సిటీ సివిల్ కోర్టులో పిటిషన్

**ఉప్పల్, జూన్ 12 (మీడియా టుడే ప్రతినిధి):**



తెలంగాణ రాష్ట్ర భట్రాజు సంఘంలో జరుగుతున్న రాష్ట్ర, జిల్లా స్థాయి ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలని కోరుతూ సిటీ సివిల్ కోర్టు హైదరాబాద్‌లో పిటిషన్ దాఖలైంది. న్యాయవాది పాక నవీన్ బాబు, పిటిషనర్ ఓంకారం సంతోష్ రాజు తరఫున ఓపీ నంబర్ 31/2026 కింద పిటిషన్ దాఖలు చేశారు.సంఘం నియమావళి, బైల ప్రకారం ఎన్నికలు నిర్వహించడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటులో ఆయా జిల్లాలకు చెందని వ్యక్తులను సభ్యులుగా చేర్చి, వారినే అధ్యక్ష పదవులకు ఎన్నుకోవడం ద్వారా అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు.సంఘ నిబంధనల ప్రకారం సంబంధిత జిల్లాకు చెందిన సభ్యులే ఆ జిల్లా అధ్యక్ష పదవికి పోటీ చేయాల్సి ఉండగా, ఇతర జిల్లాలకు చెందిన వారిని ఎన్నుకోవడం సభ్యుల హక్కులకు విరుద్ధమని న్యాయవాది పాక నవీన్ బాబు తెలిపారు.ఎన్నికల ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలకు తావు లేకుండా ప్రస్తుత ఎన్నికలను నిలిపివేయాలని కోర్టును కోరినట్లు పేర్కొన్నారు. పిటిషన్‌పై కోర్టులో విచారణ జరగనుంది.

# తుంటి ఎముక శస్త్రచికిత్స వృద్ధుడి మృతి

### నర్సంపేట మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఘటనపై కలకలం

### వైద్య నిర్లక్ష్యమా - పర్యవేక్షణ వైఫల్యమా - సమగ్ర విచారణకు డిమాండ్

**వరంగల్ జిల్లా బ్యూరో జూన్ 12,మీడియా టుడే.** మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం మడేగూడెం గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు తుంటి ఎముక విరగడంతో చికిత్స కోసం నర్సంపేట పట్టణంలోని ఓ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చేరినట్లు సమాచారం. అక్కడ నిర్వహించిన శస్త్రచికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**ఆపరేషన్ అనంతరం విషమించిన ఆరోగ్యం**

కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, తుంటి ఎముక విరగడంతో ఆస్పత్రిలో చేరిన వృద్ధుడికి శస్త్రచికిత్స నిర్వహించారు. అయితే ఆపరేషన్ అనంతరం కొద్దిసేపటికే ఆరోగ్య పరిస్థితి క్షీణించిందని, మెరుగైన వైద్యం కోసం మరో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు చెబుతున్నారు.

**-శస్త్రచికిత్సకు ముందు అన్ని పరీక్షలూ జరిగాయా?-**

శస్త్రచికిత్సకు ముందు రోగి ఆరోగ్య పరిస్థితిని పూర్తిస్థాయిలో అంచనా వేశారా? గుండె, రక్తపోటు, ఇతర ఆరోగ్య సమస్యలపై అవసరమైన పరీక్షలు నిర్వహించారా? వృద్ధాప్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారా? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి.

**-డాక్టర్లపై నమ్మకం.. కానీ ఎందుకీ అనుమానాలు?-**

ప్రజలు డాక్టర్లను రెండో దేవుడిగా భావించి ఆస్పత్రులకు వస్తారని, ప్రాణం కాపాడబడుతుందనే నమ్మకంతో వైద్యం చేయించుకుంటారని స్థానికులు పేర్కొంటున్నారు. అలాంటి పరిస్థితుల్లో చికిత్స అనంతరం మరణం సంభవించడంతో పూర్తి వాస్తవాలు వెలుగులోకి రావాలని కోరుతున్నారు.

**-ప్రజల ప్రాణాల కంటే లాభాలకే ప్రాధాన్యతా?-**

కొన్ని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు ప్రజల ప్రాణాల కంటే ఆర్థిక లాభాలకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆధునిక వైద్య సదుపాయాలు, భారీ ప్రచారాలు ఉన్నప్పటికీ కొన్ని సందర్భాల్లో వైద్య సేవల నాణ్యతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**-రాజీ ప్రయత్నాలపై వినిపిస్తున్న ఆరోపణలు-**

వృద్ధుడి మరణం అనంతరం బాధిత కుటుంబ సభ్యులతో ఆస్పత్రి యాజమాన్యం చర్చలు జరిపిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆర్థిక సహాయం పేరుతో కొంత మొత్తాన్ని అందజేసి విషయం మరింత వివాదాస్పదం కాకుండా చూసే ప్రయత్నం జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ లేకపోవడంతో సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

**-మడేగూడెం గ్రామంలో విషాద ఛాయలు-**

వృద్ధుడి మృతితో మడేగూడెం గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. కుటుంబానికి అండగా ఉన్న వ్యక్తిని కోల్పోవడంతో బంధువులు, గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**-ప్రైవేట్ ఆస్పత్రులపై పర్యవేక్షణ ఎక్కడ?-**

జిల్లాలోని కొన్ని ప్రైవేట్, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇటువంటి ఘటనలు చోటుచేసుకుం టున్నాయని ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. వైద్యశాఖ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి ఉంటే ఇటువంటి పరిస్థితులు ఎదురయ్యేవి కావని పేర్కొంటున్నారు.

**-డీఎంహెచ్‌వో వ్యవస్థపై కూడా ప్రశ్నలు-**

ఈ ఘటన నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పనితీరుపై కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగులకు అందుతున్న వైద్యం, శస్త్రచికిత్సల నిర్వహణ, అత్యవసర సేవలు, వైద్య ప్రమాణాల అమలు వంటి అంశాలపై తగిన పర్యవేక్షణ జరగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**-ఫైర్ సేఫ్టీ సమావేశాలేనా?.. వైద్య సేవల పర్యవేక్షణ లేదా?-**

ఫైర్ సేఫ్టీ, భవన భద్రత అంశాలపై సమావేశాలు నిర్వహిస్తున్నప్పటికీ, రోగులకు అందుతున్న వైద్యం నాణ్యత, శస్త్రచికిత్సల ప్రమాణాలు, అత్యవసర సేవలపై కూడా అదే స్థాయిలో పర్యవేక్షణ అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**-ఫోన్ చేసినా స్పందన లేదనే విమర్శలు-**

ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు సంబంధించిన సమాచారం లేదా ఫిర్యాదుల కోసం జిల్లా వైద్యాధికారిని సంప్రదించేందుకు ప్రయత్నించినప్పుడు స్పందన లభించడం లేదని కొందరు ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజల సమస్యలపై స్పందించే వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కోరుతున్నారు.

**-ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని డిమాండ్-**

జిల్లాలోని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్‌తో పాటు ప్రైవేట్ ఆస్పత్రులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. వైద్య ప్రమాణాలు, అత్యవసర సేవలు, శస్త్రచికిత్సల విధానాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నారు.

**-కలెక్టర్ జోక్యంతో నిపుణుల కమిటీ విచారణ జరగాలి-**

ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి నిపుణుల కమిటీతో విచారణ జరిపించాలని ప్రజలు కోరుతున్నారు. శస్త్రచికిత్సకు ముందు, తర్వాత జరిగిన వైద్య ప్రక్రియలు, మరణానికి దారితీసిన కారణాలు, ఘటన అనంతరం జరిగిన పరిణామాలపై సమగ్ర నివేదిక విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**-నిజాలు వెలుగులోకి రావాల్సిందే-**

ఈ ఘటనలో వైద్య నిర్లక్ష్యం జరిగిందా? లేక అనివార్య వైద్య కారణాల వల్ల మరణం సంభవించిందా? అన్నది అధికారుల విచారణ ద్వారానే తేలాల్సి ఉంది. వాస్తవాలు వెలుగులోకి వచ్చి బాధ్యులపై చర్యలు తీసుకున్నప్పుడే ప్రజల్లో వైద్య వ్యవస్థపై విశ్వాసం మరింత బలపడుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని ప్రతి శుక్రవారం నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**ఆలేరు నియోజకవర్గం, జూన్12(మీడియా టుడే):** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మున్సిపాలిటీ 7వ వార్డులో శుక్రవారం రోజు నిర్వహిఒచిన "డ్రై డే ఫ్రైడే" కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పాల్గొన్నారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో జిల్లాలో ప్రతి వారం డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం అని అన్నారు.ఇళ్లలోని నీటి ట్యాంకులు,పాత డబ్బాలు, పాత్రలు వంటి వాటిలో నిల్వ ఉండే నీటిని పూర్తిగా తొలగించి శుభ్రపరచాలని సూచించారు. అలాగే కూలర్లను తరచుగా శుభ్రం చేయడం,కొబ్బరి చెక్కలు, పాత టైర్లు వంటి వ్యర్థాలను తొలగించడం ద్వారా దోమల పెరుగుదలను అరికట్టవచ్చన్నారు.ప్రతి కాలనీలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టడంతో పాటు దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా డెంగ్యూ వ్యాధికి కారణమయ్యే దోమలు శుభ్రమైన నిల్వ నీటిలోనే పెరుగుతాయని, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కాలనీలలో ఉన్న ఓపెన్ డ్రైనేజీలలో ఆయిల్ బాల్స్ వేయాలని అధికారులకు సూచించారు.దోమల నివారణ చర్యలను నిరంతరం కొనసాగించాలని చెప్పారు. అనంతరం కాలనీలో అసంపూర్తిగా ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించి, మున్సిపల్ సిబ్బందితో వీలైనంత త్వరగా డ్రైనేజీ వ్యవస్థ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,స్థానిక ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

### ఆలేరులో ఉమ్మడి నల్గొండ జిల్లా మహిళా కాంగ్రెస్ సమావేశానికి

# ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

**ఆలేరు నియోజకవర్గం, జూన్12(మీడియా టుడే):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో ఉమ్మడి నల్గొండ(యాదాద్రి భువనగిరి, నల్గొండ,సూర్యాపేట)జిల్లాల మహిళా కాంగ్రెస్ సమావేశం యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ ఆధ్వర్యంలో నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి,ఆలేరు శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య హాజరయ్యారు.ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ,రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి,సూర్యాపేట జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు టి.అనురాధ మరియు నల్గొండ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గోపగాని మాధవి ప్రత్యేకంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో మరియు రాష్ట్రంలో మహిళల సంక్షేమానికి,ఆర్థిక సాధికారతకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అగ్రతాంబూలం ఇస్తుం దని స్పష్టం చేశారు. ఇందిరమ్మ రాజ్య స్థాపనలో మహిళల పాత్ర అత్యంత



కీలకమైన దని, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మహిళా ప్రజాప్రతి నిధులు, నాయకురాళ్లు క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపుని చ్చారు.ఈ మహాసభలో ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని రాష్ట్ర స్థాయి ప్రతినిధులు, నియోజ కవర్గాల మహిళా ప్రజాప్రతినిధులు, వివిధ మండలాల అధ్యక్షురాళ్లు, మరియు పెద్ద సంఖ్యలో మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకురాళ్లు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు అందజేయాలి

### బీఆర్ఎస్,కాంగ్రెస్ పాలనలో కోట్ల రూపాయల ప్రజాధనం వృధా.



**కోదాడ, జూన్ 12 (మీడియా టుడే)–:** కోదాడ పట్టణంలోని బాలాజీ నగర్ లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను డ్రా లో కేటాయించిన లబ్ధిదారులకు తక్షణమే అందజేయాలని బిజెపి నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిజెపి సూర్యాపేట జిల్లా కమిటీ సభ్యులు జల్లా జనార్ధన్ ఆధ్వర్యంలో ఆర్డీవో సూర్యనారాయణ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్ల అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరిట ప్రజలను మోసం చేసిందని నేడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గడిచిన రెండున్నర ఏళ్లలో నిర్మాణం పూర్తిగా వచ్చిన ఇళ్ళను పేద ప్రజలకు అందజేయడంలో పూర్తిగా ప్రభుత్వం విఫలమైందన్నారు. రెండు ప్రభుత్వాల తీరుతో కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నేడు శిథిలావస్థకు చేరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతోమంది పేద ప్రజలు ఎండకు ఎండి వానకు తడుస్తూ దుర్భర జీవితం జీవిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే కళ్ళు తేరచి అర్హులైన వారికి కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మునగాల శ్రీనివాస్, చిలుకూరి శ్రీను, గంగిరెడ్డి రాకేష్ రెడ్డి, పైడిమర్రి సతీష్, కనుమర్లపూడి శ్రీహరి, కుదుమురి ఈశ్వరరావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు..

## పాఠశాల పునఃప్రారంభానికి ముందే అన్ని సౌకర్యాలు సిద్ధంగా ఉండాలని విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు

### -అదనపు కలెక్టర్ డా. అశ్వని తానాజీ వాకడే




**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ : మీడియా టుడే , జూన్ 12 :** కరీంనగర్ జిల్లా అదనపు పాలనాధికారి డాక్టర్ అశ్వని తానాజీ వాకడే పాఠశాల పునఃప్రారంభ కార్యక్రమంలో భాగంగా ఎలగందల్, కొత్తపల్లి మండలంలోని విద్యాసంస్థలను సందర్శించి మౌలిక వసతుల పరిస్థితిని పరిశీలించారు.ఈ సందర్భంగా ఎలగందల్ మోడల్ స్కూల్, జడ్పీహెచ్ఎస్ హైస్కూల్, కేజీబీవీ మరియు సాంఘిక సంక్షేమ హాస్టళ్లను సందర్శించిన ఆమె, అక్కడ విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, భవనాల మరమ్మతులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ మరియు ఇతర సౌకర్యాలపై సమీక్ష నిర్వహించారు. పరిశీలనలో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేసి, పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి అన్ని వసతులతో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విద్యాసంస్థలను సన్నద్ధం చేయడం అధికారుల బాధ్యత అని పేర్కొన్న అదనపు కలెక్టర్, ప్రతి పనిని నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో టీజీడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్ కుమార్, ప్లానింగ్ సమన్వయాధికారి మిలుకూరి శ్రీనివాస్, కొత్తపల్లి మండల విద్యాధికారి తుమ్మా ఆనందం తదితరులు పాల్గొన్నారు.

## రేస్ కళాశాలలో డ్రగ్స్ నిరోధక అవగాహన కార్యక్రమం

**కోదాడ,జూన్ 12 (మీడియా టుడే)–:** కోదాడ పట్టణంలోని రేస్ కళాశాలలో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, ఎస్ఐ సుధీర్ కుమార్ పాల్గొని విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే



దుష్పరిణామాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చెడు అలవాట్లకు లోనుకాకుండా చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబం, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు.డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారు కోరారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు 'డ్రై డే-ఫ్రైడే' పాటించాలి

### వైద్యాధికారి కిరణ్ కుమార్



**కుల్కచర్ల, మీడియా టుడే,12 జూన్:** పరిసరాల పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చని, అందుకే ప్రతి శుక్రవారం 'డ్రై డే–ఫ్రైడే' కార్యక్రమాన్ని ప్రజలు ఖచ్చితంగా పాటించాలని కుల్కచర్ల మండల వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని బందెల్కిచర్ల గ్రామంలో సర్పంచ్, పంచాయతీ సెక్రటరీ సహకారంతో ఆరోగ్య కార్యకర్తలు ముమ్మరంగా ఇంటింటి సర్వే నిర్వహించారు.?ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. ఇళ్లలో నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచడం వల్ల దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి ప్రాణాంతక జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రజలు తమ ఇళ్లతో పాటు పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బందెల్కిచర్ల సర్పంచ్ శ్రీనివాస్, పంచాయతీ సెక్రటరీ, ఏఎన్ఎం సుజాత మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పీఏ రమేశ్‌కు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి జన్మదిన శుభాకాంక్షలు

### - ప్రజా సేవలో రమేశ్ పనితీరు అభినందనీయం



**ఉప్పల్, జూన్ 12 (మీడియా టుడే ప్రతినిధి):** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వ్యక్తిగత సహాయకుడు ఆలేటి రమే శ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలి పారు. ఈ సందర్భంగా రమేశ్‌ను అభినందిం చిన ఎమ్మెల్యే.. ప్రజా ప్రతినిధి కార్యాలయ పనుల్లో సమన్వయంతో, బాధ్యతతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని పేర్కొన్నారు.ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధి కార్యక్ర మాల అమలులో రమేశ్ అందిస్తున్న సహకారం ప్రశంసనీయమన్నారు. సేవాభావంతో పనిచేస్తున్న ఆయనకు భవిష్యత్తులో మరిన్ని విజయాలు, మంచి ఆరోగ్యం కలగాలని ఆకాంక్షించారు.

## లక్షల విలువైన ఫర్నిచర్ చెత్తకుప్పల మారిన వైనం పై వచ్చిన వార్తకు స్పందన



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి మీడియా టుడే జూన్ 12:** లక్షల విలువైన ఫర్నిచర్ చెత్తకుప్పల మారిన వైనం పై శుక్రవారం జిల్లా మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సామాగ్రిని సక్రమంగా సరిదిద్ది తాత్కాలికంగా ఫ్లెక్సీలను కప్పి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. ఇట్టి విషయంపై జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారి ని వివరణ అడగగా జిల్లా కలెక్టర్ సమీకృత కార్యాలయంలో స్థలం లేకపోవడంతో అచ్చట పెట్టడం జరిగిందని జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి మల్లేశ్వరి తెలిపారు. వికలాంగులకు అందించవలసిన ట్రై సైకిళ్లను మంజూరు చేసిన ట్రై సైకిల్ మాకు వద్దు అంటూ ఎవరు తీసుకువెళ్లకపోవడంతో అవి నిల్వ ఉండడం జరిగిందన్నారు. అధునాతనంగా ప్రభుత్వం అందించే నూతనంగా బ్యాటరీ ట్రైసైకిళ్లు, స్కూటీలు కావాలని వికలాంగులు కోరిన విధంగా ప్రభుత్వం అందించకపోవడంతో వచ్చిన లిస్టు ప్రకారంగా అధునాతన వాహనాలను అందజేయడం జరిగిందన్నారు.

# సెర్ప్ , ఉపాధి హామీ సిబ్బందికి ప్రత్యేక హెల్త్ క్యాంప్

### - 202 మందికి వైద్య పరీక్షలు - పని ఒత్తిడిలో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

### జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యాచందన




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో వాసు,జూన్ 12(మీడియా టుడే):** గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ముఖ్య కార్యనిర్వహణ అధికారి దివ్య దేవరాజన్ ఆదేశాల మేరకు శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లాలో పనిచేస్తున్న సెర్ప్, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బందికి ప్రత్యేక హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఎరిక్సన్ ఇన్సూరెన్స్ టీపీఏ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేశారు.జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యాచందన హెల్త్ క్యాంపును పరిశీలించారు.సిబ్బందిలో అధిక శాతం మంది 40 సంవత్సరాలు దాటిన వారేనని, విధుల్లో ఎదురయ్యే ఒత్తిడి కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ప్రతి సంవత్సరం ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహించడం అవసరమని ఆమె పేర్కొన్నారు.ఈ హెల్త్ క్యాంపులో 106 మంది సెర్ప్ సిబ్బంది, 96 మంది ఉపాధి హామీ ,ఇతర శాఖల ఉద్యోగులు పాల్గొనగా, మొత్తం 202 మందికి రక్తపోటు, షుగర్, క్యాల్షియం, కొలెస్ట్రాల్, లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలతో పాటు ఈసీజీ, 2డీ ఎకో, కంటి సంబంధిత పరీక్షలు నిర్వహించారు.యశోద హాస్పిటల్, మలక్‌పేట్, హైదరాబాద్, పాత్‌కైండ్ లాబొరేటరీస్, శరత్ మ్యాక్స్ విజన్, వరంగల్ సంస్థల సహకారంతో ఎరిక్సన్ ఇన్సూరెన్స్ టీపీఏ ప్రైవేట్ లిమిటెడ్ ఈ శిబిరాన్ని నిర్వహించింది. ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అధికారులు తెలిపారు.

# టీజీపీఎస్సీ ఫీజుల పెంపుపై ఏఐవైఎఫ్ నిరసన

- నిరుద్యోగులపై ఆర్థిక భారం మోపొద్దు.. పెంచిన ఫీజులను ఉపసంహరించాలి
- దరఖాస్తు రుసుము పెంపు వెంటనే నిలిపివేయాలని డిమాండ్
- వేర్వేరు నోటిఫికేషన్లతో అభ్యర్థులపై అదనపు భారం పడుతోందని ఆవేదన




**ఉప్పల్, జూన్ 12 (మీడియా టుడే ప్రతినిధి):** టీజీపీఎస్సీ ఉద్యోగ నోటిఫికేషన్లలో దరఖాస్తు రుసుము పెంపును నిరసిస్తూ అఖిల భారత యువజన సమాఖ్య తెలంగాణ రాష్ట్ర సమితి నాయకులు టీజీపీఎస్సీ కార్యాలయంలో అదనపు కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. గతంలో రూ.200గా ఉన్న దరఖాస్తు ప్రాసెసింగ్ ఫీజును రూ.1000కు పెంచడం వల్ల నిరుద్యోగ యువతపై 400 శాతం అదనపు భారం పడుతోందని ఏఐవైఎఫ్ నాయకులు ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500, ఓసీ, బీసీ అభ్యర్థులకు రూ.1000గా ఫీజు నిర్ణయించడం సరికాదన్నారు.ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది యువతపై దరఖాస్తుల పేరుతో ఆర్థిక భారం మోపడం అన్యాయమని పేర్కొన్నారు. ఒకే శాఖలోని పోస్టులను వేర్వేరు నోటిఫికేషన్లుగా విడుదల చేయడం వల్ల అభ్యర్థులు ప్రతి నోటిఫికేషన్‌కు విడిగా ఫీజులు చెల్లించాల్సి వస్తోందన్నారు .ఉద్యోగాల భర్తీ ప్రక్రియ వేగవంతం చేయడంతో పాటు పెంచిన దరఖాస్తు రుసుములను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని ఏఐవైఎఫ్ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్. బాలకృష్ణ, రాష్ట్ర సమితి సభ్యులు షేక్ మహమూద్ పాల్గొన్నారు.

# నా తండ్రి నుండి సంక్రమించిన వారసత్వం వాటాను కాపాడండి

### రామలక్ష్మణ చార్యులు



**కోదాడ, జూన్ 12 (మీడియా టుడే)–:** నా తండ్రి ముడుంబ వెంకట నరసింహాచార్యులు నుండి సంక్రమించిన శ్రీ దావుల బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయ అర్చకత్వ వాటాను కాపాడా కాపాడాలని, దేవాలయ శాఖ కమిషనర్ సహాయ కమిషనర్ ను ప్రస్తుత అర్చకులు రామ లక్ష్మణ చార్యులు కోరారు.ఈ దేవాలయ అర్చకత్వం నా తండ్రి 2004 వరకు నిర్వర్తించుకుంటూ 2004లో మరణించారు.ఈ మరణ అనంతరం దేవాలయ అర్చకత్వాన్ని చిన్నవాడనైనా నేను నిరుద్యోగి కావడంతో బాధ్యతలు నాకు అప్పగించినారు.ఈ దేవాలయం క్రింద సుమారు 8 ఎకరాల భూమిని కౌలుకి ఇచ్చుకుంటూ కుటుంబాన్ని పోషించుకోవడం జరిగింది. నాన్నకు ముగ్గురు కొడుకులు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు కావడంతో అర్చకత్వ బాధ్యతలు నాకు అప్పగించడం జరిగింది. అప్పటినుండి ఇప్పటివరకు దేవాలయ అర్చకత్వాన్ని నిర్వర్తించుకుంటూ నా బాధ్యతలను నెరవేరుస్తూ దేవునికి సేవ చేసుకుంటున్నాను.2022 దేవాలయం కింద ఉన్న భూములకు కౌలు కొంత పెరగటంతో,నా రెండో అన్నయ్య వరదస్వామి వరదా చార్యులు,ఈ దేవాలయ భూముపై కన్ను వేసి నేను చేసుకుంటున్న భూమిని లాక్కునేందుకు ఇబ్బందులకు గురిచేస్తూ, 2025 లో నేను చేసుకుంటున్న భూమిలో రెండున్నర ఎకరాల భూమిని లాక్కొని,కౌలుకి ఇచ్చుకుంటూ అనుభవిస్తున్నాడు.దీనిపై ప్రశ్నించగా నాపై చేయి చేసుకొని అనేక ఇబ్బందులు గురిచేస్తుండగా,స్థానిక అనంతగిరి పోలీస్ స్టేషన్ ఎస్ కు ఫిర్యాదు చేయడం జరిగింది.అలాగే హైదరాబాద్ దేవాలయ శాఖ కమిషనర్ నల్లగొండ దేవాలయ సహాయ కమిషనర్ కు ఫిర్యాదు చేయడం జరిగింది. ఇప్పటికీ భూమిని తానే కౌలుకిస్తూ నాకు అన్యాయం చేస్తున్నాడు. శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ఈవో స్పందించి తగు న్యాయం చేయాలని కోరుచున్నాను..

# మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ

### పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

### పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి - డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం నిర్వహించాలి



**మెదక్ జిల్లా మీడియా టుడే జూన్12** మెదక్ జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ, విధి నిర్వహణలో లోపాలు గుర్తించిన అధికారులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటూ క్రమశిక్షణకు పెద్దపీట వేస్తున్న మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ శుక్రవారం మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు, పెండింగ్ కేసులు, నేర నియంత్రణ చర్యలు, సిబ్బంది విధి నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను సమీక్షించిన ఎస్పీ, వాటి దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేసుల విచారణలో నిర్లక్ష్యం లేకుండా సమయపాలనతో విధులు నిర్వహించాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చేపడుతున్న చర్యలపై ఎస్పీ సమీక్ష నిర్వహించారు. ట్రాఫిక్ నియంత్రణ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని ఆదేశించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించిన ఎస్పీ, ముఖ్య కూడళ్లు, వ్యాపార ప్రాంతాలు, ప్రమాదకర ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఎప్పటికప్పుడు పనిచేసేలా చూడాలని అధికారులకు సూచించారు. నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసి నేర నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని తెలిపారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు అండగా నిలుస్తూ, వారి ఫిర్యాదులను సక్రమంగా నమోదు చేయడంలో సహకరించాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ అవసరమైన సహాయం అందించాలని తెలిపారు.అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమైన ఎస్పీ, విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటించాలని సూచించారు. ప్రజల ఫిర్యాదులను వెంటనే స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ తో మెదక్ టౌన్ సీఐ మహేష్, ఎస్బి ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నకిలీ విత్తన విక్రేతలపై కఠిన చర్యలు తీసుకోవాలి

### - సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో వాసు,జూన్ 12(మీడియా టుడే):** జిల్లాలో నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు వ్యవసాయ శాఖ అధికారులు, టాస్క్‌ఫోర్స్ బృందాలు కఠిన చర్యలు తీసుకోవాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ డిమాండ్ చేశారు.జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, టాస్క్‌ఫోర్స్ తనిఖీలు నామమాత్రంగా జరుగుతున్నాయని, దీంతో నకిలీ విత్తనాల విక్రయాలు పెరుగుతున్నాయని అన్నారు. మండలాల వారీగా ప్రతిరోజూ ఫెర్టిలైజర్ దుకాణాలపై తనిఖీలు నిర్వహించాలని కోరారు.నకిలీ విత్తనాలు విక్రయిస్తూ పట్టుబడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, వారి లైసెన్సులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ప్రతి ఫెర్టిలైజర్ దుకాణంలో లైసెన్స్ వివరాలు, అనుమతి పొందిన విత్తన కంపెనీల పేర్లు, విత్తన రకాలు, స్టాక్, ధరలు, ఫిర్యాదు నంబర్లతో సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు.ముఖ్యంగా పత్తి విత్తనాల విక్రయంపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి, రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్, సేవాలాల్ రైతు సేన నాయకులు ధరావత్ కృష్ణ నాయక్, బానోతు నరేష్ నాయక్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఐటీఐ నూతన ప్రిన్సిపాల్‌గా సారంగపాణి బాధ్యతల స్వీకరణ

**- విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానన్న నూతన ప్రిన్సిపాల్.**

**- ఐటీఐ ప్రవేశాలను సద్వినియోగం చేసుకోవాలని యువతకు పిలుపు.**



**మణుగూరు,జూన్ 12( మీడియా టుడే):**

మణుగూరు ప్రభుత్వ ఐటీఐ నూతన ప్రిన్సిపాల్‌గా ఓ. సారంగపాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో భూపాలపల్లి ఐటీఐలో ట్రైనింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన ఆయన పదోన్నతిపై మణుగూరుకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఐటీఐలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు. విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. అలాగే ఐటీఐ ప్రవేశాలకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు ఉన్నందున స్థానిక యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంత యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఐటీఐల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) కోర్సులను ప్రవేశపెట్టి ఆధునిక సాంకేతిక విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించిన డి. వెంకటేశ్వర్‌రావుకు అభినందనలు తెలియజేస్తూ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఐటీఐ, ఏటీసీ సిబ్బంది నూతన ప్రిన్సిపాల్‌కు ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఐటీఐ సూపరింటెండెంట్ జ్యోతిరాణి, సీనియర్ అసిస్టెంట్ సాధన, ఏటీవోలు జి.వి. కృష్ణారావు, ఎం. శ్రీనివాసరావు, ఎ. నర్సయ్య, వేణు గోపాల్ నాయుడు, కే. ధర్మయ్య, ఏటీసీ మాస్టర్ ట్రైనర్ పూర్ణచంద్రరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తోపాజి అనంత కిషన్ ప్రమాణ స్వీకారం

**సంగారెడ్డి జిల్లా, మీడియా టుడే బ్యూరో, జూన్12.**



హైదరాబాద్‌లోని చంపాపేట్ సామ సరస్వతి గార్డెన్‌లో శనివారం నిర్వహిం చిన కార్యక్రమంలో సంగారెడ్డికి చెందిన తోపాజి అనంత కిషన్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి ౧. +. వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా తోపాజి అనంత కిషన్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర ఉపాధ్యక్ష పదవిని అప్పగించిన మహాసభ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్యుల సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్యవైశ్య సమాజ ఐక్యత, సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తానని చెప్పారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరావతి లక్ష్మీనారాయణ తోపాజి అనంత కిషన్‌కు అభినందనలు తెలియజేస్తూ, సంస్థ అభివృద్ధికి ఆయన సేవలు ఉపయోగపడ తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహాసభ నాయకులు, ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొని నూతన రాష్ట్ర ఉపాధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు.

# టీజీఐఐసీ స్పోర్ట్స్ మీట్ ముగింపు

**గచ్చిబౌలిలో సాంస్కృతిక కార్యక్రమాలు**

**విజేతలకు బహుమతులు అందజేసిన నిర్మలా జగ్గారెడ్డి, శశాంక**




**సంగారెడ్డి జిల్లా , మీడియా టుడే బ్యూరో /జూన్ 12.**

టీజీఐఐసీ ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్ శుక్రవారం సాంస్కృతిక కార్యక్రమాలతో ముగిసింది. మూడు రోజులుగా కొనసాగిన ఈ కార్యక్రమంలో భాగంగా గచ్చిబౌలిలోని ఐఎస్‌బీ ఖేంకా ఆడిటోరియంలో ఉద్యోగులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాటలు, నృత్యాలతో ఉత్సాహంగా పాల్గొన్న ఉద్యోగులు సందడి చేశారు. అనంతరం రెండు రోజుల పాటు నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన ఉద్యోగులకు టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, ఎండీ శశాంక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు విధి నిర్వహణతో పాటు తమ అభిరుచులకు సమయం కేటాయించాలని సూచించారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడంతో పాటు పనితీరును మెరుగుపరుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీజీఐఐసీ ఈడీలు పవన్, వీరారెడ్డి, ఇతర ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఇష్టపడి చదవండి..లక్ష్యాన్ని సాధించండి

**నాణ్యమైన విద్యకు చిరునామా ప్రభుత్వ విద్యాసంస్థలు..**

**పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి**


**పటాన్ చెరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ**

**పటాన్ చెరు ప్రతినిధి, మీడియా టుడే, జూన్ 12 :**



తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఇష్టపడి చదివి.. లక్ష్యాన్ని సాధించాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. శుక్రవారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినులకు నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ డిజిటల్ ప్యానెల్స్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం అద్భుతమైన ఫలితాలు సాధిస్తూ ఉన్నత ఉద్యోగాలు సాధిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. పటాన్ చెరు నియోజకవర్గంలో ప్రభుత్వ విద్య వ్యవస్థ బలోపేతానికి ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తున్నామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు వంగరి అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ఎదుట ధర్నా కలెక్టర్‌కు వినతిపత్రం సిఐటియు



**మెదక్ జిల్లా మీడియా టుడే ప్రతినిధి జూన్ 12**

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారించాలని శుక్రవారం నాడు మెదక్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్ ప్రతిమా సింగ్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటీయు జిల్లా కోశాధికారి కె నర్సమ్మ మాట్లాడుతూ..గ్రామ పంచాయతీ కార్మికుల ను ఇష్టానుసారంగా తొలగిస్తున్న వారి పైన ప్రభుత్వం జోక్యం చేసుకొని అట్టివారి పైన చర్యలు తీసుకోవాలి. గతంలో 2000 సం॥నికి ముందు గ్రామ పంచాయితీలలో పనిచేస్తున్న సిబ్బంది అర్హత, నైపుణ్యం, సీనియార్టీని బట్టి పదోన్నతులు కల్పించాలన్నారు .ఆ సందర్భంలోనే జీఓ నెం.112, 212ల ప్రకారం 5-10 సం॥ల సర్వీస్ ఉన్నవారిని దశలవారీగా రెగ్యులర్ చేయాలని గత ప్రభుత్వాలు లిస్ట్ అవుట్ చేశాయి. ఆ ప్రకారం అర్హత కల్గిన వారికి పదోన్నతులు కల్పించకుండా గత ప్రభుత్వం జీఓ నెం.69 సెక్షన్-77ని తీసుకొచ్చి 10,000 పోస్టులను ఇతర డిపార్టమెంట్స్‌ని ఉద్యోగులతో పంచాయితీ కార్యదర్శుల నియామకం చేసి గత పంచాయితీ సిబ్బందికి తీరని అన్యాయం చేశారు. పైగా 2018లో జీఓ నెం.51 పేరుతో మల్టీపర్పస్ వర్కర్ పని విధానాన్ని ప్రవేశపెట్టి కేటగారీలను రద్దు చేసి పంచాయితీ కార్మికులకు ఎలాంటి భద్రత లేకుండా చేశారు. మల్టీపర్పస్ పేరుతో నైపుణ్యం లేని పనులు చేయించడం వల్ల కార్మికులు అనేక ప్రమాదాలకు గురవుతున్నారు. ట్రాక్టర్ నడిపే వారికి డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించడం లేదు. వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించకపోవడంతో అనేక ప్రమాదాలు జరిగి కార్మికులు మరణిస్తున్నారు. మరణించిన వారికి ఎలాంటి నష్టపరిహారం అందని పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా పంచాయతీ సిబ్బంది అందరినీ పర్మినెంట్ చేసి కనీస వేతనం అమలు చేయాలన్నారు .ప్రభుత్వం చెల్లిస్తున్న వేతనాలు గ్రీన్ ఛానల్ ద్వారా కార్మికుల అకౌంట్లలో జమ చేయాలి. పంచాయితీ సిబ్బందిని 2వ పిఆర్సిలో గుర్తించాలి. కనీస వేతనం రూ.26,000/లుగా నిర్ణయించాలి. 60 సం॥లు పైబడిన, అనారోగ్యం పాలైనా, సహజ, ప్రమాదవశాత్తు మరణించిన, ఇతర కారణాల వల్ల పనిచేయలేని కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు పని కల్పించాలి. అట్టి పద్ధతుల్లో ఇప్పటికీ పనిచేస్తున్న కార్మికుల పేర్లను ఆన్లైన్లో నమోదు చేయాలి. జీవో నెం.51 సవరణ, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలి. కారోబార్ బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలి. ప్రమాదం జరిగి మరణించిన సిబ్బందికి రూ.20 లక్షల నష్టపరిహారం, కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం, కార్మికులందరికి రూ.10 లక్షలు ఇన్సూరెన్స్ సౌకర్యం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలి. మరణించిన కార్మికుని దహన సంస్కారాలకు కనీసం రూ.30,000/-లు ఆర్థిక సహాయం అందించాలి. పంచాయతీ కార్మికులందరికి ఇందిరమ్మ ఇండ్లు, ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయించాలి. గ్రామపంచాయతీలు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పైన అనేకసార్లు ఎంపీడీవోలకు ,ఎంపీలకు సర్పంచులకు వినతి పత్రాలు ఇచ్చిన ఫలితం లేకపోవడం వలన ఈ నెల 12వ తారీకు నాడు గ్రామపంచాయతీ కార్మికులందరూ కలెక్టర్ ఆఫీస్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించా మన్నారు .ముఖ్యంగా ఎన్నికల లో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడ సిగ్గుచేటని అన్నారు. ప్రభుత్వము ప్రకటించిన గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు ఇస్తామని, గ్రామపంచాయతీ కార్మికులందరినీ ఫర్మినెంట్ చేస్తామని , ప్రతి నెల ఒకటో తారీఖు నాడు జీతాలు చెల్లిస్తామని నేటికీ అమలు కావడం లేదన్నారు. కార్మికులు చనిపోతే తెలంగాణ గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆసిఫ్ , జిల్లా నాయకులు రఘుపతి,మహేష్, శ్రీకాంత్,నర్సింలు ,పోచయ్య, సత్యం,వెంకయ్య, యాదమ్మ,నర్సమ్మ,లత తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమం, అభివృద్దే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**-రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**-ఇందిరమ్మ ఇళ్ల రెండవ విడత లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేత**

**-ప్రతి పేద కుటుంబ సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**-ఏదులాపురంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల క్రింద 76 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసిన మంత్రి పొంగులేటి**

**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :**

పేదల సంక్షేమం, అభివృద్ధే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. శుక్రవారం ఏదులాపురం మున్సిపల్ పరిధిలోని రాంలీలా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల క్రింద 76 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల రెండవ విడత లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారుఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన కుటుంబాలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించడం సంతోషంగా ఉందన్నారు. అదే విధంగా ఇందిరమ్మ ఇళ్ల రెండవ విడత లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేయడం ద్వారా వారి సొంత ఇంటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. గత రెండున్నర సంవత్సరాలుగా ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల మంజూరు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం వంటి పలు ప్రజా సంక్షేమ కార్యక్రమా లను ప్రభుత్వం విజయ వంతంగా అమలు చేస్తోందన్నారు .సమాజంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి తెలిపారు. పేదల సంక్షేమాన్ని కేంద్ర బిందువుగా చేసుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రజల ఆశీస్సులు, సహకారంతో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఆర్ అండ్ బి ఎస్‌ఈ యాకోబు, మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ వినయందర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# పాలేరు,ఖమ్మం నియోజక వర్గాల బూత్ లెవెల్ ఏజెంట్లకు శిక్షణ తరగతులు

**-ముఖ్య అతిథిలుగా పాల్గొన్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, టి పి సి సి ప్రధాన కార్యదర్శి బండి సుధాకర్**



**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :**

పాలేరు నియోజకవర్గ బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణా తరగతులు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన నిర్వహించనైనది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి . ఈ కార్యక్రమంలో వీరితో పాటు టి పి సి సి ప్రధాన కార్యదర్శి బండి సుధాకర్, నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, పాలేరు నియోజకవర్గ మండల కాంగ్రెస్ అద్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్ లు, ఆత్మ కమిటీ చైర్మన్ లు, బూత్ లెవెల్ ఏజెంట్లు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈ సమగ్ర ఓటర్ జాబిత సవరణ కార్యక్రమంలో బూత్ లెవెల్ ఏజెంట్లు సైనికునివలె పనిచేయాలని, సీనియర్ కాంగ్రెస్ నాయకుల సహకారం తీసుకోవాలని తద్వారా గ్రామాలలోని 18 సంవత్సరములు నిండిన ప్రతి పౌరునికి ఓటు హక్కు ఉండేలా బూత్ లెవెల్ ఏజెంట్లు పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. ఓట్ల వేటలో 'కేంద్రం' దొంగదారి!

**కాంగ్రెస్ బలంగా ఉన్న చోట ఓట్ల తొలగింపునకు కుట్ర**

30 నుంచి 35 శాతం ఓట్లను 'ఫేక్' పేరిట లేపేసే ప్లాన్,బీహార్, బెంగాల్ ఫార్ములాను ఇక్కడా ప్రయోగిస్తున్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలతో ప్రతిపక్ష ప్రభుత్వాలపై దాడి,పాలేరు 'బి.ఎల్.ఏ'ల శిక్షణ శిబిరంలో మంత్రి పొంగులేటి నిప్పులు కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రతిపక్ష పార్టీలను, ప్రతిపక్ష ప్రభుత్వాలను టార్గెట్ చేస్తూ ప్రజాస్వామ్య విరుద్ధమైన కుట్రలకు తెరలేపిందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో అప్రజాస్వామిక పాలన సాగుతోందని మండిపడ్డారు. టీపీసీసీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ల (బి.ఎల్.ఏ) అవగాహన శిక్షణ శిబిరం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని నాయుడుపేట క్రాస్ రోడ్డులో గల పీవీఆర్ గార్డెన్స్‌లో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి.. కేంద్ర ప్రభుత్వ వైఖరిని, బీజేపీ రాజకీయ వ్యూహాలను ఎండగడుతూ సుదీర్ఘంగా ప్రసంగించారు.

**'ఎస్ఐఆర్' ఒక పెద్ద భూతం.. దొంగదారి చర్య!**

కేంద్ర ప్రభుత్వం చట్టం రూపంలో తీసుకువచ్చిన 'ఎస్ఐఆర్' ఒక పెద్ద భూతం లాంటిదని, ఇది ముమ్మాటికీ దొంగదారి చర్యేనని మంత్రి విమర్శించారు. "కాంగ్రెస్ పార్టీ ఎక్కడైతే బలంగా ఉందో, ఎక్కడైతే మనకు ఓట్లు ఎక్కువగా ఉన్నాయో.. అక్కడ ఒక పద్ధతి ప్రకారం దాదాపు 30 నుంచి 35 శాతం ఓట్లను 'ఫేక్ ఓట్లు'గా చిత్రీకరించి, వాటిని జాబితా నుంచి తొలగించేందుకు కేంద్రం పెద్ద కుట్ర చేస్తోంది. ఓటరు వయస్సులో స్వల్ప తేడాలున్నా, పేర్లలో స్పెల్లింగ్ మిస్టేక్స్ (రావుకు బదులు రెడ్డి, హుస్సేన్ బదులు శ్రీ అని పడటం) ఉన్నా.. వాటన్నింటినీ వంకగా చూపి ఓట్లను లేపేసే ప్రమాదం ఉంది. ఇప్పటికే బీహార్, వెస్ట్ బెంగాల్ లాంటి రాష్ట్రాల్లో ఈ పద్ధతిని ప్రయోగించి సక్సెస్ అయ్యారు. అదే ఫార్ములాను ఇప్పుడు తెలంగాణలోనూ ప్రయోగించాలని చూస్తున్నారు. దీన్ని కాంగ్రెస్ సైనికులు గట్టిగా తిప్పికొట్టాలి" అని మంత్రి పిలుపునిచ్చారు.

**నిన్న ఓట్లు.. నేడు ఏకంగా సీట్లే దొంగిలిస్తున్నారు!**

రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ ఉదంతాన్ని మంత్రి పొంగులేటి ఈ సందర్భంగా ప్రస్తావించారు. "మీనాక్షి నటరాజన్ గారికి కావలసిన ఓట్ల కంటే 11 ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. అయినప్పటికీ కేవలం ఒక పాత ఎఫ్ఐఆర్ కాగితాన్ని సాకుగా చూపి, ఎన్నికల అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చి అక్రమంగా ఆమె నామినేషన్‌న ౧తిరస్కరింపజేశారు. ఈ రకంగా కాంగ్రెస్ పార్టీకి దక్కాల్సిన ఒక రాజ్యసభ స్థానాన్ని వాళ్ళు దొంగిలించారు. నిన్నటి వరకు ఓట్లను దొంగిలించిన వాళ్ళు.. ఈరోజు ఏకంగా సీట్లనే దొంగిలించే దుస్థితికి కేంద్ర ప్రభుత్వం దిగజారింది" అని నిప్పులు చెరిగారు.

**సీబీఐ, ఈడీలతో బెదిరింపు రాజకీయాలు**

బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం దేశంలోని ప్రతిష్టాత్మక దర్యాప్తు సంస్థలను వేట కుక్కల్లా వాడుకుంటోందని మంత్రి తీవ్రంగా ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ చేతుల్లో ఉన్న సీబీఐ , ఈడీ , ఇన్‌కమ్ టాక్స్ సంస్థలను అడ్డం పెట్టుకుని, వేరే పార్టీల తరఫున గెలిచిన ప్రజాప్రతినిధులను భయభ్రాంతులకు గురిచేస్తు న్నారని మండిపడ్డారు. ఆయా రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాలను కూల్చేందుకు కుట్రలు పన్నుతున్నారని, భారతదేశంలో ఎక్కడ బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్నా ఇదే రకమైన దుర్మార్గపు పరిపాలన సాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ప్రతి ఓటూ కాంక్రీట్ గోడ కావాలి.**

జూన్ 25 నుంచి జూలై 24 వరకు నెల రోజుల పాటు బూత్ లెవెల్ అధికారులు నిర్వహించే 'ఓట్ మ్యాపింగ్' ప్రక్రియపై కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించ ారు. "ఉద్యోగాలు, చదువుల రీత్యా ఖమ్మం, హైదరాబాద్‌లలో ఉండే మన వాళ్ళు అధికారులు వచ్చినప్పుడు ఊర్లో లేరనే సాకుతో ఓట్లు తొలగించే ప్రమాదం ఉంది. అధికారులు వచ్చే ముందే గ్రామంలో చాటింపు వేయించి వేరే ఊర్లలో ఉన్న మన ఓటర్లను రప్పించి ఓటు కాపాడుకోవాలి. మనకు దొంగ ఓట్లు అవసరం లేదు.. మనకున్న జనాదరణతో ప్రతి ఓటునూ ఒక కాంక్రీట్ గోడ లాగా కాపాడుకోవాలి" అని స్పష్టం చేశారు. దేశం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కాబోయే ప్రధానమంత్రి, మన నాయకుడు రాహుల్ గాంధీకి కార్యకర్తలంతా సైనికుల్లా అండగా నిలబడాలని, ఈ అక్రమ ఎస్ఐఆర్ కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లి సమర్థవంతంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఏదులాపురం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, 291 బూత్‌ల బి.ఎల్.ఏలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం టి పి సి సి ప్రధాన కార్యదర్శి బండి సుధాకర్ గారు బూత్ లెవెల్ ఏజెంట్లకు అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చినారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంప్ కార్యాలయంలో నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి అధ్యక్షతన ఖమ్మం నియోజకవర్గ బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణా శిబిరం నిర్వహించనైనది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ లు. ఈ కార్యక్రమంలో టి పి సి సి ప్రధాన కార్యదర్శి బండి సుధాకర్ బూత్ లెవెల్ ఏజెంట్ల కు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంత రావు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా సేవాదళ్ అద్యక్షులు సయ్యద్ గౌస్ మాజీ మేయర్ పునుకొల్లు నీరజ, ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల చిన వెంకటేశ్వరరావు,యర్రం బాలగంగాధర్ తిలక్,కోసూరి ప్రసాద్, ఏలూరి శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## 15 న కార్పొరేట్ కళాశాలల కు ఎంపిక కాపాడిన అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువపత్రంల పరిశీలన

**జి జ్యోతి,ఉపసంచాలకులు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఖమ్మం జిల్లా.**

**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :**

2026-27విద్యాసంవత్సరమునకు షెడ్యూల్డు కులాల అభివృద్ధిశాఖ ద్వారా నిర్వహించబడు కార్పోరేట్ కళాశాలల పథకమునకు సంబంధించి ఎంపిక కాబడిన అనగా సిజిజి-ఈపాస్ నుండి సంక్షిప్త సందేశము(మెస్సేజ్) వచ్చిన యస్.సి. యస్.టి. బి.సి. ఇ.బి.సి. మైనారిటీ మరియు డిజేబుల్డ్ విద్యార్థినీ విద్యార్థులకు ఒరిజినల్ ధృవపత్రములు పరిశీలించి నియామక పత్రము మంజూరు చేయబడును. కావున ఎంపిక కాబడిన విద్యార్థినీ విద్యార్థులు అన్ని ఒరిజినల్ ధృవపత్రములు మరియు జిరాక్స్ కాపీలతో ఉపసంచాలకులు, షెడ్యూల్డు కులముల అభివృద్ధిశాఖ, ఐ.డి.ఒ.సి. (యస్-34), న్యూ కలెక్టరేట్, ఖమ్మం వారి కార్యాలయం నందు ది. 15-06-2026 ఉదయం 11 గంటలకు హాజరు కావలసినదిగా కోరనైనది.

## ఇర్షాద్ ఖాన్ వినతిపై కదిలిన అధికారులు

**- బీరప్పగడ్డ రహదారి సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన**

**ఉప్పల్, జూన్ 12 (మీడియా టుడే ప్రతినిధి):**



బీరప్పగడ్డ డివిజన్ పరిధిలోని పిస్తా హౌస్ నుంచి ఉప్పల్ మండే మార్కెట్ వరకు రహదారి సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. స్థానిక సమస్యలను ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) ఉప్పల్ జోన్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా దృష్టికి తీసుకెళ్లారు .రహదారిపై గుంతలు, దెబ్బతిన్న మ్యాన్‌హోల్స్, ట్రాఫిక్ ఇబ్బందులు, పాఠశాల విద్యార్థుల భద్రత అంశాలపై వినతిపత్రం అందజేయగా, జోనల్ కమిషనర్ స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అనంతరం బీరప్పగడ్డ డివిజన్ అసిస్టెంట్ ఇంజినీర్ రాజ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్‌లు ఇర్షాద్ ఖాన్‌తో కలిసి ప్రాంతాన్ని పరిశీలించారు. రహదారి పరిస్థితులను పరిశీలించిన అధికారులు గుంతల పూడ్చివేత, మ్యాన్‌హోల్ మరమ్మతులు, అవసరమైన ప్రాంతాల్లో రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు వంటి చర్యలు చేపడతామని తెలిపారు.ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఇర్షాద్ ఖాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మొహ్సిన్, ఆసిఫ్, పవన్, కిట్టు, దత్తు తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ షాక్ తో వ్యక్తి మృతి

**ముధోల్ జూన్ 12 మీడియా టుడే జిల్లా ప్రతినిధి**



మండలం కేంద్రంలోని కోలి గల్లి కి చెందిన ముడుగుల సాయినాథ్ కరెంట్ షాక్ తో శుక్రవారం మృతి చెందరు.ఎస్సై బిట్ల పెర్సిస్ వివరాలు ప్రకారం: ముడుగుల సాయినాథ్ తో పాటు రుమోల్లొల్ల భూమేష్ ఇద్దరు కలసి మండలం కేంద్రంలో సాయి మాధవ్ నగర్ కు చెందిన ప్రేమల లక్ష్మణ్ ఇంట్లో కరెంట్ పనులు చేస్తుండగా అనుకోకుండా ముడుగుల సాయినాథ్ కు కరెంట్ షాక్ తగలడంతో వెంటనే స్థానికులు ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు,అనంతరం వైద్యులు పరీక్షించగా అప్పుడే మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు.మృతుడు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రెస్ నోట్ లో ప్రకటించారు.

## నగర అభివృద్ధికి మరింత సేవ చేయాలి

**-ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**




**మహబూబ్‌నగర్. జూన్12(మీడియా టుడే):-**

మహబూబ్ నగర్ నగరపాలక సంస్థ మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్ జన్మదినోత్సవం సందర్భంగా ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి. ఆమెకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాసేవలో మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్ అంకితభావంతో పనిచేస్తూ నగర అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా ఆమె ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రామకృష్ణ తదితరులు పాల్గొని మేయర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## గుండెపోటుతో పురోహితుడు మృతి

**తొర్రూరు,జూన్ 12 (మీడియా టుడే)**



మండలంలోని అమ్మాపురం గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన పురోహితుడు మామిళ్ళపల్లి దేవేంద్ర చారి శుక్రవారం పూజా కార్యక్రమాలు ముగించుకొని మధ్యాహ్నం ఇంటికి వచ్చిన క్రమంలో అకస్మాత్తుగా గుండెపోటు బారిన పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య శిరీష, ముగ్గురు కూతుర్లు మౌనిక, మనిషా, చంద్రలేఖ ఉన్నారు. మృతుడి అకాల మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# మాపై దాడి చేసిన వారిని శిక్షించి న్యాయం చేయాలి

**-మీడియా సమావేశంలో బాధితుల వేడుకోలు**




**మీడియా టుడే ఖమ్మంప్రతినిధి :**

మా ఇంటికి వచ్చి గొడవ చేసి మాపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని, తమ ఫిర్యాదును పట్టించుకోని పోలీసులపై చర్యలు తీసు కోవాలని బాధితులు రాము పెరుమాళ్, రాము సుధ వేడుకొన్నారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తమిళనాడు నుండి వచ్చిన వచ్చిన తాము పాకబండబజార్‌లో ఉంటూ తినుబండారాలు తయారు చేసి అమ్ముకుంటూ జీవనం సాగస్తున్నామని తెలిపారు. చుట్టుపక్కల వారికి ఇబ్బందులు కలుగకుండా పొగ గొట్టాన్ని సుమారు 40 అడుగుల పైనే ఉంచి చిమ్నీతో తినుబండారాలు తయారు చేసుకుంటున్నామని తెలిపారు. పొగ గొట్టం వల్ల పొగ వస్తుందంటూ పక్కనే ఉన్న ఇంటికి సంబంధించిన వ్యక్తితో పాటు కొంతమంది తమ ఇంట్లోకి జొరబడి అకారణంగా దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళ అని చూడకుంటా కొట్టారని తెలిపారు. వారు దాడి చేసిన దృశ్యాలు సిసి కెమెరా పుట్టేజిలో ఉన్నాయన్నారు. దాడి సంఘటనపై వన్‌టౌన్ సిఐకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. అకారణంగా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు దాడి చేసి తమ వ్యాపారాలపై జరిమానాలు విధిస్తున్నారని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించకపోయినా జరిమానాలు విధించడమేంటని ప్రశ్నించారు. తమను భయభ్రాంతులకు గురి చేస్తున్న వ్యక్తిపై, తమ ఫిర్యాదును పట్టించుకోని పోలీసులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

# కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

**బాధితులకు అండగా నిలవాలని ఎస్పీ పరితోష్ పంకజ్**

**ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులకు రివార్డులు**

**సంగారెడ్డి జిల్లా , మీడియా టుడే బ్యూరో /జూన్12.**

జిల్లాలో నమోదవుతున్న ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకాజ్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్, మిస్సింగ్, ఎన్‌బీడబ్ల్యూ కేసుల పురోగతిని సమీక్షించిన ఎస్పీ, లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు.పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదిదారులతో మర్యాదగా వ్యవహరిస్తూ వారికి భరోసా కల్పించాలని ఆదేశించారు.ప్రతి గ్రామానికి విలేజ్ పోలీసు అధికారిని నియమించి, రౌడీషీటర్లు, కేడీలు, అనుమానితుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాల ద్వారా ప్రజలతో మరింత అనుసంధానం పెంచాలని, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని అధికారులకు సూచించారు. నేరాల నియంత్రణ, ఛేదనలో సీసీ కెమెరాల ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించి గ్రామాలు, ప్రార్థనా స్థలాలు, పరిశ్రమలు, పెట్రోల్ బంకులు తదితర ప్రాంతాల్లో కమ్యూనిటీ సీసీ కెమెరాల ఏర్పాటు కోసం చర్యలు తీసుకోవాలని ఎస్‌హెచ్‌వోలకు ఆదేశించారు.




అనంతరం వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి కాష్ రివార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. పోలీసు వాహనాల నిర్వహణను కూడా సమీక్షించిన ఎస్పీ, అత్యవసర పరిస్థితులకు అవసరమైన కిట్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. వాహ నాలను పరిశుభ్రంగా నిర్వహించిన డ్రైవర్లకు ప్రత్యేక రివార్డులు ప్రకటించారు.సమావేశంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు తదితర అధికారులు పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలిద్దాం

**-జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి రాజేందర్.**

**- బాలల శ్రమదోపిడీని అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి.**




**మణుగూరు,జూన్ 12( మీడియా టుడే):**

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సహకరించాలని జిల్లా న్యాయ సేవా సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి రాజేందర్ పిలుపు నిచ్చారు. యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో శ్రీవిద్య టెక్నో జూనియర్ కళాశాలలో నిర్వహించిన ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.మన దేశంలో బాల కార్మిక వ్యవస్థ ఇప్పటికీ కీలక సామాజిక, ఆర్థిక సవాలుగా కొనసాగుతోందని, ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఇతర రాష్ట్రాల నుంచి బాల కార్మికులు వస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.14 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టడం చట్టవిరుద్ధమని, అలాంటి ఘటనలు కనిపిస్తే వెంటనే చైల్డ్‌లైన్-1098కు సమాచారం అందించాలని సూచించారు.బాల కార్మిక వ్యవస్థ పిల్లల బాల్యాన్ని, విద్యను దూరం చేస్తూ వారి భవిష్యత్తును దెబ్బతీస్తోందన్నారు.

**1098, డయల్-100కు సమాచారం ఇవ్వాలి : సీఐ నాగబాబు.**

సీఐ నాగబాబు మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలంటే కఠిన చట్టాలతో పాటు పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం, సామాజిక భద్రతా పథకాలు బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. బాల కార్మికులను గుర్తిస్తే వెంటనే చైల్డ్‌లైన్ 1098 లేదా డయల్-100కు సమాచారం ఇవ్వాలని కోరారు.అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ నాగరాజు మాట్లాడుతూ,ఎక్కడైనా బాల కార్మికులు పనిచేస్తున్నట్లు సమాచారం అందితే ప్రత్యక్షంగా విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాలలను పనిలో పెట్టుకున్న వారిపై రూ.20 వేల నుంచి లక్ష రూపాయల వరకు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాల ద్వారా బాల కార్మికులను గుర్తించి వారిని విద్యా ప్రవాహంలోకి తీసుకువస్తున్నామని వివరించారు.ఏరియా ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ గౌరీ ప్రసాద్ మాట్లాడుతూ చిన్న వయస్సులో పనులు చేయించడం వల్ల పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల దెబ్బతింటుందని, అధిక శ్రమ వల్ల అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందన్నారు.ఏఐడీ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ వి. రాజేష్ మాట్లాడుతూ జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ భాగస్వామ్యంతో గత మూడు సంవత్సరాలుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు తమ సంస్థ కృషి చేస్తోందని తెలిపారు. సంబంధిత శాఖల సహకారంతో జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎల్‌వో రజిత, మెప్మా టీఎంసీ సుశీల, ఆర్పీ ఇందిరా, ఐసీడీఎస్ సూపర్వైజర్లు హైమావతి, భద్రమ్మ, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు శ్రీను, అంగన్‌వాడీ టీచర్లు, మెప్మా యూనిట్ సభ్యులు, డీఎల్ఎస్ఏ ప్రతినిధి కోటేష్, ఏఐడీ సంస్థ ప్రతినిధులు మోహన్ జ్యోతి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల కోసం పనిచేసే జర్నలిస్టులకు అండగా

**-ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



**మహబూబ్‌నగర్. జూన్12(మీడియా టుడే):-**

-పాలమూరు జర్నలిస్టుల సంక్షేమ సంఘానికి రూ.1 లక్ష చెక్కు అందజేసిన ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, నిత్యం 24/7 ప్రజాసేవలో నిమగ్నమై ఉండే జర్నలిస్టుల సంక్షేమానికి దాతలు ముందుకు రావాలని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి. పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలమూరు జర్నలిస్టుల సంక్షేమ సంఘం నిధికి ఆయన రూ.1 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన పాలమూరు జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఇప్పటికే పలువురు జర్నలిస్టులకు ఆర్థిక భరోసా కల్పించిందని తెలిపారు. ప్రజలకు సమాచారం అందించే క్రమంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే జర్నలిస్టులకు, పేద జర్నలిస్టులకు అవసరమైన సమయంలో అండగా నిలవడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాలమూరు జర్నలిస్టు సంక్షేమ సంఘం అధ్యక్షులు వాకిట అశోక్ కుమార్, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి. ధన్యవాదాలు తెలుపుతూ, ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ శాసనసభ్యుల జీతంలో 50 శాతం కోత విధించినప్పటికీ జర్నలిస్టుల సంక్షేమం కోసం తాను ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ పాలమూరు జర్నలిస్టుల సంక్షేమ సంఘానికి ప్రతి నెలా రూ.1 లక్షల చెక్కును అందజేస్తున్నారని అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి నెలా జర్నలిస్టుల సంక్షేమ నిధికి సహకారం అందించడం అభినందనీయమని పలువురు జర్నలిస్టులు పేర్కొన్నారు. ప్రభుత్వ విప్ వేసిన మొదటి అడుగు ద్వారానే నేడు అనేక మంది జర్నలిస్టు సోదరులు ఆర్థిక సహాయం పొందుతున్నారని కొనియాడారు. తెలంగాణ ఉద్యమం నాటి నుంచే జర్నలిస్టుల పరిస్థితులను దగ్గరగా గమనించిన ఆయన జర్నలిస్టుల సంక్షేమం కోసం మంచి ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాలమూరు జర్నలిస్టు సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు పల్లెమోని యాదయ్య, కోశాధికారి, రఘు, ముఖ్య సలహాదారు పరిపూర్ణం, సతీష్ కుమార్, కేశవులు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## టీఎన్జీవో అధ్యక్షుడిని మర్యాదపూర్వకంగా కలిసిన ఆయుష్ ఉద్యోగులు



**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :** ఇటీవల జరిగిన బదిలీల్లో ఖమ్మం ఆయుష్ ప్రధాన ఆసుపత్రి ఫార్మాసిస్టుగా విధుల్లో చేరిన జి వీరయ్య టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాస్ అన్నను మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు. అనంతరం కేక్ తినిపించి అభినందించారు. యూనియన్ కార్యక్రమాల్లో తమకు ప్రతినిధ్యం కలిపించాలని కోరారు. యూనియన్ చేపట్టే కార్యక్రమాల్లో పాల్గొంటూ బలోపేతం చేసేందుకు కృషిచేస్తానని అన్నారు. ఈ సందర్భంగా గుంటుపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో ఆయుష్ శాఖా నుండి టీఎన్జీవో సంఘానికి బలమైన నాయకత్వం ఉండేదని దాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. యూనియన్ చేపట్టే ప్రతీ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులు ఎదుర్కొన్న సమస్యలు పరిష్కారానికి యూనియన్ ఎల్లవేళలా కృషి చేస్తూ అండగా ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగానే కేంద్ర సంఘం ఆర్గనైజింగ్ సెక్రెటరీ జెడ్ ఎస్ జైపాల్ ను కూడా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ శాఖ రాష్ట్ర మాజీ అధ్యక్షులు సగుర్తి ప్రకాష్ రావు, హోమియో శాఖ ఫార్మసిస్టు జయశ్రీ ఆయుర్వేద ఫార్మసిస్ట్ ఎల్ వజ్రమ్మ, యునాని ఫార్మసిస్ట్ పి సూర్య కళ, క్రాంతి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత బాలికకు మెరుగైన వైద్యం అందించాలి

### మహబూబాబాద్ జిల్లా రజక వృతిదారుల సంఘం కార్యదర్శి పున్నం సారయ్య.



**తొర్రూరు, జూన్ 12(మీడియా టుడే)**

హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత బాలిక కుటుంబాన్ని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం నాయకులు పరామర్శించి తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా రజక వృతిదారుల సంఘం కార్యదర్శి పున్నం సారయ్య మాట్లాడుతూ...బాలికకు అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనకు బాధ్యుడైన నిందితుడిని వెంటనే రిమాండ్‌కు పంపించి, పోక్సో చట్టంతో పాటు హత్యాయత్నం/హత్య కేసులు నమోదు చేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠిన శిక్ష విధించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత బాలిక భవిష్యత్ వైద్యం, పునరావాసం కోసం ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించడంతో పాటు కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రజాసంఘాలు, సామాజిక సంస్థలు తమ మద్దతును కొనసాగిస్తాయని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తగిన సహాయ సహకారాలు అందించకపోతే భవిష్యత్తులో మరింత పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.

## తొర్రూర్ డిపోమేనేజర్ గాకే.ప్రసూన లక్ష్మీ బాధ్యతలు స్వీకరణ..

**తొర్రూర్,జూన్ 12 (మీడియా టుడే)**



సాధారణ బదిలీల్లో భాగంగా నర్సంపేట డిపోలో విధులు నిర్వహించిన కె ప్రసూనలక్ష్మి తొర్రూరు డిపో మేనేజర్ గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డిపో మేనేజర్ గారి కార్యాలయంలో ఎం ఎఫ్ విజయ్ కుమార్, ఎస్ టి ఐ రజిత రెడ్డి, కార్యాలయం సిబ్బంది పుష్పగుచ్చం ఇచ్చి శాలువ కప్పి స్వాగతం పలికారు. అనంతరం డిఎం ప్రసన్న లక్ష్మీ మాట్లాడుతూ..ప్రయాణికులకు సురక్షితమైన సమయపాలనతో కూడిన రవాణా సౌకర్యం కల్పించడమే కాకుండా ఉద్యోగులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకుంటూ అందరిని సమన్వయం తో కలుపుకొని డిపోను ముందంజలో ఉంచడానికి కృషి చేస్తానన్నారు.

## ప్లాస్టిక్ వాడకం ఆపివేయాలి




**రాయికల్-మీడియా టుడే-జూన్ 12:**

గ్రామ పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వాడకం మానేయాలని సర్పంచ్ నీరటి శ్రీనివాస్ సూచించారు. రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో శుక్రవారం జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ గ్రామంలోని కిరాణం, చికెన్ షాపులతో పాటు అన్ని వ్యాపార సంస్థల్లో ప్లాస్టిక్ కవర్లు వినియోగించరాదని ప్రకటించారు. నేటి నుంచి 15రోజుల వరకు గడువు ఇచ్చారు. ఎవరైనా ప్లాస్టిక్ కవర్లు అమ్మినా, వినియోగించినా రూ. 5,000 జరిమానా విధించబడుతుందని ఆయన తెలిపారు. పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని..గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాజేష్, గ్రామ సేవా సమితి అధ్యక్షులు అనుపురం చిన్న లింబాద్రి గౌడ్, కారోబార్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పూర్తి స్థాయి ఏర్పాట్లు

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి తేళ్ల విజయ్ / మీడియా టుడే,జూన్ 12, 2026:** ఈ నెల 13వ తేదీన జిల్లాలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటన నేపథ్యంలో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని గూడెం శ్రీసత్యనారాయణ స్వామి ఆలయాన్ని డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గిరిజన సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ కొట్నాక తిరుపతి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, దండేపల్లి మండల తహసిల్దార్ రోహిత్ దేశ్ పాండే, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్, లక్షెట్టిపేట మున్సిపల్ కమిషనర్ విజయ్, ఆలయ ఈ.ఓ. శ్రీనివాస్ లతో కలిసి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఈ నెల 13వ తేదీన ఉదయం జిల్లాలోని దండేపల్లి మండలం శ్రీ గూడెం సత్యనారాయణ స్వామి ఆలయం పునర్నిర్మాణం, మినీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్ లో సింగరేణిలో వైద్య పరంగా విధులు నిర్వహించలేని ఉద్యోగుల కుటుంబ సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తారని, సాయంత్రం శ్రీరాంపూర్ ఏరియాలో ఓపెన్ కాస్ట్ గనులను పరిశీలిస్తారని, అనంతరం మంచిర్యాల పట్టణంలో శ్రీ విశ్వనాథ ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ చేస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని వేంపల్లి ప్రాంతంలో గల పద్మావతి ఫంక్షన్ హాల్ లో ఏర్పాట్లను డి.సి.పి., మంచిర్యాల శాసనసభ్యులు, ఎ.సి.పి. ప్రకాష్ లతో కలిసి పరిశీలించారు. తదనంతరం మంచిర్యాల పట్టణంలోని కాలేజ్ రోడ్డులో గల పద్మనాయక ఫంక్షన్ హాల్ ను సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ తో కలిసి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## నిరంతర కర్షకునికి రైతు అభ్యుదయ పురస్కారం

### రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడు కోదండ రెడ్డి చేతుల మీదుగా రైతు అభ్యుదయ పురస్కారం అందుకున్న సుధాకర్ రెడ్డి

**మర్కుక్ జూన్ 12 మీడియా టుడే**

మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామ రైతు రుక్మన్న గారి సుధాకర్ రెడ్డి వ్యవసాయ రంగంలో వరి సాగు వెదజల్లే పద్ధతిలో అధిక దిగుబడి పండించి చాలామంది రైతులకు ఆదర్శంగా నిలిచారు . ఈ విధానం వల్ల రైతులకు వ్యవసాయ ఖర్చులు తగ్గి రైతుకు మేలు జరుగుతుంది అని అన్నారు. వెదజల్లే విధానంలోకృషి చేసినందుకుగాను ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు గుర్తించి విశ్వవిద్యాలయం 62వ వ్యవస్థాపక దినోత్సవం లో రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడు కోదండ రెడ్డి చేతుల మీదుగా రైతు అభ్యుదయ పురస్కారాన్ని అందజేయడం జరిగింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరియు రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షులు కోదండ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ పురస్కారం నాకు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. అంతే కాకుండా ప్రతి రైతు ఈ సాగును అవలంబించి అధిక దిగుబడిని పొందాలని సూచించారు నాకు



సాధ్యమైనంత వరకు తోటి రైతులకు సహాయం చేయడంలోనే చాలా తృప్తి ఉందన్నారు. ఈ అవార్డు నాకు రావడానికి కారణమైన ప్రతి ఒక్కరికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాను అన్నారు. సుధాకర్ రెడ్డి కి అవార్డు రావడం పట్ల గ్రామ ప్రజలు మరియు తోటి రైతులు చాలా ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## సారంగపల్లి అడవిలో గుర్తుతెలియని వ్యక్తి అస్థిపంజరం లభ్యం

### పోలీసుల దర్యాప్తు



**మందమర్రి / మీడియా టుడే,12 జూన్, 2026:**

మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని సారంగపల్లి అటవీ ప్రాంతంలో ఒక గుర్తుతెలియని పురుషుడి అస్థిప ంజరం లభ్యమవ్వడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు.మృతదేహం పక్కన లేత నీలం రంగు ప్యాంటు, బెల్టు ఉన్నాయని, అడవి జంతువులు మృతదేహాన్ని తినివేసి ఉంటాయని భావిస్తున్నారు.సర్పంచ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి పుప్పాల సవ్య, సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, కేవలం తల భాగం, చేతులు, కాళ్ళ ఎముకలు మాత్రమే మిగిలి ఉన్నాయని నిర్ధారించారు.సారంగపల్లి అడవిలో గుర్తుతెలియని వ్యక్తి అస్థిపంజరం లభ్యం: పోలీసుల దర్యాప్తు మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని సారంగపల్లి అటవీ ప్రాంతంలో ఒక గుర్తుతెలియని పురుషుడి అస్థిపంజరం లభ్యమవ్వడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు.మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని సారంగపల్లి అటవీ ప్రాంతంలో ఒక గుర్తుతెలియని పురుషుడి అస్థిపంజరం లభ్యమవ్వడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు .సారంగపల్లి గ్రామానికి చెందిన మేకల కాపరి కేశవగేని బాలయ్య శుక్రవారం ఉదయం తన మేకలను మేపడానికి అడవిలోకి వెళ్ళినప్పుడు, పూర్తిగా కుళ్ళిపోయి, అస్థిపంజరంగా మారిన ఒక మృతదేహాన్ని గమనించాడు. మృతదేహం పక్కన లేత నీలం రంగు ప్యాంటు, బెల్టు ఉన్నాయని, అడవి జంతువులు మృతదేహాన్ని తినివేసి ఉంటాయని భావిస్తున్నారు.బాలయ్య వెంటనే ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ బచ్చలి రాములుకు తెలియజేశాడు. సర్పంచ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి పుప్పాల సవ్య, సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, కేవలం తల భాగం, చేతులు, కాళ్ళ ఎముకలు మాత్రమే మిగిలి ఉన్నాయని నిర్ధారించారు.పంచాయతీ కార్యదర్శి పుప్పాల సవ్య మందమర్రి పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో, పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడు ఎవరు, ఎక్కడి నుండి వచ్చాడు, మృతికి గల కారణాలు ఏమిటి అనే కోణంలో దర్యాప్తు జరుగుతోంది.ఘటనా స్థలానికి క్లూస్ టీమ్, ఉన్నతాధికారులు చేరుకుని, వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరిస్తున్నారు. అడవిలో మృతదేహం లభ్యమవ్వడం, దాని స్థితిగతులపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ నాయకత్వంలో పోలీస్ కమిషనర్‌ను కలిసిన జిల్లా పార్టీ బృందం

### మైనర్ బాలికపై దారుణానికి ఒడిగట్టిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :**

ఖమ్మం నగరంలో 12 ఏళ్ల మైనర్ బాలికపై జరిగిన అమానుష, ఘోరమైన ఘటనను భారత రాష్ట్ర సమితి ఖమ్మం జిల్లా పార్టీ తీవ్రంగా ఖండించింది. ఈ విషయమై బీఆర్ఎస్ ఏమ్మెల్సీ మరియు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతా మధుసూదన్ నాయకత్వంలో పార్టీ ప్రతినిధుల బృందం శుక్రవారం ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించింది. సభ్య సమాజాన్ని తీవ్రంగా కలచివేసిన ఈ ఘటనలో బాధిత బాలికకు తక్షణమే న్యాయం చేయాలని, నిందితుడిపై పోక్సో (పోక్సో ) చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ బృందం డిమాండ్ చేసింది.రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాల పట్ల ఈ సందర్భంగా వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.నిందితుడిపై పోక్సో చట్టంతో పాటు ఇతర సంబంధిత చట్టాల కింద అత్యంత కఠినమైన చర్యలు తీసుకోవాలని, బాధితురాలికి త్వరితగతిన న్యాయం జరిగేలా కేసును ఫాస్ట్-ట్రాక్ కోర్టు ద్వారా విచారించాలని, బాధిత బాలికకు ప్రభుత్వం తరపున అవసరమైన వైద్య, ఆర్థిక, మరియు కుటుంబంలో ఒకరికి ఉద్యోగ భద్రత తక్షణమే కల్పించాలని, భవిష్యత్తులో జిల్లాలో ఇలాంటి దారుణమైన ఘటనలు పునరావృతం కాకుండా మహిళలు, బాలికల రక్షణ కోసం గట్టి నిఘా, పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, పాఠశాలలు, హాస్టళ్లు, అపార్ట్‌మెంట్‌లు మరియు ఇతర ప్రాంతాలలో బాలికల మరియు మహిళల భద్రతకు సంబంధించి ప్రత్యేక నిఘా ఉంచాలని, పోక్సో చట్టంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి,



బాలల రక్షణకు కట్టుదిట్టమైన చర్యలు అమలు చేయాలని కోరారు.నేరస్థులు ఏ స్థాయిలో ఉన్నా వదలకుండా, చట్ట ప్రకారం కఠినంగా శిక్షించడం ద్వారానే సమాజంలో నేరగాళ్లకు గట్టి హెచ్చరిక పంపినట్లవుతుందని బీఆర్ఎస్ బృందం స్పష్టం చేసింది.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తో పాటు మాజీ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, ఉన్నం బ్రహ్మయ్య, భాషబోయిన వీరన్న, నాయకులు రెంటాల ఆనంద్, దర్గయ్య, బలుసు మురళీకృష్ణ, లింగనబోయిన సతీష్, మహమ్మద్ రఫీ, పగడాల నరేందర్, యలమద్ది రవి, గవర్రాజు శంకర్ రాజు, పటేటి సాయి, పోలూరి రామ్, మరియు ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడులను బతికిద్దాం

## సర్పంచ్ దున్నా శ్రీనివాస్




**నడిగూడెం, జూన్ 12(మీడియా టుడే):**

ప్రభుత్వ బడులలో విద్యార్థులను చేర్పించి ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు ప్రజలందరూ సహకరించాలని నడిగూడెం గ్రామ సర్పంచ్ దున్నా శ్రీనివాస్ కోరారు. శుక్రవారం నడిగూడెం మండల కేంద్రంలో శ్రీ కొల్లు పాపయ్య చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాల ఉపాధ్యాయులు నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యకు సంబంధించిన అన్ని మౌలిక వసతులు కల్పిస్తూ డిజిటల్ విద్య అమలు చేస్తూ విద్యా బోదనపై ప్రత్యేక శ్రద్ధ వస్తుందని తెలిపారు.విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి లు నియోజకవర్గంలోని పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కత్తి వెంకటేశ్వర్లు,కె.అహల్యదేవి, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటడం అందరి బాధ్యత

**రాయికల్-మీడియా టుడే-జూన్ 12:**



మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి భాద్యత అని మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్ అన్నారు. రాయికల్ పట్టణంలోని 6వార్డులో పెద్ద చెరువు వద్ద పురపాలక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్ వేముల మౌనిక రాము, కో ఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేత

### ఆర్థిక సహాయం అందజేసిన గ్రామ సర్పంచ్ మాజీ సర్పంచ్ ఇతర నాయకులు



**మీడియా టుడే యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ జున్ : 12**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని పులిగిల్ల గ్రామంలో గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ వేముల ఎల్లమ్మ చనిపోయారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ గ్రామ సర్పంచ్ వేముల అనూష మల్లేష్ 2,000/- మాజీ సర్పంచ్ జక్క వెంకట్ రెడ్డి 4,000/- కోమటి రెడ్డి ఇంద్రారెడ్డి 4,000/- , వేముల సుధాకర్ 5,000/- , కంచి బిందు రాములు 50కేజీల బియ్యం, కోమటిరెడ్డి మహేశ్వర్ రెడ్డి 2,000/-, కొంతం తిరుమల రెడ్డి 1,000/- రూపాయల ను గ్రామ సర్పంచ్ చేతుల మీదుగా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వేముల అనిత ఆనంద్, వేముల పుష్ప నరసింహ, పల్లెర్ల హరీష్ , తిరుమల రెడ్డి, బుగ్గ మల్లయ్య, వేముల అశోక్ దావీదు, రాములు నరేష్, ప్రశాంత్ పల్లెర్ల స్వామి, కిషన్ , మహేష్, మల్లేష్, బొడ్డు అనిల్, దొడ్డి స్వామి,మంద విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ ఫలితాల్లో శ్రీ అరోరా జయకేతనం

### రాష్ట్ర స్థాయి ర్యాంక్ లు సాధించిన విద్యార్థులు

**మిర్యాలగూడ, జూన్ 12 (మీడియా టుడే):**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వెల్లడించిన ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం ఇంప్రూమెంట్ ఫలితాల్లో పట్టణంలోని శ్రీ అరోరా జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించినట్లు శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ పోరెడ్డి దుర్గారెడ్డి, యాజమాన్యం తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో పి.భవాని (465/470), హేర్మ బిందు (452/470), సీఈసీ విభాగంలో ఎస్.కె.సుమయా రూహి (457/500), ఐ.శివసాయి (443/500), బైపిసి మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎస్.కె.సమ్రిన్ (410/440), కె.శ్రావ్య (396/440), వీరితోపాటు ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 400 మార్కులకు పైగా 27 మంది విద్యార్థులకు, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 900 మార్కులు పైగా 25 మంది విద్యార్థులకు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, యాజమాన్యం, అధ్యాపక బృందం విద్యార్థి, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

# జలగం వెంగళరావు సేవలు చిరస్మరణీయం

## -కవ్వంపల్లి




**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ : మీడియా టుడే , జూన్ 12 :**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా దివంగత జలగం వెంగళరావు అందించిన సేవలు చిరస్మరణీయమైనవని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారంహైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో జలగం వెంగళరావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, జలగం వెంగళరావు రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, ప్రజాసేవా దృక్పథం నేటి తరానికి ఆదర్శప్రాయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన కుటుంబాల ఇంటి పన్ను కట్టిన సర్పంచ్

### -గొప్ప నిర్ణయానికి హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు




**మీడియా టుడే యాదాద్రి భువనగిరి జూన్ 12;**

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండల పరిధిలోని తాజ్ పూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన కుటుంబాల ఇంటి పన్ను మినహాయింపు పథకం వర్తింపు , మరియు ప్రభుత్వ పథకాలకు మొదటి ప్రాధాన్యత అందేలా చేస్తామని తీర్మానం చేశామని ఆ గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూదాదాపు15 లక్షల రూపాయల స్వంత నిధులతో పాఠశాల పునరుద్దరణ చేశామని రాష్ట్ర స్థాయిలో ఆదర్శంగా నిలిచిన తాజ్ పూర్ సర్పంచ్ స్వయంగా వాళ్ళ ఇంటి పన్ను గ్రామ పంచాయతీకి ప్రతి సంవత్సరం చెల్లిస్తానని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు.శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమం పాలకవర్గ సభ్యులతో కలిసి గడప గడపకు తిరిగి వారి స్వంత ఖర్చులతో గ్రామ ప్రభుత్వ బడిని ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా పునరుద్దరించిన సందర్భంగా నాణ్యమైన విద్యకై ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరడం జరిగిందని తెలిపారు.ఒక వినూత్న ఆలోచనతో గ్రామ ప్రజలకు ఎక్కడా లేనివిదంగా ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి పాఠశాలలో చేర్పించిన వారికి ఇంటిపన్ను రద్దు చేస్తానని అట్టి డబ్బులను గ్రామ పంచాయతీ తాను స్వంతంగా చెల్లిస్తానని హామీ ఇవ్వడం జరిగిందని అదే విదంగా ప్రభుత్వ పథకాలు కూడా మన ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన కుటుంబాలు మాత్రమే అర్హులుగా ప్రకటిస్తామని ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పాలకవర్గం తీర్మానించడం జరిగిందని అన్నారు.అన్ని సౌకర్యాలతో, నాణ్యమైన అధ్యాపక బృందంతో చక్కని విద్య అదే విధంగా ప్రభుత్వ పథకాల అమలుకై ప్రభుత్వ పాఠశాల బలోపేతం చేయాలని వారు కోరడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సామాజిక వేత్త డా ర్యాకల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి,ఉపసర్పంచ్,వార్డు సభ్యులు ,ప్రధాన పాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, అంగన్వాడీ,ఆశ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల స్వయం ఉపాధికి అండగా ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం

# ప్రారంభించిన డా. కొత్తపల్లి శ్రీనివాస్ - డా. కొత్తపల్లి అనిత

**కాగజ్ నగర్ జూన్12 (మీడియా టుడే)**

కొమురం భీం జిల్లా, కాగజ్ నగర్ పట్టణంలోని పెట్రోల్ పంప్ ఏరియా లో మహిళల ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధే లక్ష్యంగా కొత్తపల్లి వెంకటలక్ష్మి - చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటి ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని డా. కొత్తపల్లి శ్రీనివాస్ - డా. కొత్తపల్లి అనిత ( మున్సిపల్ వైస్ చైర్పర్సన్) ప్రారంభించారుఅనంతరం వారు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలని తమ కాళ్ళ మీద తాము నిలబడేలా ఉపాధి అవకాశాలు కల్పించాలనే సత్సంకల్పంతోనే ఈ ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించామని ప్రతి బ్యాచ్ కు 2నెలల పాటు శిక్షణ కొనసాగుతుందని శిక్షణ పూర్తయిన అనంతరం సర్టిఫికెట్ అందజేయ పడుతుందని స్థానిక మహిళలు యువతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సమాజంలో ఉన్నత స్థానంలో నిలవాలని కోరారు . సమాజ సేవలో నిరంతరం ముందు ఒటూ సొసైటీ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నారు.సొసైటీ లక్ష్యాలు అందుబా టులో వైద్యసేవలు, ?విద్యా అభివృద్ధికి తోడ్పాటు,ఉపాధి కల్పన , ?పర్యావరణ పరిరక్షణ , ?ఆధ్యాత్మిక చింతన, ధర్మ రక్షణ పై రంగాలలో ప్రజలకు సేవలందిస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో శిక్షణ పొందే మహిళలు , మిత్రులు పాల్గొన్నారు



# జూన్ 20న జాతీయ లోక్ అదాలత్

### రామన్నపేట జూరిస్డిక్షన్ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**మీడియా టూడే యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ జూన్ : 12**

భారత జాతీయ న్యాయ సేవా సంస్థ (ఎన్ఎఎల్ఎస్ఏ) మరియు తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా సంస్థ (టిఏస్ఎల్ఎస్ఏ) ఆదేశాల మేరకు, 2026 జూన్ 20వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, రామన్నపేట ఆధ్వర్యంలో రామన్నపేట జూరిస్డిక్షన్ పరిధిలో నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి - కమ్ - చైర్మన్, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, రామన్నపేట జి. సబిత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రామన్నపేట జూరిస్డిక్షన్ పరిధిలోని న్యాయస్థానాలలో పెండింగ్‌లో ఉన్న రాజీకి అనుకూలమైన సివిల్ కేసులు, మోటార్ ప్రమాద పరిహార దావాలు, బ్యాంకు రికవరీ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ వివాదాలు, కార్మిక వివాదాలు, విద్యుత్ సంబంధిత వివాదాలు, అలాగే ఇతర ప్రీ - లిటిగేషన్ మరియు పెండింగ్ కేసులను జాతీయ లోక్ అదాలత్ ద్వారా పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ విజయవంతం కోసం ఎస్. శిరీష, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి, రామన్నపేట, వి. రత్న కుమారి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి, రామన్నపేట, డి. సత్తయ్య , ద్వితీయ శ్రేణి న్యాయ మేజిస్ట్రేట్, రామన్నపేట తమ తమ న్యాయస్థానాల పరిధిలో రాజీకి అనుకూలమైన కేసులను గుర్తించి లోక్ అదాలత్‌లో పరిష్కారం కోసం చర్యలు చేపడుతున్నారని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారానికి ఎటువంటి కోర్టు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని, ఇప్పటికే చెల్లించిన కోర్టు ఫీజు తిరిగి పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో కుదిరిన రాజీ ఆధారంగా వెలువడే అవార్డు తుది తీర్పుతో సమానమైనదని, దానిపై అప్పీల్‌కు అవకాశం ఉండదని వివరించారు. కావున రామన్నపేట జూరిస్డిక్షన్ పరిధిలోని ప్రజలు, కక్షిదారులు, న్యాయవాదులు, బ్యాంకు అధికారులు, ప్రభుత్వ శాఖల అధికారులు మరియు సంబంధిత వర్గాల వారు ఈ జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని తమ వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి - కమ్ - చైర్మన్ జి. సబిత పిలుపునిచ్చారు.

# రైతుల సంక్షేమమే లక్ష్యంగా కీలక నిర్ణయాలు

### -ఆదిలాబాద్ మార్కెట్ యార్డుల అభివృద్ధికి ఏకగ్రీవ తీర్మానం

### ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి

**మీడియా టుడే జిల్లా ప్రతినిధి ఆదిలాలాబాద్ జూన్12**

ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)కి వచ్చే రైతుల శ్రేయస్సు మరియు వారికి మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పలు ప్రతిష్టాత్మక అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు ఆదిలాలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాకాంత్ రెడ్డి వెల్లడించారు. గురువారం ఆయన అధ్యక్షతన వ్యవసాయ మార్కెట్ కమిటీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాలకవర్గం పలు అభివృద్ధి పనులకు ఏకగ్రీవంగా ఆమోదం తెలుపుతూ, ప్రభుత్వానికి మరియు మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాలని తీర్మానించింది.ఈ సమావేశంలో ప్రధానంగా రైతుల మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి పలు కీలక పనులను ఏకగ్రీవంగా ఆమోదించారు. అన్నదాతలు మార్కెట్ యార్డులో ఎలాంటి ఇబ్బందులు పడకుండా, వారికి పూర్తి సౌకర్యాలు కల్పించడానికే ఈ తీర్మానాలు చేసినట్లు చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ జనరల్ బాడీ సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ తన్వీర్ అహ్మద్ పటేల్, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, ఆదిలాబాద్. ఎఫ్‌ఎఫ్ చైర్మన్ మేస్త్రం పరమేశ్వర్, , జిల్లా మార్కెటింగ్ అధికారి (ఏఎంఓ) గజానంద్ , సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ విట్టల్, మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# బోర్నపల్లి ఎంజిఎన్ఆర్ ఈజీఎస్ సామాజిక తనిఖీ

### పని ప్రదేశానికి సందర్శించిన గ్రామ సర్పంచ్ రామకృష్ణ గౌడ్



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి మీడియా టుడే జూన్ 12**

జిల్లాలోని టేకుమట్ల మండలంలోని బోర్నపల్లి గ్రామపంచాయతీ నందు ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పనిలో భాగంగా బోర్నపల్లి పెద్ద చెరువు లో సామాజిక తనిఖీ ఎస్ఆర్పి పని ప్రదేశం సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నేరెళ్ల రామకృష్ణ గౌడ్ పాల్గొన్నారు. ఉపాధి హామీ కూలీలకు రోజువారి వేతనం మొఖ గుర్తింపు హాజరు కొలతలు పైన అవగాహన కల్పించడం జరిగింది,పని వద్ద సౌకర్యాలు కూడా కల్పించాలని ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ రైతు చెరువు మట్టిని పొలాల్లో వేసుకోవడం వల్ల రైతులు ఉపయోగం కలుగుతుంది అని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ఉపయోగ పడుతుందని ఆయన ఈ సందర్భంగా అన్నారు. రోజువారి వేతనం 307 రూపాయలు వచ్చేవిధంగా కొలతల ప్రకారం పని చేయగలరని కూలీలకు సవివరంగా తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ రేణిగుంట్ల కొమరమ్మ, ఎస్ఆర్పి సోషల్ అడిట్ ప్రదీప్, ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామస్తులు ఉపాధి కూలీలు రైతులు తదితరులు ఈ కార్యక్రమంలోపాల్గొన్నారు.

## అర్హులైన వారందరికీ అక్రిడిటేషన్ మంజూరు

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



**గద్వాల జిల్లా మీడియా టుడే ప్రతినిధి జి నాగరాజు (జూన్ 12)**
2026.. 28 కి సంబంధించిన జర్నలిస్టుల ఆక్రెడిటేషన్ అర్హులైన ప్రతి ఒక్కరికి మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో మీడియా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు కార్డుల మంజూరు పై చర్చించారు. అర్హులైన ప్రతి ఒక్క జర్నలిస్టుకి అక్రిడిటేషన్స్ మంజూరు అవుతాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ అరీఫుద్దీన్, ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్, మీడియా కమిటీ సభ్యులు అక్బర్ బాషా, పెద్ద ఇస్మాయిల్, రవీందర్ రెడ్డి, నల్లన్న, వెంకటేష్, సిరాజ్, భీమ రాయుడు, జాన్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే లక్ష్యంగా కీలక నిర్ణయాలు

**-ఆదిలాబాద్ మార్కెట్ యార్డుల అభివృద్ధికి ఏకగ్రీవ తీర్మానం**

**ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి**



**మీడియా టుడే జిల్లా ప్రతినిధి ఆదిలాలాబాద్ జూన్12**
ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ూవీజ)కి వచ్చే రైతుల శ్రేయస్సు మరియు వారికి మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పలు ప్రతిష్టాత్మక అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు ఆదిలాలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాకాంత్ రెడ్డి వెల్లడించారు. గురువారం ఆయన అధ్యక్షతన వ్యవసాయ మార్కెట్ కమిటీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాలకవర్గం పలు అభివృద్ధి పనులకు ఏకగ్రీవంగా ఆమోదం తెలుపుతూ, ప్రభుత్వానికి మరియు మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాలని తీర్మానించింది. ఈ సమావేశంలో ప్రధానంగా రైతుల మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి పలు కీలక పనులను ఏకగ్రీవంగా ఆమోదించారు. అన్నదాతలు మార్కెట్ యార్డులో ఎలాంటి ఇబ్బందులు పడకుండా, వారికి పూర్తి సౌకర్యాలు కల్పించడానికే ఈ తీర్మానాలు చేసినట్లు చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ జనరల్ బాడీ సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ తన్వీర్ అహ్మద్ పటేల్, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, ఆదిలాబాద్. ూాజూ చైర్మన్ మేస్త్రం పరమేశ్వర్, , జిల్లా మార్కెటింగ్ అధికారి (ఐమీూ) గజానంద్ , సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ విట్టల్, మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భూపతిపూర్ లో శుక్రవారం వారసంత



**రాయికల్-మీడియా టుడే-జూన్ 12:**
రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామంలో ప్రతి శుక్రవారం వారసంత నిర్వహించబడునని సర్పంచ్ గుర్రం భావన...పాలకవర్గం తెలిపారు. వీరు మాట్లాడుతూ చుట్టూ పక్క ఉన్న గ్రామాల ప్రజలందరూ ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంత వల్ల ప్రజలకు నిత్యావసర వస్తువుల అందుబాటులో ఉంటాయని అన్నారు.

# ఈత వనం దగ్ధం



**రాయికల్-మీడియా టుడే-జూన్ 12:**
రాయికల్ పట్టణ శివారులోని ఇటిక్యాల రోడ్డులో గల పట్టణ గౌడ సంఘానికి చెందిన 5 ఎకరాలలో విస్తరించిన ఈత వనం శుక్రవారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఈత వనంలో మంటలు చెలరేగి సుమారు 800 చెట్లు పూర్తిగా కాలిపోయాయి. మంటలు చూసి అక్కడే ఉన్న గీత కార్మికులు ఫైర్ స్టేషన్ కు ఫోన్ చేసినప్పటికీ... ఫైర్ ఇంజన్ రావడం ఆలస్యం కావడంతో చెట్లు పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యాయి. నష్టపోయిన గీత కార్మికులను ఆదుకోవాలని కోరుతున్నారు.

# నిర్మల్ జిల్లాలో విజయవంతంగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి

### -జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**మీడియా టుడే జిల్లా ప్రతినిధి ఆదిలాలాబాద్ జూన్12**
నిర్మల్ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో పాత్రికేయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 1 లక్షా 58 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంటను కొనుగోలు చేసి, గోదాములకు తరలించినట్లు వివరించారు. 1 లక్షా 75 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి మిల్లులు, గోదాములకు తరలించినట్లు పేర్కొన్నారు. 30 వేల మెట్రిక్ టన్నుల జొన్న పంట దిగుబడి రాగా, ఇప్పటికే 20 వేల మెట్రిక్ టన్నుల జొన్న పంటను కొనుగోలు చేశామని, మిగిలిన ధాన్యాన్ని మరో మూడు రోజుల్లో పూర్తిగా కొనుగోలు చేస్తామని తెలిపారు. పంట కొనుగోలుకు సంబంధించి, డబ్బులను ఎప్పటికప్పుడు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని వివరించారు. క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తి చేయగలిగామని చెప్పారు. రానున్న పంట కాలానికి సంబంధించి రైతులకు ఎరువుల కొరత రాకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రైతులెవరూ కూడా యూరియా లభ్యతపై ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని, జిల్లాలో సరిపడినంత యూరియా అందుబాటులో ఉందని అన్నారు. ప్రస్తుతం 10734 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. రైతులు వారి అవసరాన్ని బట్టి యూరియా బుకింగ్ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోవాలని చెప్పారు. ప్రతి ఎరువుల దుకాణం వద్ద ప్రత్యేకంగా ఒక పోస్టరును అందుబాటులో ఉంచుతామని, ఇందులో ఎరువుల ధరలు, తదితర వివరాలు ప్రదర్శించబడతాయని అన్నారు. రైతుల వద్ద ఎరువుల కోసం అధిక ధరలు వసూలు చేస్తే, 8977751754 నంబరును సంప్రదించవచ్చునని వివరించారు. ఎరువుల దుకాణదారులు, రైతుల వద్ద నుంచి అధిక డబ్బులు తీసుకోరాదని హెచ్చరించారు. అధిక డబ్బులు తీసుకునే దుకాణదారులపై కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఇప్పటికే అధిక ధరలకు ఎరువులను విక్రయించిన పలు దుకాణదారులకు నోటీసులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. ఈనెల 26వ తేదీ నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభమవుతున్నందున, ప్రజలకు ఈ ప్రక్రియపై మీడియా మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ పాత్రికేయుల సమావేశంలో పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, మార్క్ ఫెడ్ డీఎం మహేష్, డిఆర్డిఓ విజయలక్ష్మి, హార్టికల్చర్ అధికారి రమణ, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

### ఐసా విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షురాలు బుర్ర స్వాతి

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి మీడియా టుడే జూన్ 12:**
జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రవేట్ స్కూల్ లపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా) జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు బుర్ర స్వాతి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా స్కూలు పేద ప్రజలను మోసం చేస్తూ విద్యార్థులు ఆకర్షించే దానికోసం వారి ఫ్లెక్సీలలో హోర్డింగ్స్ లో స్కూల్ పేర్లతో పాటు ఐఐటి, జేఈఈ, నీట్, సివిల్స్,మెడికల్ ఫౌండేషన్స్ లశీటూ పదాలను ఉపయోగిస్తున్నారని వాటి పేరు మీద ఫీజులు అధిక మొత్తంలో వసూలు చేస్తూ దౌర్జన్యంగా పేద ప్రజలను మోసం చేసేందుకు కొన్ని ప్రైవేటు స్కూల ను సంగ్రామ విచారణ జరిపి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ నెలలో పాఠశాల ప్రారంభమయం అయ్యేలోపు జూన్ 12వ తారీకు లోపు ఈ పదాలను తొలగిస్తూ పాంప్లెట్స్ గాని ఫ్లెక్సీలు గాని లేకుండా చూసుకోవాలని లేనిపక్షంలో ఆ పేర్లను ఉపయోగిస్తున్న ప్రైవేట్ స్కూల్లో ముందు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని ఆమె హెచ్చరించారు. దీనిలో ఐసా విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి బందు సుజాత తదితరులు పాల్గొన్నారు.




# ప్రమాదరహిత హుస్నాబాద్ కోసం
# పోలీసుల 99 రోజుల యజ్ఞం

**హెల్మెట్ లేకుంటే ప్రమాదమే కాదు కుటుంబ భవిష్యత్తుకే ముప్పు**

**హుస్నాబాద్‌లో 99 రోజుల రోడ్డు భద్రతా అవగాహన**

**సీపీ సాధన రష్మీ పెరుమాళ్, కలెక్టర్ హైమావతి, మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక సందేశాలు**







**హుస్నాబాద్, జూన్ 12 :**
రోడ్డు ప్రమాదాలు కేవలం ఒక వ్యక్తి జీవితాన్నే కాదు, ఒక కుటుంబ భవిష్యత్తును కూడా ఛిన్నాభిన్నం చేస్తున్నాయని, రోడ్డు భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి, పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ పిలుపునిచ్చారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 99 రోజుల రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం ముగింపు సభ హుస్నాబా ద్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజల అవగాహనే ప్రధాన ఆయు ధమన్నారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగాన్ని ప్రతి ఒక్కరూ తప్పనిసరి అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని, కుటుంబాల భద్రత కోసం ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని పిలుపునిచ్చారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ, గత ఐదు నెలలుగా జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం కేవలం చట్టపర మైన నిబంధన మాత్రమే కాదని, ప్రాణాలను కాపాడే రక్షణ కవచమని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో పోలీసులు కేవలం శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కాకుండా, క్షతగాత్రుల ప్రాణాలను కాపాడేందుకు కూడా వెంటనే స్పందిస్తున్నారని ఆమె తెలిపారు. ప్రజల్లో చైతన్యం పెంచేందుకు హెల్మెట్ ధరించని వారికి పూలదం డలు వేసి, చాక్లెట్లు అందజేస్తూ వినూత్నంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చినట్లు వివరించారు. ప్రమాదరహిత హుస్నాబాద్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ, సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా రోజుకు సగటున ఒకరు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతుండటం ఆందోళన కలిగించే విషయ మన్నారు. ఒక కుటుంబంలో కీలక సభ్యుడు ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం మొత్తం తీవ్ర ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. అందుకే కుటుంబ



సభ్యులంతా కలిసి రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు .వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ మాట్లాడడం, అతివేగంగా ప్రయాణిం చడం, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, సీట్‌బెల్ట్ ధరించకుండా కార్లు నడపడం వంటి చర్యలు ప్రమాదాలకు ప్రధాన కారణాలని ఆమె వివరించారు. పోలీస్ శాఖ రూపొందించిన అవగాహన వీడియోలు, ప్రచార కార్యక్రమాలు ప్రజల్లో మంచి చైతన్యం తీసుకొచ్చాయని అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హైమావతి ప్రత్యేకంగా మాట్లాడుతూ, అమావాస్య తిథిన, మంగళవారం రోజుల్లో ప్రయాణాల సమయంలో ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు గమనించామని తెలిపారు. జ్యోతిష్య పరంగా రాహు గ్రహ ప్రభావానికి సంబంధించిన ఈ రోజుల్లో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి నుంచి బయలుదేరే ముందు తమ ఇష్టదైవాన్ని భక్తిశ్రద్ధలతో స్మరించి, ప్రశాంతంగా ప్రయాణాన్ని ప్రారంభిస్తే మానసిక ధైర్యం పెరిగి సురక్షిత ప్రయాణానికి దోహదపడుతుందని పేర్కొన్నారు .రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన బాధ్యతగా భావించి నిబంధనలు పాటిం చాలని వక్తలు సూచించారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియో గాన్ని రోజువారీ అలవాటుగా మార్చు కోవడం ద్వారా అనేక ప్రమాదాలను నివారిం చవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతిని ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. "ప్రమాద రహిత హుస్నాబాద్ – సురక్షిత సిద్దిపేట" లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో జిల్లా అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్, వివిధ శాఖల జిల్లా డివిజన్ స్థాయి అధికారులు, హుస్నా ఃబాద్ ఏసిపి సౌడారపు సదానందం, సీఐ కొంగ్ర శ్రీనివాస్, హుస్నాబాద్ ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి, అక్కన్నపేట ఎస్సై చాతరజు ప్రశాంత్, పోలీసు సిబ్బంది స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.